ISSN No:2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 1 సంచిక - 9 జూన్ - 2020 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20




సాహితీస్రవంతి



అరుణాచల్ ప్రదేశ్‌లో ఈ నదిని కమెంగ్ అని, అస్సాంలో జియా బొరేలీ అంటారు.
నది ఒడ్డున గల నమేరి నేషనల్ పార్కు దగ్గర తీసిన ఫొటో: ఎస్.ఎస్.బి. గేరా - 9492922492

# సాహిత్య ప్రస్థానం

సంపాదకీయం

## లాక్‌డౌన్ అనంతరం...

దేశంలోనూ రాష్ట్రాలలోనూ లాక్‌డౌన్‌ను దాదాపు తొలగించినా కరోనాకు కారణమైన వైరస్‌ను మనం తొలగించలేము. అలాగే ఆ లాక్‌డౌన్ ఫలితంగా తలెత్తిన సంక్షోభాలూ సమస్యలూ వెంటనే తొలగిపోవు. పేద మధ్య తరగతి ప్రజలు చిరుద్యోగులూ నిరుద్యోగులూ రైతులు వ్యవసాయ కార్మికులూ అందరినీ మించి దేశాన్ని కంటతడిపెట్టించిన వలస కార్మికులూ చాలా కాలం పెనుగులాడవలసే వుంటుంది. పైగా వ్యాపారాలు పరిశ్రమలకు ఉద్దీపన పేరిట కార్మికులు ఉద్యోగుల హక్కుల కత్తిరింపు కత్తి వేళ్లాడుతూంది. ఇంకో వైపున కరోనా విస్తృతంగానే తాకిన పరిస్థితులలో మన వైద్య వ్యవస్థ దాన్ని తట్టుకోగల సన్నద్ధత పూర్తిగా సంతరించుకోలేదు. వైద్య రంగంలో దాదాపు 60 శాతం సేవలందించే కార్పొరేట్ వైద్యశాలలు ఆ సవాలును స్వీకరించడానికి సిద్ధం కాలేదు. అయినా వాటి భారం సామాన్యులు భరించగలిగింది కాదు. చేతులు కడుక్కోవడం, దూరం పాటించడం వంటివి అందులో ఒక భాగమే కాని అవి వ్యాప్తిని మాత్రమే అరికడతాయి. వ్యాధిని కాదు. ఈ విధంగా లాక్‌డౌన్ అనంతర పరిస్థితిలో ఒకవైపున ప్రాణాంతక వైరస్ నుంచి మరో వైపున జీవిత సవాళ్ల నుంచికూడా కాపాడుకోవడానికి చాలా తీవ్రంగానే పోరాడక తప్పదు.

లాక్‌డౌన్ సమయంలో సాహిత్యజీవులు కూడా మానవీయ స్పందనలో ముందున్నారు. గణనీయంగా బాధితులకు సహాయ పడిన వారు కొందరైతే రచనలూ పాటలతో కదిలించిన వారు మరికొందరు. సాహిత్య సమ్మేళనాలు సాధ్యం కాని స్థితిలో ఆన్‌లైన్‌లోనే కవితలు సాహిత్యోపన్యాసాలు కొనసాగించడం వారి నిబద్ధతకు నిదర్శనం. ఒకటి రెండు తరాలలో ఎరుగని ఈ అనుభవం అక్షరీకరించడం ఒక సింహావలోకనమే గాక భావి కాలానికి తరాలకూ దిక్సూచిగా కూడా వుంటుంది. ◆


ప్రధాన సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
వొరప్రసాద్

సంపాదకవర్గం:
కె. సత్యరంజన్ ◆ చీకటి దివాకర్
గనారా ◆ శమంతకమణి ◆ కెంగార మోహన్
మేనేజర్: కె.లక్ష్మయ్య

బొమ్మలు:
తుంబలి శివాజి
చిదంబరం
గంగాధర్ వీర్ల
ముఖచిత్రం పెయింటింగ్ : అక్బర్



Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akualvari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## ఈ సంచికలో ... సాహిత్య ప్రస్థానం జూన్ 2020

### కథలు


**అందనంత దూరం** – డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి...... 5
**1957** – గనారా........................................ 28
**అమ్మకేమైంది** – చేలిక రాజేంద్రప్రసాద్............... 44
**సంకల్పం** – వల్లూరి శివప్రసాద్....................... 57


### కవితలు


**అమ్మా! నీకు వందనం!** – మందరపు హైమవతి........ 14
**కాలరెగరేసిన చెట్టు** – నవీన్............................. 14
**చినుకు మాట్లాడితే** – వారణాసి భానుమూర్తి రావు...... 18
**పట్టాల కింద దేశం** – శిఖా – ఆకాష్................... 19
**కరోనాను బొందవెడ్దాం** – పున్నమి వెంకటయ్య......... 19
**ల్యాండ్‌స్కేప్ గార్డెన్** – తిరునగరి శరత్‌చంద్ర........... 23
**రాతి మనసులు** – ప్రసాద్‌బాబు పి.యస్.వి. .......... 26
**బంట్రోతు** – చిన్ని నారాయణరావు...................... 27
**దారి తప్పిన ఋతురాగం**
– చందలూరి నారాయణరావు...................... 27
**రైతు మొగ్గలు** – డా॥ భీంపల్లి శ్రీకాంత్................. 27
**సమైక్య గీతిక** – కోడిగూటి తిరుపతి..................... 32
**సైకిల్** – హిందీ మూలం: అనంత్ మిశ్రా
– తెలుగు :విజయ్‌చంద్ర............................ 33
**వాడు – మేము** – జి. పేరిందేవి......................... 33
**అదృశ్య యవనిక** – ఆర్. లక్ష్మి........................... 35
**ప్రజ్వలన** – పి. లక్ష్మణరావ్............................... 36
**ఔను... వారు కరోనాను జయించారు!**
– సరికొండ నరసింహరాజు...................... 36
**లాక్డౌన్ కాలం** – ఆవుల చక్రపాణి యాదవ్............. 39
**ఎర్రని పాదముద్రలు**– ఎస్.ఏం.సుభాని................. 39
**కవిత్వం లేని కవితలో** – సాంబమూర్తి లండ........... 42
**కన్నీటిని తుడిచే చేయి** – శ్రీలక్ష్మి చివుకుల.............. 43
**దూరాంతరం** – గరికపాటి మణీందర్.................... 43
**కాళ్ళు పాఠాలు చెబుతాయి** – పొత్తూరి సుబ్బారావు..... 48
**ఇక్కడ ప్రవేశం లేదు** – పుట్టపర్తి మల్లికార్జున........... 48
**ఎవరిదీ చూపు** – విజయ్ కోగంటి........................ 51
**ఎంతెంత దూరం** – యు. సోమకుమారి................. 52
**తలుపు కొట్టిన చప్పుడు** – మయూఖ్ ఆదిత్య........... 52
**తల్లివేరు తలపులో** – దామరకుంట శంకరయ్య........ 55
**కొత్తపాఠం** – ఈతకోట సుబ్బారావు...................... 56
**ఆలో లక్షణా అన్న శోకాలు..** – సి.హెచ్.వి. లక్ష్మి...... 63
**మర్రి మనిషి** – డా॥ ఉదారి నారాయణ................. 66
**కాటేసిన విషవాయువు** – కొలిపాక శ్రీనివాస్........... 66


### వ్యాసాలు


**కరోనా కవిత్వం వలసజీవుల వెతలు**
– అయ్యగారి సీతారత్నం........................ 15
**దర్జీల వాస్తవ జీవనచిత్రం** – ఎస్. హనుమంతరావు.. 20
సాహిత్య ప్రస్థానం **మే 2020 పురస్కారాలు**............ 23
**దుర్భర ఘట్టంలో నిర్భర మంత్రాల నిజరూపం**
– తెలకపల్లి రవి.................................. 24
**కరవు చెలమల్లో తోడిన కన్నీటి కవిత్వం**
– జంధ్యాల రఘుబాబు.......................... 34
**మానవత్వాన్ని మేల్కొలిపే కవిత్వం**
– డా॥ పెంకి విజయకుమార్..................... 37
**సాహిత్యం ఎందుకు? ఎవరికి?** – శ్రీశ్రీ................ 40
**వైరస్‌ల వ్యాప్తితో విజృంభిస్తున్న వివక్ష**
– అర్చనా ప్రసాద్................................. 49
**స్ఫూర్తినిచ్చే కవితాస్రవంతి** – కెంగార మోహన్....... 53
**అనంత మాండలిక పదాల అధ్యయనం**
– పిళ్ళా విజయ్.................................. 64



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**


రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:
సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002,
ఫోన్: 0866-2577248, సెల్: 9490099059
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com



1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 / ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-
Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

కథ

# అందనంత దూరం



- డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి
9963917187

ఇప్పటికే ఊర్లో నలుగురికి కరోనా సోకడంతో వాళ్ళను పెద్దాస్పత్రికి తీసుకపోయారని, ఊరంత కిమ్మనకుండా ఎక్కడి వాళ్ళక్కడ ఇళ్ళుదాటి బయటకు రావడంలేదని, గ్రామ వాలెంటీరులు ఆరోగ్య కార్యకర్తలు, పోలీసులు వీధుల్లో తిరుగుతున్నారని ముసలమ్మ ఫోన్లో అనేసరికి తన ముగ్గురు పిల్లలు కళ్ళముందు మెదిలారు కరెక్కకు.

♦ ♦ ♦

కర్నూలు జిల్లా దక్షణభాగాన ఎర్రమలకొండల అంచున దుర్గం గ్రామం మల్లయ్య, కరెక్కలది. కొండలకు అటువైపున అనంతపురము జిల్లా ఉంటాది. దుర్గం గ్రామం చుట్టుపక్కలంతా ఎర్రనేలలే. వానలే పంటలకు ప్రధాన ఆధారం. కొండనీళ్ళతో ఊరి చెరువు నిండి కొంత ఆసారాగా ఉండేది. ఈ పదిహేనేళ్ళలో చెరువు నిండిన దాఖలాలు లేవు. ఊరి సమీపంగా అడవి ఉండటంతో మిగతా పల్లెలకంటే దుర్గం వాసులకు కొంత ఊరటగా ఉండేది. అడవిలో పశువులకు మేత లభించేది. ఆకులు అలుములు, కొండ కాయలు, గడ్డలు, అడివి జీవాల ఆధారంతో కరువుకాలం లోను మనుషులు కొంత నెట్టుకొచ్చేవారు. తేనె, బోదగడ్డి, కట్టెలు అమ్మి నాలుగు రూకలు పొందే వెసులుబాటు వీరికి ఉండింది.

ఈ మధ్య వరుస కరువులతో ఎర్రనేలల సేద్యం కన్నీళ్ళను మిగిల్చాయి. ఈ పంటలు పండేది వద్దు. ఉన్న పాణాలు పోగొట్టుకొనేది వద్దు. ఊపిరుంటే ఊర్లెంబడి పోయి బతుక్కోవచ్చని చాలామంది దుర్గం రైతులు నిర్ణయించుకున్నారు. గత కొన్నేళ్లుగా సుగ్గికిపోవడం మొదలెట్టారు. అరభాగం ఊరు ఎప్పుడూ వలసలలోనే ఉంటాది. కొందరు సాహసం చేసి పంట పెట్టి, ఆ ముచ్చట తీరగానే ఊరొదులుతారు. ఇంటివద్ద పిల్లలు, ముసలోళ్లు మాత్రమే ఉంటారు. ఇన్నాళ్ళు ఆ ఊర్లో వలస పోకుండా కాలానికి ఎదురీది సేద్యంలో నిలబడింది మల్లయ్య కుటుంబం. అందుకే ఆ కుటుంబం అందరికంటే ఎక్కువ అప్పులలో కూరకపోయింది. ఎన్ని ఎక్కువ భూములుంటే, అంత అప్పుల మూట సీమలో వెంటాడుతాది. ఈసారి మల్లయ్య కుటుంబం ఊరొదలక తప్పని పరిస్థితి ఎదురైంది.

ఈ ఏడు పంటలైపోగానే డిసెంబరు నెలలో చాలా కుటుంబాలు గుంతకల్లు చేరి రైలుదారిలో బెంగుళూరు బాటపట్టాయి. మల్లయ్య కుటుంబానికి ఇదొక కఠిన పరీక్షలా ఉంది. ఊరొదిలి పోవడం ఏమాత్రం మల్లయ్యకు మనసొప్పడం లేదు. ఊరొదలడం అనే ఆత్మాభిమానం కంటే ఈ ఎర్రనేల సేద్యంలో ఓడిపోయాననే బాధ మల్లయ్యను తీవ్రంగా వేదిస్తుంది. రాబోయే రోజుల్లో పంటపెడతాననే ఆశ కూడా అతనికి లేదు. ఎండిన ఎర్రచేనుకి ఇంటికి తిరగడమే తప్ప వేరే ఏ పనికూడా లేదు. ఇళ్ళు గడవడం కూడా కష్టమైపోతోంది. అప్పులు, వడ్డీలు నిద్రపట్టనీయడం లేదు. మల్లయ్య ముందు రెండే దారులున్నాయి. ఉన్న భూమి అయినకాడికి అమ్మడం లేదా ఊరొదిలి వలసెల్లి ఏదో ఒక పని చేసుకొని కుటుంబానికి కాస్తో కూస్తో ఆసరాగా ఉండడం. భూమి అమ్మడం కంటే వలస పోవడమే నయమనిపించింది. ఆత్మాభిమానం, గౌరవమర్యాదలంటూ మొండిగా ఎదురీదడం

కన్నా, తానొక్కడు ఓడిపోతూ అయినా సరే కుటుంబాన్ని కాపాడుకోవడం తనముందున్న కర్తవ్యంగా తోచింది మల్లయ్యకు. సంక్రాంతి పండగ కాగానే చివరగా మరికొన్ని కుటుంబాలు ఊరినుండి బయలు దేరుతున్నాయి. వారి వెంట వలసెల్లాలని మల్లయ్య, కరెక్కలు నిర్ణయించుకున్నారు.

పదోతరగతి పెద్దకొడుకు, ఏడో తరగతి చిన్న కొడుకు, మూడో తరగతి చిట్టి కూతురులకు తగు జాగ్రత్తలు చెబుతూ వస్తోంది కరెక్క. పిల్లలను కంటికి రెప్పలా చూసు కొంటుండమని ముసలామెకు ముందస్తుగా చెబుతూనే ఉంది. పండగ పోయిన మర్నాడే బెంగుళూరు పోవడానికి ఊరివాళ్ళు సిద్ధమయ్యారు. ఆ సాయంత్రం ఎర్రచేను చుట్టూ తిరిగి మల్లయ్య కళ్ళనీళ్ళు పెట్టుకొన్నాడు. ప్రతిరోజు తెల్లారే చేను వద్దకు వెళ్ళే అలవాటున్న మల్లయ్యకు రేపటి నుండి అది అందనంత దూరమైపోతాదనే బాధ అప్రయత్నంగా తన్నుకొస్తుంది. చీకటిపడగానే ఇంటికి చేరుకొన్నాడు. ఆ రాత్రి రెండు గోనె సంచులలో కావలసిన ఒకటిరెండు పాత్రలు, కొన్ని బియ్యం, జొన్నలు, అవసరమైన బట్టలు సర్దుకొన్నారు. అష్టకష్టాలు పడి ఇంట్లో పిల్లలకోసం ఒకనెలకు సరిపడ సరుకులుంచారు. పదోతరగతి పరీక్షలు రాయడానికి సిద్ధమవుతున్న పెద్దకొడుకుకు ఉన్న విషయాలన్నీ చెప్పి బాగా చదువుకోమని మల్లయ్య చెప్పాడు. తాను చదువుకోవడానికి ఎన్నికష్టాలు పడింది, చివరకు కరువుకారణంగా ఎలా బడి నిలిపేసింది తెలిపాడు. కొద్దికొద్దిగా పరిస్థితులను అర్థం చేసుకుంటున్నాడు పెద్దకొడుకు.

చిన్నవాడు, పాప, కరెక్క వద్దే పడుకొన్నారు. ఉదయాన్నే వలసెల్లుతున్న విషయమేమి ఎరుగని పాప అమ్మ గుండెలను హత్తుకొని నిద్రపోయింది. పాపని వదిలి పెట్టి పోవాలనే కఠోర సత్యాన్ని జీర్ణించుకోలేక పోతుంది కరెక్క. గుండెనిండా దుఃఖం ఉప్పొంగుకొస్తుంది. రాత్రంత కన్నీటి పర్యంతమై నిద్ర కూడా పట్టలేదు కరెక్కకు.

ఉదయం ఆరు గంటలకు పల్లె బస్సు వచ్చింది. ఊరివాళ్ళు సరుకుల గోనెసంచులను బస్సు పైకేస్తున్నారు. మల్లయ్య, కరెక్కలు ఇంట్లో నుండి గోనెసంచుల మూటలెత్తుకొని పోసాగారు. ఒక్కసారిగా పాప, చిన్నకొడుకు గడపకు అడ్డం నిలబడి ఏడ్చుడం మొదలెట్టారు. ముందుకు సాగిన అమ్మానానల కాళ్ళకు చేతులు చుట్టేసుకొన్నారు. పైన మూట కింద పిల్లల ఏడుపులు. మల్లయ్య, కరెక్కల కళ్ళ నీళ్ళు కారసాగాయి. ఆగితే ముందుకు సాగలేరు. ముందుకు సాగకపోతే బతుకు సాగదు. అంతటి దుఃఖంలోను మనసు గట్టి చేసుకొని పెద్దోడా చిన్నోడిని పట్టుకో, అమ్మ పాపను పట్టుకోమన్నాడు మల్లయ్య. ఇద్దరు పిల్లల రెక్కలు పట్టుకొన్నారు. వారి దీనాకారపు ఏడపుల నడుమే ఇళ్ళు దాటి బస్సెక్కారు. బస్సు ఊరు వదిలి గుంతకల్లుకు పోసాగింది.

మల్లయ్య, కరెక్కలు ఊరొదిలి వలసెల్లడం ఇదే తొలిసారి. అలవాటు పడిన మనషులైతే పర్లేదు. వీరికి ఈ ప్రయాణం అత్యంత బాధాకరంగ అనిపిస్తుంది. పసిబిడ్డలకు అందరానంత దూరమైపోతున్నామని తమలో తామె కుమిలి పోసాగారు. ఊరి పొలిమేర దాటడంతో తమదనుకొన్న ఊరుకూడా దూరమవసాగింది. ఇన్ని కష్టాలు బాధలు తమకు మాత్రమే వస్తున్నాయనుకున్నారు. తొమ్మిదికల్లా గుంతకల్లు రైల్వే జంక్షన్ చేరారు. పదిగంటలకు బెంగుళూరు ప్యాసింజర్ కోసం వేచి ఉన్నారు. ప్లాట్ ఫామ్ అంతా రద్దీగా ఉంది. ఎక్కడ చూసినా గోనెసంచుల మూటలు, పల్లెమనుషులు కనిపిస్తున్నారు. ప్రతి కుటుంబానిది తమలాంటి పరిస్థితే కదా అనుకొన్నారు. రైలు రానే వచ్చింది. అప్పటికే రైలంతా వలసలెల్లె పల్లెల ప్రజలు. కాలు పెట్టడానికి సందులేనంత మంది వలసజనంతో రైలు నిండిపోయింది. వాళ్ళతోపాటే మల్లయ్య, కరెక్క, ఊరిజనం రైలెక్కారు. రాత్రి కల్లా రైలు బెంగుళూరు చేరింది.

◆ ◆ ◆

ఊరి నుండే తెచ్చుకొన్న సద్దులను విప్పి రైల్వే స్టేషనులో తిన్నారు. ప్లాట్ ఫామ్ ల వద్ద గోనెసంచులు జాగ్రత్తగా ఒక వైపు ఉంచి అక్కడే అంతా పడుకొన్నారు. తెల్లారే ఒకో గుంపు ఒకో వైపు సిటీ బస్సులెక్కి పోసాగారు. దుర్గం వారి ఈ గుంపు తమ ఊరి వాళ్లు ఇదివరకే హొసూరు రోడ్డు వైపు వెళ్లి ఉండటంతో మెజిస్టిక్ నుండి అటువైపు బస్సులెక్కారు. అత్తిబెల్లి పరిసరాలలో దిగారు.

అక్కడ తమ ఊరివారుండే చోటుకు చేరారు.

మల్లయ్య, కరెక్కలు గుండె నిబ్బరంతో అక్కడికి చేరారు కానీ మనసంతా ఇంటివైపే లాగుతోంది. ప్రయాణపు అలుపులో కొంత మరిచారు కానీ తీరా అక్కడికి చేరి అడుగు పెట్టగానే తమ పిల్లలు, ఇళ్ళు, చేను, ఊరు గుర్తు రాసాగాయి. ఏ పిల్లలను చూసినా తమ పిల్లల లాగే కనిపిస్తున్నారు. గాలి, నీరు, నేల, భాష, మనుషులు అంతా కొత్తగా కనబడ్డాయి. మల్లయ్య కుటుంబం కూడా వలస రావడం అక్కడ ఉన్న వారందరికీ కంటతడి పెట్టించింది. పది మందికి అన్నం

పెట్టిన కుటుంబం ఇలా దేశాలెంబడి రావలసి వచ్చింది గదా అని బాధపడ్డారు. కరువుకు తన మన, మంచీ చెడూ లేదనుకొన్నారు. అందరూ కలుపుగోలుగా ఉంటూ మల్లయ్య, కరెక్కలను తమలో ఒకరిగా అక్కున చేర్చుకున్నారు.

మల్లయ్య అక్కడ ఒక భవన నిర్మాణ కూలీగా తమ ఊరి వారి వెంట వెళ్ళసాగాడు. కరెక్క ఆ పక్కనే చిన్న బట్టల ప్యాక్టరీలో కూలీగా పోసాగింది. మల్లయ్యకు నాలుగు వందలు, కరెక్కకు మూడువందలు ప్రకారం రోజుకూలి నిర్ణయమైంది. ఉండడానికి నెలకు మూడువేలు బాడుగ మేర ఒక చిన్న పెంకుటిల్లు కూడా దొరికింది. ఇద్దరి ఆదాయం కలిపి నెలకు పదహేను వేలు దాక రావచ్చనుకొన్నారు. ఇంటి బాడుగా, ఖర్చులు పోను కనీసం ఆరువేలు నెలకు మిగులుతుందనుకొన్నారు. పల్లె లొదిలి పట్టణం చేరి ఏదో ఒక పని చేసుకోవడంతో నాలుగు రూపాయలు కళ్లచూడొచ్చు, మనశ్శాంతిగా బతకొచ్చనే కదా వలసలొచ్చేదనుకొన్నారు. సేద్యంలో ఎగసెగలు పడేకంటే ఇది ఒకింత మేలే అని ఒక వైపు అనిపించినా మల్లయ్యకు మాత్రం మనసులో తృప్తి లేదు. అయిష్టంగానే తనకు నచ్చని పని చేస్తున్నట్టు అనిపించేది. తన భూమిలో చేసేపని ఎంత కష్టమైనదైన తనలో సంతోషం ఉండేది. తనకు నచ్చిన విధంగా చేసుకొనేవాడు. కానీ ఇక్కడ తానంతా కృత్రిమంగా సాగిపోతున్నాడు. కరెక్కకు కూడా ఇది మరీ ఇబ్బందిగానే ఉంది. సర్దుబాటు మనిషిని నడిపిస్తుంది. మొండిగా పోతే కాలంలో నిలవలేమని తమలో తాము ఓదార్చుకొన్నారు మల్లయ్య, కరెక్కలు.

ఊరిలో ముసలమ్మకు ఫోను చేసి విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకొంటున్నారు. పెద్దోడి పరీక్షలు దగ్గర పడుతుండటంతో బాగా చదవమని చెప్పడం మల్లయ్యకు ఊతపదమై పోయింది. ఫోన్ చేసినప్పుడల్లా చిన్నోడి, పాపల ఏడుపులు వినిపిస్తునే ఉన్నాయి. పిల్లలొక వైపు, ఎండిన ఎర్రచేను మరొక వైపు మనసును ఒక పట్టాన ఉండనీయడం లేదు మల్లయ్యని. అమ్మానాయనలు దూరమై పోవడాన్ని తట్టుకోలేక పోయారు పిల్లలు. కొన్నాళ్ళ పాటు అమ్మ నాయన అంటూ నిద్రలోను కలవరిచ్చు కోసాగారు. ఫోన్ చేసినపుడల్లా ఎందుకమ్మా నన్ని వదిలి వెళ్ళావు అని పాప అడిగే మాటలు కరెక్క గుండెను తాకుతున్నాయి. మనసును మెలి తిప్పేస్తున్నాయి. మాట్లాడలేక నిర్వీర్యురాలై పోతోంది కరెక్క. ఇంకో పదిరోజుల్లో తప్పకుండా వస్తాము. ఏడవకమ్మా, కొత్తబట్టలు, బ్యాగు అన్నీ తీసుకొస్తామని కరెక్క చెబుతోంది. నాకేమి వద్దు ఇప్పుడే మీరొచ్చేయండమ్మా అని పాప అనడంతో ఏమి మాట్లాడాలో దిక్కుతోచక ఏడుపాపుకోలేక పోయింది కరెక్క. ముసలమ్మ ఆ మాట ఈ మాట చెప్పి పాపను సముదాయించింది.

సరిగ్గా నెలరొజులు గడిచాయి. రేపోమాపో అన్ని ఖర్చులు పోను ఆరువేలు చేతికొస్తుందను కొన్నాడు మల్లయ్య. ఊరి వద్ద ఇంట్లో సరుకులు కూడా అయిపోయి ఉంటాయి. ఒక రోజు ఊరికి వెళ్ళి వాళ్ళకు కావలసినవి ఏర్పాటు చేసి, పిల్లలను, ఎర్రచేను చూసుకొని వస్తానని మల్లయ్య కరెక్కతో అన్నాడు. నాతోను అసలు కావడం లేదు. నేను కూడా వస్తానని కరెక్క అన్నది. డబ్బు చేతికి రాగానే బయలుదేరుదామని నిర్ణయించుకున్నారు.

ఆదివారం నాడు కరోనా విషయమై దేశమంతా ఒకరోజు జనతా కర్ఫ్యూ చేపడుతున్నట్లు ప్రధానమంత్రి గారి ప్రకటన వెలువడింది. సరే ఒక రోజుతో ఏమైతాది అటోఇటో ఇంకోరోజు పోతే సరిపోతాదనుకొన్నారు. ఆ రోజంతా ఇంట్లోనే ఉన్నారు. అసలు కరోనా వెనుక పెద్దకథే ఉందని ఆనోట ఈనోటా విన్నారు. ఎక్కడ చూసినా కరోనా విషయాలే వినపడసాగాయి. ఈ పూట గడిస్తే డబ్బు చేతికొస్తుంది మరుసటి రోజే ఊరికి వెళ్ళ వచ్చనుకొన్నారు. యథావిధంగా జనతా కర్ఫ్యూ మరుసటి రోజు పనికెళ్ళారు. రేపటికల్లా రావలసిన డబ్బు ఇవ్వాలని పనిచేసే చోట అడిగారు. ఎట్టకేలకు మరునాటికి డబ్బు చేతికొచ్చింది. ఆ రోజు సాయంత్రం మల్లయ్య అలా రోడ్డుపైకి వెళ్ళి కావలసినవి తీసుకొన్నాడు. చీకటిపడుతోంది.

జాతినుద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తారని రోడ్డుపక్క చిన్న హొటల్లో టీవీల చుట్టూ జనం గుంపయ్యారు. దేశమంతా పూర్తిగా ఇరవైఒక్కరోజులు లాక్ డౌన్ చేస్తారంట. బస్సులు, రైళ్ళు, విమానాలు ఏవి తిరగవని ఓ తెలుగాయన మల్లయ్యకు చెప్పాడు. ఈ మాట వింటుంటే మల్లయ్య గుండెల్లో సన్నని వణుకు మొదలైంది. చిన్నగా అడుగులేస్తు ఇంటికెళ్ళాడు. కరెక్కకు చెప్పాడు. అప్పటికే ఊరికి తీసుకెళ్ళాల్సిన ఒక బ్యాగు సర్ది, ఇంకో బ్యాగు కోసం కరెక్క వెతుకుతోంది. మల్లయ్య మాటలు వినేసరికి నిశ్చేష్టురాలైంది. మారు మాట్లాడలేకపోయింది.

ఉదయానికల్లా మల్లయ్య ఇంటి వైపున వీధులన్నీ రాళ్ళు అడ్డుపెట్టేసారు. రోడ్డుపై అంగళ్ళన్నీ మూసేశారు. ఇళ్లనుండి బయటకు రాకూడదని, మనుషులకు బారెడు దూరం

ఉండాలని, చేతులు కడుక్కొంటూ ఉండాలని, మొగానికి మాస్కులు వేసుకోవాలని, జలుబు, దగ్గు, జ్వరాలుంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి పోవాలని ఇలా ఎవేవో మైకుల్లో చెబుతున్నారు. వీధి వీధికి పోలీసులు కట్టెలు పట్టుకొని కాపలా ఉన్నారు. వీధుల్లో బయటకు వచ్చినోళ్ళ కాళ్ళు చేతులు వాయకుండా మాములుగా మళ్ళీ ఇళ్ళు చేరడం లేదు. ఏమి చేయాలో దిక్కు తోచడం లేదు మల్లయ్యకు.

ఊరికి ఫోన్ చేసి కరోనా అంటున్నారు. ఇంట్లో నుండి బయటకు పోకండి. శానా జాగ్రత్తగా ఉండండి. పిల్లోల్లు ఆడుకొనేకి, ఈతలకు పోతారేమో జాగ్రత్తగా ఉండమని అమ్మతో మల్లయ్య చెప్పాడు. ముసలోళ్ళకి ఇది మరీ ప్రమాదం అంటున్నారు మరిన్ని జాగ్రత్తలు చెప్పింది కరెక్క. రోజు ఇంటి పట్టునే చదువుకొమని పెద్దోనికి, అవ్వయ్య, అన్నయ్య చెప్పినట్టు వినాలని చిన్నోడికి, పాపకు చెప్పింది కరెక్క. మీరెప్పుడొస్తారని పాప అడిగే సరికి వచ్చేస్తామమ్మా బయలుదేరుతామని చెప్పింది. పాప నుండి ముసలమ్మ ఫోను తీసుకొని ఈ రోజో, రేపో మీరొస్తారని ఉంటిమి. ఇంట్లో సరుకంతా అయిపోయింది. ఈ మూట జొన్నలు కూడా అయిపోయమ్మా, శాన కష్టమైపోతాందమ్మా అని కరెక్కతో చెప్పలేక చెప్పింది ముసలమ్మ. వాళ్ళు ఆకలితో అల్లాడతారంటే తట్టుకొంటామా అని బోరున ఏడ్వసాగింది కరెక్క.

మల్లయ్యకు పరిస్థితి అర్థమయింది. ఫోను తీసుకొని అమ్మా మేము ఎలాగోలా వచ్చేస్తాము. కోళ్ళకోసం నూకలగింజలు ఎద్దల కొట్టంలో ఉన్నయోమో చూసి, అవి బాగుచేసి నాలుగు రోజులు కాలం గడుపమ్మా అని చెప్పి నిలువెత్తు మనిషి మౌనమై పోయాడు. ఆరోజు నుండి కనబడే ఏడుపు కరెక్క దైతే, కనబడని ఏడుపు మల్లయ్యది.

పదిరొజులైపోయింది. ఇంకో పదిరోజులు ఎలాగో ఒకలా గడిస్తే బస్సో, రైలో పట్టుకొని ఊరు చేరుకోవాలనుకొన్నారు మల్లయ్య, కరెక్కలు. తమ కష్టమంతా పక్క వీధిలో ఉన్న వారి ఊరి వాళ్ళతో చెప్పుకొనేది కాదు. ఏదో ఉన్నంతలో గంభీరంగా ఇక్కడ నుండి బయట పడాలనుకొన్నారు. నాలుగు పూట్ల వస్తైనా ఉండచ్చు గానీ ఇంటి గుట్టు బయట పడకూడదనుకొన్నారు. పక్క వీధిలో తమ ఊరి వాళ్ళను కలిసినా తమ కష్టాలేమి ప్రస్తావించకుండా పొడి పొడిగా మాట్లాడి వచ్చేస్తున్నాడు మల్లయ్య. ఎప్పుడెప్పుడు లాక్ డౌన్ ఎత్తేస్తారా? ఊరు చేరుకొందామా అని వేయికండ్లతో ఎదురు చూడసాగారు. ఈ ఇరవై రోజులు ఒకపూట మాత్రమే తిని చేతిలో ఉన్న ఆరువేలలో కనీసం ఐదువేలైనా ఇంటికి తీసుకెళ్ళాలనుకొన్నారు.

లాక్ డౌన్ ముగిసే రోజు దగ్గరవుతోంది. అంతకు ముందు రోజు సాయంత్రం ప్రధానమంత్రి జాతినుద్దేశించి మరోసారి ప్రసంగిస్తారని పక్క వీధిలో అనగా మల్లయ్య విన్నాడు. జాతినుద్దేశించి ప్రసంగం అంటుంటే మల్లయ్యకు ఎక్కడలేని ఆందోళన మొదలైంది. సాయంత్రానికి ప్రసంగం ప్రారంభమైంది. 'ఉన్నీస్ దిన్ లాక్ డౌన్' అని ప్రకటించేశాడు ప్రధానమంత్రి. ఇంక మాకు దేవుడే దిక్కనుకొన్నాడు మల్లయ్య. ఇంటికొచ్చి మరో పంతొమ్మిది రోజులు లాక్ డౌన్ చేస్తున్నారంట అని కరెక్కతో చెప్పాడు. ఎంతో శాంతంగా ఉండే కరెక్క ఒక్కసారిగా భీకర రూపమైపోయింది. పట్టరాని ఆవేశంతో నోటికొచ్చినట్లు ప్రభుత్వాల్ని, పాలకులను తిట్టబట్టింది. మల్లయ్య కొంత సముదాయించాడు.

మరుసటి రోజు ఉదయాన్నే ఊరిలో ముసలమ్మకు ఫోన్ చేసింది కరెక్క. వారం కింద వేరేదేశం నుండి ఇంటికి వచ్చిన పెద్దింటోళ్ళ అబ్బాయికి కరోనా ఉందేమోనని అధికారులు పెద్దాసుపత్రికి తీసుకెళ్ళారు. కరోనా ఉందని తేలడంతో ఇంట్లోని వాళ్ళను, ఇంటి పక్కల మొత్తం మరో ముగ్గురిని ఈ రోజే తీసుకెళ్ళారు. ఊరంత అల్లకల్లోలంగా ఉంది. వేసిన వాకిళ్ళు తీయడం లేదని ముసలమ్మ గసపోతు చెప్పుకొచ్చింది. భరించరాని దుఖం పొంగుకొచ్చింది కరెక్కకు. పిల్లోళ్ళు జాగ్రత్త. బయటకు వెళ్ళకండి. మళ్ళీ లాక్ డౌన్ అంటున్నారు. మేము ఈ రోజే బయలుదేరి నడుస్తా అయినా ఇంటికి చేరుకొంటామంటూ ముసలమ్మకు ధైర్యం చెప్పింది కరెక్క. ఊర్లో కరోనా సోకినమాట విన్నప్పటి నుండి మనససు ఒక పట్టాన ఉండటం లేదు కరెక్కకు. చాలా దిగాలైపోయింది. ముందూ వెనకా చూసుకోకుండా నడుస్తా అయినా వచ్చేస్తామనిందే కానీ, అది అయ్యే పనేనా అని తనలో తానే అలోచించ సాగింది. పొరపాటున ముసలమ్మకు కరోనా సోకితే అమె గతి ఏమి కాను. బిడ్డల పరిస్థితి ఏమవుతాదోనని పరిపరి విధాలుగా మనసు పోతుంది కరెక్కకు. ఊర్లో జరుగుతున్న కరోనా విషయం మల్లయ్యకు చెప్పింది. ఇంకా ఇక్కడే ఉండడం మంచిదికాదన్నది కరెక్క. మల్లయ్య మౌనంగా తలూపాడు.

పక్కవీధిలో ఉన్న తమ ఊరి వాళ్ళ వద్దకు వెళ్ళాడు మల్లయ్య. ఊరికి వెళ్ళాలనుకొన్నామని వాళ్లతో చెప్పాడు. మన ఊరేమన్నా ఇక్కడుందా? అందరానంత దూరాన

ఉంది. మూడు వందల యాభై కిలోమీటర్లు, రోజుకు ముప్ఫై కిలోమీటర్లు అనుకొన్నా పన్నెండు రోజులు పడతాది పోవాలంటే. ఈ ఎర్రటి ఎండలకు ఎమన్నా అయితే ఎవరు దిక్కు. ఆ పని మాత్రం చేయకండని ఊరివాళ్ళు అన్నారు. వేరే దారి లేదు ఇంటికి చేరుకోవాల్సిందే. ఊర్లో కరోనా ఉందట. పిల్లలకేమవుతాదో అని భయమేస్తుంది. నడుస్తానే వెళ్ళిపోతాము అన్నాడు మల్లయ్య. మేమైతే ఎవరు రాలేము. లేని సమస్యలు ఎందుకు? మీరు కొన్నాళ్ళు ఓపిక పడితే వెళ్ళవచ్చు. టౌన్లో మనుషులను కదలనీయడం లేదు. ఇది అయ్యేపని కాదన్నారు ఊరివాళ్ళు. వెళ్ళక తప్పదు ఈ రోజే బయలుదేరు తామన్నాడు మల్లయ్య. ఇక్కడ నుండి టౌన్లో దారిన పోతే పోలీసులు అడ్డుకొంటారు. తప్పదంటున్నావు కాబట్టి టౌన్లో కి పోకుండా, దూరం కూడా తగ్గే అడ్డదారొకటుంది. ఇక్కడ నుండి దక్షిణానికి నలభై కిలోమీటర్లు పోతే హొస్కోట కు చేరుకొంటారు. అక్కడనుండి ఇరవై కిలోమీటర్లు ఎయిర్పోర్ట్ కు దిగదాల నుండి పోతే దేవనహళ్ళి వద్ద హైవే కు చేరుకుంటారు. హైవే మీద ఒకటే దారెంబడి పోతే చిక్కళ్ళాపురం, చెక్ పోస్ట్ మీదుగా అనంతపురము జిల్లాకు చేరుకుంటారు. ఇంక మీకు భయముండదు. అక్కడ నుండి అనంతపురము, గుత్తిమీదుగా ఊరు చేరుకోవచ్చని ఊరివాళ్ళు సలహా ఇచ్చారు.

అవసరమైన వస్తువులు మాత్రమే రెండు బ్యాగులకు సర్దుకొన్నారు. నీళ్ళకోసం ప్లాస్టిక్ బాటిళ్ళను ఒకో బ్యాగులో రెండు పెట్టుకొన్నారు. దారిలో తిండికోసం అన్నం, కొన్ని రొట్టెలు తీసుకొన్నారు. సెల్ ఫోన్ చార్జింగ్ కూడా నిండుగా ఉంచారు. టార్చిలైట్ తో పాటు అదనంగా కొన్ని సెల్సులూ ఉంచుకున్నారు. రాత్రి ప్రయాణం కాబట్టి ఎందుకైనా మంచిదని ఒక చిన్న పిడిబాకు కూడా ఉంచుకొన్నాడు మల్లయ్య. అప్పటికే సాయంత్రం ఆరుగంటలవుతోంది. దూరాన వీధి చివర ఒకరిద్దరు పోలీసులున్నారు. తొమ్మిది కల్లా పోలీసులు అక్కడ నుండి వెళ్ళిపోయారు. వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. సరిగ్గా పది గంటలకు ఇంటికి తాళం వేసారు. ముఖానికి మాస్కులు కట్టుకొని, బ్యాగులు భుజానికేసుకొని మల్లయ్య, కరెక్కలు బయలుదేరారు.

◆ ◆ ◆

వెన్నల విరగ్గాస్తోంది. ఒకో వీధి దాటుకొంటూ పట్టణం బయట పడ్డారు. పెద్ద చిక్కులో నుండి బయటపడ్డామన్నంత ఆనందమయింది మల్లయ్యకు. రాత్రింబవలు ప్రయాణం సరిగ్గా సాగితే ఐదు రోజుల్లో ఊరు చేరు కోవచ్చనుకొన్నారు. మాట్లాడుతూ పోతే అలసిపోతామని మౌనంగా నడకసాగిస్తున్నారు. అందులోను మూతికి మాస్కులు కూడా అడ్డున్నాయి. ఏదైనా ప్రయత్నపూర్వకంగానే అప్పుడప్పుడు ఒకో మాట మాట్లాడుకొంటున్నారు. వారిద్దరి మనసులూ వేగంగా ఊరు చేరుకోవడమే తప్ప రెండో ఆలోచన రావడం లేదు. తెల్లవారుజామున మూడుగంటలకు హొస్కోట దాటేశారు. హొస్కోట నుండి దేవనహళ్లి దారిపట్టారు. ఆరుగంటలకల్లా దేవనహళ్లి హైవే వద్దకు చేరుకొన్నారు.

హైవేరోడ్డు పైన నడుస్తుంటే ఊపిరి తీసుకొన్నట్టయింది మల్లయ్య, కరెక్కలకు. ఇంక ఏ భయము లేదు. హైవే పైన మనకు ఒకటే దారి అనుకొన్నారు. పదినిముషాలు ముందుకు సాగారో లేదో ఎదురుగ్గా కుయ్, కుయ్ మంటూ పోలీసుల జీపు వచ్చి నిలిచింది. జీపెక్కండని ముందర సీటులో ఉన్న పెద్దసారు కన్నడలో అన్నాడు. వీళ్ళకు ఏమి అర్థం కాలేదు. ఒక కానిస్టేబుల్ వచ్చిరాని తెలుగులో మళ్లీ అదే మాట అన్నాడు. ఉన్న విషయం చెప్పి ఊరు వెళ్లాలి అని మల్లయ్య అన్నాడు. కరోనా కాలంలో ఎవ్వరూ అటుఇటు పోకూడదని తెలీదా మీకు? లాక్ డౌన్ అయ్యాకా విమానంలో పోదురు గానీ ముందు జీపెక్కమన్నాడు పోలీసు. పెద్దసారు వద్దకు పోయి కరెక్క దండ పెట్టింది. అయ్యా ఏదో ఊరెల్లిపోదామని బయలుదేరాము. ఇలా పోనీయరని తెలియదు. తోటలో పని చేసుకొని బతికేటోళ్ళం. వెనక్కి వెళ్ళిపోయి బుద్ధిగా ఇంటి పట్టునే ఉంటామని కన్నీళ్లు పెట్టుకొని ప్రాధేయపడింది. కరెక్క మాటలను పోలీసు పెద్దసారుకు కన్నడంలో చెప్పాడు. ఏదో తెలియక వచ్చామంటున్నారు. మర్యాదగా వెనక్కిపోండి. లేదంటే ఇరవైరోజులు క్వారెంటెన్ లో ఉంచుతామని కన్నడలో పెద్దసారు అన్నాడు. పోలీసు ఆ విషయం తెలుగులో కరెక్కకు చెప్పాడు. బతుకు జీవుడా అని మళ్లీ దండపెట్టి మల్లయ్య, కరెక్కలు వెనక్కు నడవసాగారు. రోడ్డు దిగి కొంత ముందుకెళ్ళి చెట్టుకింద కూచున్నారు. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. హైవే పైన పెద్ద పెద్దోళ్ళ కార్లు వందల కొద్ది పోతునే ఉన్నాయి. వాళ్ళకు లేని రూల్సన్నీ రోడ్డుపై నడూస్తూ పోయే మనకే ఉంటాయి కదా అనుకున్నాడు మల్లయ్య. అందరికీ ఒకటే చట్టం అంటారు. యాదేశం పోయినా పెద్దోళ్ళకు చట్టాలు చుట్టాలైపోతాయనుకొన్నాడు.

తమతో పాటు వలస వచ్చిన ఊరి వాళ్ళకు మల్లయ్య ఫోను చేశాడు. చెబితే వినరు మీరు. చేసేదేమిలేదు వెనక్కు

వచ్చేయండన్నారు ఊరి వాళ్ళు. దేవనహళ్ళి నుండి ఆంధ్రబార్డర్ యాభైకిలోమీటర్లు. ఎక్కడ చూసినా పోలీసులుంటారు. అనసర ఇబ్బందులు వద్దని ఊరివాళ్ళు అన్నారు. బార్డర్ దాటితే అవతల మనకు ఏ సమస్య ఉండదు. అది దాటితే చాలని మనసులో అనుకొన్నాడు మల్లయ్య.

ఊర్లో పిల్లలెలా ఉన్నారో ఒక సారి ఫోన్ చేద్దామనుకొన్నాడు మల్లయ్య. ఫోన్ చేయాలంటే భయంగా ఉంది. అక్కడ నుండి ఏమి వినాల్సి వస్తుందో అని చింతిస్తున్నాడు. అసలు ఏమి తింటాండారో, ఆరోగ్యాలు ఎలా ఉన్నాయో అని మనసు తొలిచేస్తోంది మల్లయ్యకు. కరెక్కే ముసలమ్మకు ఫోన్ చేసింది. పిల్లల గురించి అడిగింది. తమ ప్రయాణం గురించి చెప్పింది. త్వరలో చేరుకొంటామని, ఇంటి నుండి పిల్లలను బయటకు పోనివ్వకుండా వాకిళ్ళు వేసి ఉంచమన్నది. ఊర్లో కరోనా సమాచారం అడిగి తెలుసుకొంది.

ముసలమ్మకు ఏమి చెప్పాలో అర్థం కాక అన్నింటికీ 'మూ, మూ' అంటా ఉంది. ఎలాగో బయలు దేరారు. ఇంట్లో సమస్యలు చెప్పి బాధపెట్టడం ఎందుకులే అనుకొంది ముసలమ్మ. నిజానికి అప్పటికే రెండు రోజుల కిందే కోళ్లకోసం ఉంచిన నూకలగింజలు కూడా అయిపోయాయి. ముసలమ్మ కన్నగసాట్లు పడుతూ, తాను పస్తు ఉంటూ పిల్లల కడుపు నింపుతోంది. ఇంట్లో మూడుకోళ్ళు గుడ్లు పెడుతున్నాయి. ఆ గుడ్లు ఉడకబెట్టి పిల్లలకు ఒకొటి ఇస్తుంది. కోళ్ళనే కోసేస్తే కనీసం నాలుగురోజులు కాలం పొట్టగడుస్తుంతది. కరోనా ఉంటాదని ఈ మధ్య తునకలు తినడమే అంతా మానేసారు. అందుకే ముసలమ్మ కోళ్ళు కోసే ధైర్యం చేయడం లేదు. ఇంటి వెనుక చింతమాను చిగురేయడంతో చింతచిగురు తెచ్చి ఉడకబెట్టి, ఉప్పు కలిపి రోజుకు ఒక పూట తాపుతోంది. ఇంటి ముందు ఒకటే ఒక పరింగి చెట్టు బాగా కాయలు కాసింది. కానీ అవి మాగాలంటే ఇంకో నెల పడతాది. అవి కూడా సమయానికి అందవు కదా అని బాధ పడింది ముసలమ్మ. ఇంక సాధ్యం కాదని పచ్చి పరింకాయలనే రోజుకొకటి కోసుకొచ్చి, పై తుప్పు తీసి ముక్కలు చేసి, ఉప్పులో ఉడకబెట్టి, కొద్దిగా పసుపు కారం కలిపి మరో పూట గడిపేస్తుంది.

నూకల గింజలున్నాయా? అయిపోయాయా? అని కరెక్క కూడా అడిగే సాహసం చేయలేదు.

ముసలమ్మ కూడా చెప్పలేదు. చాలా సార్లు సీమవాసుల జీవితాలలో భయంకరమైన మౌనం ఆవహిస్తుంటుంది. ముసలమ్మ పిల్లల పొట్టనింపడం కోసం తాను పడుతున్న అగసాట్లు ఏవి చెప్పకుండా సరేనమ్మా మీరు జాగ్రత్తగా వచ్చేయండన్నది.

అన్నీ ఆలోచించుకొన్నాక ఎటుతిరిగి వెనక్కుపోయేది వద్దు. ఏమైనా సరే ముందుకే పోదాం అని నిర్ణయించుకొన్నారు మల్లయ్య, కరెక్కలు. అసలు హైవేరోడ్డు పైన పోవడమే సమస్య అయితే ఆ రోడ్డుకు దూరంగా నడుస్తూ పోదామనుకొన్నారు. రాత్రి తీసుకొచ్చిన సద్ది కొద్దిగా తిని బ్యాగులెత్తుకొన్నారు. అప్పటికే ఉదయం ఎనిమిదవుతోంది. హైవే కింద బ్రిడ్జి దాటి హైవేకు ఎడమపక్క సమాంతరంగా నడవసాగారు. దూరంగా నిలువెత్తు కొండ ఎడమవైపు కనిపిస్తా ఉంది. కుడివైపున చిక్కబళ్ళాపురం. ఊరివైపు పోకుండా కొండ వారుంచి వెళ్ళారు. మధ్యాహ్నానికి కొండ సమీపంగా నడుస్తూ చిక్కబళ్ళాపురం దాటేశారు. రోడ్డుపైన బోర్డులో తెలుగు అక్షరాలు పోలిన కన్నడ అక్షరాలతో నందిహిల్స్ అని కనబడ్డాయి.

నంది కొండలలో కొలువైన నందీశ్వరునికి ఇద్దరూ రెండు చేతులెత్తి ఆ కొండ కొనాన కనిపిస్తున్న గోపురం వైపు చూస్తూ మొక్కినారు. మా పిల్లలను జాగ్రత్తగా కాపాడు సామి, మమ్మల్ని మా ఊరు చేర్చు సామి అని మనసులో అనుకున్నారు. అప్పటికే ఎండ విపరీతమైంది. ఎండ వడకు తట్టుకోలేక అక్కడే కొండ సమీపంలో చల్లని చెట్ల కింద కూర్చున్నారు. అలసిపోయి కొద్దిసేపు తల వాల్చేశారు. నాలుగు గంటలకు ఉదయం మిగిలిన అన్నం, రొట్టెలు తిన్నారు. ఇంకా రెండు రొట్టెలు మిగిలాయి. పక్కనే పాతకాలం బాయిలో నీళ్ళు బాటళ్ళు నిండా నింపుకొన్నారు. పగటిపూట పల్లెల మీద పోతే లేని సమస్యలు వస్తాయి. ఎక్కడ చూసినా దారులకు రాళ్ళు, కంపలు ఉంచారు. కొత్తవాళ్ళను చూసినారంటే అనవసరంగా విచారిస్తారు. లేని అనుమానాలు వస్తాయి. రేయిపొద్దున ఎవరూ ఉండరు. సళ్ళపొద్దున వేగంగా ప్రయాణం సాగుతాది. అలుపు ఉండదనుకొన్నారు. అక్కడే సాయంత్రం దాకా ఉన్నారు.

చీకటి పడేసరికి మరోసారి నందీశ్వరుని దండం పెట్టుకొని, బ్యాగులెత్తుకొని నడక మొదలెట్టారు. అర్ధరాత్రి కల్లా కర్నాటక గుడిబండ దాటారు. ఆకలెక్కువైంది. బ్యాగులో రొట్టలు తీసి ఒకోరు ఒకటి తింటూ పోతున్నారు. తెల్లవారు జాము కల్లా ఆదినారాయణ సామి కొండ వద్దకు చేరుకొన్నారు. మల్లయ్యకు అపుడప్పుడు దగ్గు వస్తాఉంది. ఇంకో వైపు కడుపు మండిపోతాంది. ఆకలికి తట్టుకోలేక పోయారు. కొండ

దిగువన దారి పక్కన చిన్న ఆలయం కనపడింది. పల్లెవాళ్లు పున్నమి అని గుళ్లో రాత్రి పూజలు చేసి నైవేద్యాలు, పళ్ళు సామికి పెట్టారు. మంచో చెడో తెలియదు సామి, మా తప్పులను మన్నించి, నీ బిడ్డలనుకొని క్షమించమని ఆ నైవేద్యాలు, పళ్ళు తినేసారు. అక్కడే ఉంటే ఏ చిక్కులు వస్తాయో? ఏమో? అని త్వరగా బయలుదేరారు. దారిలో ఒక కాలి చెప్పు తెగింది మల్లయ్యకు. రెండో చెప్పు అక్కడే పడేసి పోసాగాడు. సమీపంగా పోలాలకు పోతున్న వాళ్ళు ఏమి సంగతి? ఎవరు మీరు? కరోనా కాలంలో మా ఊర్లెంబడి పోతాండారని అడిగారు. పున్నమి మొక్కుబడి ఉంటే నిద్రచేసేకి ఆదినారాయణ సామి గుడికి వచ్చింటిమి. పెనుకొండ దగ్గర పల్లెమాది అని చెప్పి తప్పించుకొన్నారు. రోడ్డు మీదే ఇబ్బంది అనుకొని పల్లెలమీద పోతున్నా సమస్యలున్నాయను కొని వేగంగా నడవసాగారు. ఆంధ్ర సరిహద్దుకు చేరుకొన్నారు. దూరంగా తాత్కాలికంగా చెక్ పోస్ట్ కనబడింది. ఇది పెద్ద గండమే అనుకొన్నారు.

పక్కదారిలో వంకెంబడి నడుస్తూ వెళుతున్నారు. వంకంబెడి పోతుంటే ఎదురుగా గుంటిపై ఒక నల్లపాటి మనిషి కనుగుడ్లు పెద్దగా చేసి ఒకటే చూపు వీళ్ళవైపు చూస్తున్నాడు. మల్లయ్యకు అనుమాన మొచ్చింది. నడుస్తూనే నడుములో చెక్కుకున్న పిడిబాకు చేతికందేలా అనువుగా సరి చేసుకొన్నాడు. కరెక్క ఇవేమి గమనించ కుండానే వెంట వస్తోంది. దొంగసారా పొద్దున్నే మోసకపోతున్నారా? ఒక్క కేక వేస్తే ఆ రోడ్డుపై ఉన్న చెక్ పోస్ట్ పోలీసులు వస్తారు. మర్యాదగా డబ్బులు ఇచ్చిపోండని గుంటిపై నుండే ఆ మనిషి అన్నాడు. నిక్కర జోబులో చేయిపెట్టి లోపలే ఏంచుకొని రెండు ఐదువందలు రుపాయల నోట్లు తీసి వాడికి ఇచ్చాడు. గుంటి మీద నుండే ఆ మనిషి సరేనని అనుమతిస్తూ చేయి ఊపాడు.

వంక గడ్డెక్కి వీరాపురం మీదుగా చిలమత్తూరు సమీపానికి చేరున్నారు. తాగుడుబోతోనికి వేయి రూపాయలు పోగా ఇంక నాలుగువేలు చేతిలో మిగిలింది. చిలమత్తూరు దగ్గర పడగానే సొంత గడ్డకు చేరుకొన్నట్లు మనసుకు స్వాంతన అయింది. అప్పటికే మల్లయ్యకు జలుబు, దగ్గుకు తోడు జ్వరం పొంగు కూడా మొదలైంది. ఉండే కష్టాలు చాలక ఇది ఒకటి మొదలైతే మా సంగతేమి కాను అని కరెక్క మనసులో ఆందోళన చెందుతోంది. అప్పటికే తొమ్మిదిగంటలు అవుతోంది. ఊర్లో దాన పోతే ఎందుకొచ్చిన సమస్య అనుకొని ఊరి బయట నుండే పోవాలను కొన్నారు. మల్లయ్య ఊరిబయటే చెట్టుకింద కూర్చోన్నాడు. ఊర్లోకి వెళ్ళి జ్వరం మందులు తీసుకొని రమ్మని కరెక్కను పంపాడు. మందుల షాపులో కావలసిన మందులు తీసుకొంది కరెక్క. తన కాలి బొబ్బలకు ఒక పూతమందు డబ్బీ తీసుకొంది. మల్లయ్యకు చెప్పులు కొందామని రోడ్డంతా వెతికినా అంగళ్ళన్నీ మూతలేసి ఉన్నాయి. పక్కవీధిలో చిన్న చిల్లర అంగడి గుట్టుగా నడుస్తున్న విషయం తెలుసుకొంది కరెక్క. అక్కడకెళ్ళి బన్ను ప్యాకెట్, బిస్కట్ పొట్లాలు తీసుకొని మల్లయ్య ఉండే చోటుకు చేరింది. ఇద్దరూ తిని నీళ్ళు తాగారు. మల్లయ్య మందులేసుకొన్నాడు. కరెక్క పాదాలకు మందు రాసుకొంది. జ్వరమొచ్చిన మనిషి బరువు మోయలేడని ఆ బ్యాగులోనుండి కొన్ని సరుకులు తన బ్యాగులోకి మార్చింది కరెక్క. నడక మొదలైంది. కష్టంగానే నాలుగైదు పల్లెలు దాటారు. పాలసముద్రం వద్దకు చేరే సరికి ఒంటిగంట దాటింది. కడుపంతా ఆకలితో మండిపోతోంది. అడుగుతీసి వేయాలన్నా కష్టంగా ఉంది. ఏమి దొరికినా తినేయాలనిపిస్తోంది మల్లయ్యకు.

ఊరి బయట దొంకలో పోతుంటే పక్కనే తోటలో ఒకే ఒక ఇళ్ళు కనపడింది. ఏదో ఒకటి తినకపోతే పడిపోతాం. ఆ ఇంటిలో కాసింత అడుక్కొని తిని పోదాం అన్నది కరెక్క. ఎంతో మందికి అన్నం పెట్టిన నేను, ఇలా అన్నం కోసం ఎంత కష్టమొచ్చెనని కుమిలిపోయాడు మల్లయ్య. ఇక సాధ్యం కాదని తప్పని పరిస్థితులలో ఆ ఇంటి వద్దకు వెళ్ళారు. తమ సంగతంతా ఆ ఇంటావిడకు చెప్పుకొన్నారు. బిడ్డల సంగతి చెప్పేసరికి ఆ ఇంటావిడ మనసు కరిగిపోయింది. కూలోళ్లకు తీసుకపోవడానికి చేసిన రాగి సంగటి ముద్దలు మల్లయ్య , కరెక్కలకు పెట్టింది. కడుపునిండా తిన్నారు. ఎండకు పోలేక ఆ ఇంటి పట్టునే సాయంత్రం దాకా ఉండిపోయారు. సాయంత్రం మళ్లీ ఆ ఇంటామే వండి పెట్టింది. పోయేది దూరాభారం అని సద్దికూడా కట్టుకొండని చెప్పింది. కొన్ని రాగిరొట్టెలు కూడా ఇచ్చింది. ఆ ఇంటావిడను చూసి స్వయంగా అమ్మవారే దర్శనమయిందను కొన్నారు మల్లయ్య, కరెక్కలు. మల్లయ్య కాళ్లకు చెప్పులు లేనిది చూసి ఆ ఇంటావిడే గూట్లో పాత చెప్పులు తీసి ఇచ్చింది. ఆమెకు దండపెట్టి, మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేమని చెప్పి చీకటి పడుతుండగానే మళ్లీ నడక మొదలెట్టారు. ఈ లోకం మొత్తం దుర్మార్గమైందేమి కాదు అక్కడక్కడ మంచోళ్ళు కూడా ఉంటారనిపించింది మల్లయ్యకు.

ఆ పూటతో మల్లయ్యలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఎన్ని కష్టాలైన దాటేస్తామనిపించింది. ఆ రాత్రంతా నడిచి

పెనుకొండ దాటి ఉదయానికి నాగసముద్రం చేరుకొన్నారు. అనంతపురం, గుత్తి మీదుగా టౌన్లలో పోవడం కన్నా ధర్మవరం, నార్పల, యాడికి మీద అడ్డదారిన ఎర్రమల చేరడం మంచిదనుకొన్నాడు. పొద్దున్నే సద్ది తిని ధర్మవరం వైపు నడవ సాగారు. మల్లయ్యకు జ్వరం ఎక్కువైపోయింది. పట్టుకొంటే వంయి కాలిపోతోంది. అడుగు తీసి వేయాలన్నా భారమైపోతోంది. ఇంక నడవలేనన్నాడు మల్లయ్య. కరెక్కకు దిక్కుతోచడం లేదు. మధ్యలో ఇలా ఆగిపోతే ఎవరు దిక్కు అనుకొంది. ఎలాగో కష్టమైనా ధర్మవరం దగ్గరకు చేరుకోవానుకొంది. మల్లయ్య బ్యాగు తానే తీసుకొంది. మరో వైపు ఒక చేత్తో మల్లయ్య రెట్ట పట్టుకొని నడిపించ సాగింది. అతి కష్టంపైన మధ్యాహ్నానికి ధర్మవరం క్రాస్ వద్దకు చేరారు. ఊరి బయటే ఆగిపోయారు. రాత్రి ఆ ఇంటావిడ ఇచ్చిన రాగిరొట్టెలు తిన్నారు. మల్లయ్యకు అవి మింగుడు పడలేదు. వాంతులయ్యాయి.

ధర్మవరం చేరి ఆసుపత్రిలో చూపించాలనుకొంది కరెక్క. క్రాస్ లో సత్రం కాడికి చేరారు. టౌన్లోకి పోయేకి లేదు. ఆసుపత్రులన్నీ మూతేశారు. ప్రభుత్వాసుపత్రి ఒకటే దిక్కు. అక్కడ కరోనా వాళ్ళు ఉన్నారని, ఎవరు అటు వైపు పోవడం లేదని క్రాస్ లో ఇరుగు పొరుగు వారన్నారు. ఎలాగో కష్టపడి ఆసుపత్రి చేరచ్చు కానీ లేని కరోనా ఎక్కడ సుట్టుకొంటాదో అని ఆలోచిస్తుంది కరెక్క. డాక్టర్లు ఎన్నాళ్ళు ఈ మనిషిని అక్కడే ఉండమంటారో, అది అయ్యాక క్వారంటైన్ అని ఎన్ని రోజులు ఉంచేస్తారో అని పరిపరి విధాలుగా అలోచించింది కరెక్క. ఇంక ఇళ్ళు చేరలేము అని భయం చుట్టుకొంది మల్లయ్యకు. తాను ఎక్కడున్నది తనకే అర్థం కావడంలేదు. మాటలు తడబడుతున్నాయి. ఎవరో దయ తలిచి గ్లాసుడు పాలు ఇచ్చారు. అమృతం పోసినట్టు అయింది మల్లయ్యకు. ఆ క్రాస్ లోనే ఒక పాతకాలం ఆర్.యం.పి డాక్టరు ఉన్నాడు. కరోనా వచ్చినప్పటి నుండి నిబంధనల మేరకు తన ఇంటి వసారా లోని చిన్న క్లినిక్ ని కూడా మూసేసి ఇంటి పట్టునే ఉన్నాడు డాక్టరు. మల్లయ్యను సత్రంలోనే ఉంచి ఆ డాక్టర్ ఇంటి వద్దకు వెళ్ళింది కరెక్క. జరిగిన సంగతంతా చెప్పి డాక్టర్ కాళ్లు పట్టుకొంది. ఈ ఒక్క కష్టం నుండి గడ్డన వేయమని ప్రాధేయపడింది. ఇట్లాంటి వ్యవహారాలలో ఆచితూచిగా ఉండే ఆ డాక్టరుకు కరెక్క చెప్పె కష్టాలు, బిడ్డల సంగతి విని మనసు కరిగింది. సరే ఏమైతే అది కానీ మల్లయ్యను తీసుకొని రమ్మన్నాడు డాక్టరు. ఒకరిద్దరు సహాయంతో మల్లయ్యను అక్కడకు చేర్చింది కరెక్క. డాక్టరు పరీక్షించాడు. ఇది కరోనా దగ్గు కాదని ధైర్యం చెప్పాడు. మాములు జ్వరమని చెప్పి అవసరమైన మందులు, మాత్రలు, సెలూన్ బాటిళ్లు రాసిచ్చాడు. మల్లయ్య జేబులోని డబ్బులు తీసుకొని కరెక్క పరుగు పరుగునా ధర్మవరం వెళ్ళి మందులు తెచ్చింది. డాక్టరు సూచన మేరకు మందులు వాడుతూ విశ్రాంతి తీసుకొన్నారు. మర్నాడు సాయంత్రానికి మల్లయ్య కోలుకున్నాడు. మందుల ఖర్చులకు రెండువేలు పోను ఇంక రెండువేలు చేతిలో మిగిలింది. కరెక్క మల్లయ్యలు డాక్టరుకు దండపెట్టారు. కష్టకాలంలో కాపాడిన డాక్టరుకు తమ చేతిలో మిగిలిన రెండువేలు ఇచ్చారు. వీళ్ళ పరిస్థితి అంతా తెలిసి డబ్బు వద్దన్నాడు. అతికష్టం మీద వీరు ప్రాధేయపడగా వేయిరూపాయలు మాత్రం తీసుకొన్నాడు డాక్టరు.

ఊరిలో ముసలమ్మకు ఫోన్ చేసింది కరెక్క. రెండు రోజులలో చేరుకొంటామని చెప్పింది. ముసలమ్మకు నోటమాట రాలేదు. సరే సరే అంటూ సమాధాన మిచ్చింది. పిల్లలు అంతా బాగున్నారనే చెప్పింది. ఆ పూట పిల్లలకు చింత చిగురు ఉడకబెట్టి ఇచ్చింది ముసలమ్మ. కోళ్ళు గుడ్లు కూడా పెట్టడం లేదు. పొదగడుకు ఏసుకొన్నాయి. ఇంటి ముందు పరింగి చెట్టుకు పిందులు కూడా కాళీ అయిపోయాయి. చింతాకు తిని, తిని కడుపు నొప్పని పాప అంటోంది. ఇక ఈ రెండు రోజులు పిల్లలకు ఏమి పెట్టాలో దిక్కు తోచడంలేదు ముసలమ్మకు.

చీకటి పడగానే అక్కడ చిన్న అంగట్లో బన్నుప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు తీసుకొని మల్లయ్య, కరెక్కలు బయలుదేరారు. సరిగ్గా ప్రయాణం సాగితే ఇంకో రాత్రికి తమ ఊరు చేరుతామనుకొన్నారు. ధర్మవరం ఊరి బయట్నుంచి దాటుకొని బత్తలపల్లె, నార్పల మీదుగా ఉదయానికి పెరవళి కి చేరారు. రాత్రి దారిలో తిన్నవి పోగా మిగలిన వేవో తిన్నారు. మధ్యాహ్నానికి చాగల్లు చేరుకొన్నారు. ఎండకు తట్టుకోలేక పెన్నేటి ఒడ్డున తాటిచెట్ల కింద కూచున్నారు.

పేరుకే పెన్నానది. పెద్దనది. దీన్ని చూస్తే పిల్లనది కూడా కాకపోయే అనుకొన్నాడు మల్లయ్య. చుక్క నీళ్ళు లేవని బాధపడ్డాడు. వానలు పడేది లేదు. నీళ్ళు సాగేది లేదనుకొన్నాడు. అయినా ఈ నదిపైనే ప్రాజక్టుల మీద ప్రాజక్టులు కడుతూనే ఉన్నారు. నీళ్ళు ఎక్కడ నుండి తెస్తారో

ఏమో అనుకొన్నాడు. నీళ్ళులేని ఊర్లు ఉన్నట్టే .. నీళ్ళు లేని ప్రాజక్టులూ ఉంటాయనుకొన్నాడు. యాడ చూసినా కాలువలే, ప్రాజక్టు పనులే. ఈ సొమ్ముంతా యాడికి పోతాందో కదా అనిపించింది మల్లయ్యకు. సాయంత్రం దాకా ఆ ఏటిగడ్డనే ఉన్నారు. ఈ రాత్రికి యాడికి దారిన ఎర్రమల కొండలు దాటి తమ ఊరికి చేరాలనుకొన్నారు. ఈ రాత్రి ఒక్కటి గడిస్తే ఇంటికి చేరిపోతామను కొన్నారు.

ఆ ముందు నాటి రాత్రిన ఉదయన్నే పిల్లకు ఏమి పెట్టి కడుపు నింపాలో ఊర్లో ముసలమ్మకు దిక్కు తోచడం లేదు. నిద్రకూడా పట్టడం లేదు ముసలమ్మకు. సరిగ్గా అర్ధరాత్రికి సంచి భుజాన వేసుకొని దుర్గం సమీపంగా పక్క పల్లెలో కొద్దిగా నీటి వసతి ఉండే పోలాల వద్ద కూరగాయల తోటలోకెళ్ళింది. మూడు నాలుగు కాయగూరలను అర్దసంచికి వేసుకొని తొలిజాము కల్లా ఇళ్ళు చేరింది. జీవితంలో ఎన్నడూ చేయని పని చేయాల్సి వచ్చె కదా అని బాధపడింది. ఆ కాయగూరలు ఉడకబెట్టి పిల్లలకు పెట్టింది. ఇంకొక్క రాత్రి గడిస్తే ఈ బిడ్డలను భద్రంగా కొడుకు, కోడలు చేతిలో పెడితే ఈ జీవితానికి అది చాలనుకొంది. ఆ రోజు సాయంత్రానికి ప్రభుత్వం వాళ్ళు దయతలచి బియ్యం, వేయి రుపాయలు లెక్క వాలెంటీరులు ఊర్లో తెచ్చి ఇచ్చారు. ఆ వాలెంటీరును చూసి దేవుడే దిగి కాపాడడానికి వచ్చాడా అనుకొంది ముసలమ్మ. ఆ రాత్రిన అన్నం వండడానికి సమయాత్తమవుతోంది.

చీకటి పడుతుండగానే మల్లయ్య, కరెక్కలు నడవసాగారు. పెన్నేరు దాటుతూ చాగల్లు రిజర్వాయర్ వైపు చూశాడు మల్లయ్య. ప్రాజక్టు గోడకు పెద్ద అక్షరాలతో "కృష్ణానదీజలాలును చాగల్లు ప్రాజక్టుకు కేటాయించాలి" ఇట్లు.. 'సీమ నీళ్ళ సాధన సంఘం' అని కనిపించాయి. ఆ అక్షరాలు మల్లయ్య మనసులో బలంగా నాటుకొన్నాయి. ఆ నాలుగక్షరాలను అలాగే చూస్తూనే ఉండిపోయాడు. ఇదేదో వింతగా ఉందే. వానలు లేకున్నా అందనంత దూరాన ఉన్న కృష్ణానది నీళ్ళు సీమభూములకు తీసుక రావచ్చనిపిస్తోంది. ప్రాజక్టులు నింపొచ్చు. చెరువులు నింపొచ్చు. అలా ఏవేవో మనసులో గిర్రున ఆలోచనలు తిరుగుతున్నాయి.

ఒక్కొ అడుగు ముందుకు వేస్తూ అవే నీళ్ల ఆలోచనలు చేసూకొంటూ పోతున్నాడు. ఆ రాత్రంతా నడకలో అవే ప్రకంపనలు మల్లయ్యను ఆవరించాయి. యాడికి దాటారు. ఎదురుగా ఎర్రమల కొండలు వెన్నెలకు గంభీరంగా కనిపిస్తున్నాయి. ఎర్రమల కొండలు చూసేసరికి మల్లయ్య ప్రాణం లేచొచ్చింది. ఆ కొండలు దాటితే ఊరొస్తొందని సంబరపడ్డాడు. కర్నూలు జిల్లా సరిహద్దుకు చేరుకొన్నారు.

ఎర్రమల కనం దారిన ఊరు చేరడం మేలనుకొన్నాడు. రెండు కొండల మధ్య కనం దారి చాలా ప్రమాదమైనదని తెలుసు. వేగంగా సాగి కనుమ దాటుకొన్నారు. దూరంలో తమ ఊరు, పొలాలు కనిపించ సాగాయి. పట్టరాని సంతోషమయిపోయింది కరెక్కకు.

◆◆◆

తమ ఎర్ర చేనులో అడుగు పెట్టారు మల్లయ్య, కరెక్కలు. చేనంతా కలియ తిరిగాడు మల్లయ్య. కన్నీళ్ళు కారసాగాయి. ఈ చేను పండకే కదా! మాకిన్ని కష్టాలు తెచ్చిందనుకొన్నాడు. నా చేను నన్ను ఎన్నడూ మోసం చేయలేదు. తప్పు చేనిది కాదు. అది మా తాతల కాలంలో, మా నాయనల కాలంలో, నా కాలంలోను పండడానికి సిద్దంగానే ఉంది. కానీ అదునుగా కాసిన్నీ నీళ్ళు లేకపోవడమే కదా! నా బతుకు ఇలా అయిపోవడానికి కారణమని కోపోద్రిక్తుడై పోయాడు మల్లయ్య.

నట్టినడి చేనులో నిలబడ్డారు మల్లయ్య, కరెక్కలు. ఎర్రచేనుని ముద్దాడాడు మల్లయ్య. భూమి కంపించేలా అరచేతితో నేలను కొట్టి పిడికెడు మట్టి తీసుకొన్నాడు. ఉద్వేగంగా నడుచుకొంటూ ఊరి దారిన పోతున్నాడు మల్లయ్య. కరెక్క అతని వెంటనే బిరబిర నడుస్తోంది. ఊరికి తూర్పున ఎర్రమలేశ్వరుని ఆలయంలోకి పోయాడు. కోనేటి అడుగు నీళ్ళ తలపై చల్లుకొన్నాడు. నంది వద్ద నిలబడ్డాడు. లోపల ఈశ్వరుని చూస్తూ ఈ మట్టి నేలను వదిలి నేను పోనని ప్రతిన బూనాడు. చేతిలో మిగిలిన డబ్బంతా హుండీలోకి వేసేసింది కరెక్క.

తెల్లారే ఐదవుతోంది. అప్పుడప్పుడే దుర్గం మేలుకోబోతుండగా మల్లయ్య, కరెక్కలు ఇంటి గడప తొక్కారు. ఒక్కో అడుగు వేసుకొంటూ అందనంత దూరాన్ని చెరిపేసి నిద్రపోతున్న బిడ్డలనే మనసారా హృదయానికి హత్తుకొన్నారు. ప్రాణం పోయినా సరే బిడ్డలను వదిలి వలసపోనని కరెక్క ముగ్గురు బిడ్డల సాక్షిగా శపదం చేసింది. వలసపోకుండా ఈ నేలలోనే బతికేందుకు నీళ్లకోసం పోరాటంలో నేనూ ముందుంటానని అప్రయత్నంగా అనేసింది. ముసలమ్మ మనసు కుదుటపడింది. ◆

## అమ్మా! నీకు వందనం!

- మందరపు హైమవతి
9441062732

కరోనా కవిత

ఆకాశమింకా సూర్యుణ్ణి తిలకంగా దిద్దుకోకముందే
వీధిమొగలో ఉదయిస్తుంది ఆమె
ప్రాణవాయువే మృత్యుపరిమళమై
తోటి మనిషే వైరస్ వాహకుడనే సందేహం పురుగు
తలను తొలిచి వేస్తుంటే
దూరాన్ని పాటిస్తూ తలుపులు మూసి
భద్రతా ప్రాకారాల మధ్య బంధితులమై
అరచేతుల విరులను అనుక్షణం జలాభిషేకం చేస్తూ
నాలుగ్గోడల పంజరంలో జాగ్రత్తల ఊచల మధ్య
కులాసా రాగాలు పాడుకుంటూ కాలుమీద కాలు వేసుకొని
కాలం గడపడమే సమస్యగా తిట్టుకొంటున్న వేళ
చీపురు ఆయుధంతో
చెత్తపై యుద్ధం ప్రకటించే యోధురాలు ఆమె
చెత్తకుండీ ఉమ్మితొట్టి వీధికి పర్యాయపదాలుగా మార్చి
విసిరేసిన ఎంగిలాకులు తిని పారేసిన అరటి తొక్కలు
రక్తపు రంగు కిళ్ళీ మరకలు గుట్కా ఉమ్ములతో
అత్యంత జుగుప్సాకర వీధిని
ముఖంపై చెరగని చిరునవ్వుతో ఏ జాగ్రత్తలు లేకుండానే
బ్లీచింగ్ పొడరు చల్లి చల్లి పుళ్ళు పడిన చేతులతోనే
స్వధర్మమే మహాధర్మమని విధి నిర్వహణే విద్యుక్త ధర్మమని
సమస్తాన్ని సమదృష్టితో చూసే యోగినిలా
కొంచెంకొంచెంగా చిమ్మడం మొదలుపెడుతుంది
మునివేళ్ళ గోళ్ళతో తాకడానికి కంటిచూపుల చివర్లతో
తడమడానికి
అసహ్యించుకొనే చీకటిలాటి మురికిని తొలగిస్తూ
ఆరోగ్యం ఊయలలో అందరినీ ఊపే అమ్మా!
నీకు వందనం!
జన్మనిచ్చిన తల్లిదండ్రులు
జ్ఞానపాఠాలు నేర్పిన గురువుల
రుణం తీర్చుకోలేము
కుడి ఎడమ తేడా లేక
అపరిశుభ్ర వీధులను శుభ్రనదులుగా మారుస్తూ
అలికి ముగ్గుపెట్టిన ముంగిలిలా
వెలుతురు కిరణాలు ప్రసరించిన ఆకాశంలా
మిలమిలా మెరిసిపోయేలా తీర్చిదిద్దుతున్న ఆమెకు
ఏమిచ్చినా రుణం తీరదు
అమ్మా! నీకు పాదాభివందనం!

◆

---

## కాలరెగరేసిన చెట్టు

- నవీన్
9553737304

కరోనా కవిత

ఎవరికిందా పడివుండక్కర్లేదని
కాలుమీద కాలేసుకుని కూర్చున్నది రోడ్డు
ఎన్నడూ దొరకని నిశ్శబ్దాన్ని
టేక్ ఓవర్ చేసింది ఫ్లైఓవర్
తపోవనంలో రుషిని తలపిస్తున్నది మైలురాయి

శుభ్రపడ్డ తన ఊపిరితిత్తులతో
గట్టిగా గాలి పీల్చుకుని
పరవశించింది ప్రాణవాయువు
ఆకాశం అద్దంలో
తనను తానే చూసుకుని
యవ్వనం తిరిగొచ్చిందని
మురిసిపోయింది నది
చేపపిల్లలకు చందమామను చూయిస్తూ
తన వొళ్ళో ఊయలలూపింది సముద్రం
అలికిడి లేక, అలజడి పడక
సూర్యుడితో సంభాషించింది ఉద్యానవనం
నల్లమబ్బులు తొలగి
వందమైళ్ళ దూరం చెరిగి
జలందర్ వాసికి దర్శనమిచ్చింది హిమవన్నగం
పర్యావరణమంతా పరిశుభ్ర ఆవరణైనందుకు
నేలమెడలో చినుకుపూలదండ వేసింది
నింగిమేఘం
నడచివస్తున్న వలసకూలీలకు
గొడుగుపట్టి
కాలరెగరేసింది చెట్టు...

◆



# కరోనా కవిత్వంలో వలస జీవుల వెతలు

- అయ్యగారి సీతారత్నం
8639834534

కరోనా ప్రపంచాన్ని వణికిస్తున్న దశలో మార్చి మూడవ వారంలో లాక్ డౌన్ మొదలైంది. మొదలైన మొదటి దశలో కవులంతా నిమ్మలంగానే ఉన్నారు. కాస్త విశ్రాంతి, సాంత్వన దొరికే యనుకున్నారు అందుకే " ఏమైంది ఇప్పుడు" లాంటి కవితలు వచ్చాయి.

*"క్షణాలు మాత్రమే కల్లోలితం*
*ఆత్మ స్థైర్యం కాదు కదా*
*సమూహాలు మాత్రమే సంక్షోభితం*
*సాయం చేసే గుణం కాదు కదా*
*ఎన్ని చూడలేదు మనం*
*వర్తమానం ఎప్పుడూ సవాళ్ళనే చూపిస్తుంది.*
*భవిష్యత్ ఎప్పుడూ ఆశలని ప్రోదిచేస్తుంది.*

అని ఆశావాహకం గానే కవితలల్లారు.

లాక్ డౌన్ రెండోసారి మొదలైంది. పేద వారికి రేషన్, పేద వారికి సాయం అనుకున్నారే తప్ప పేదరికాన్ని పోగొట్టుకోవడానికి పొట్ట నింపుకొనే మార్గం కోసం సొంత ఊరు వదిలి వెళ్లిన వలస జీవుల జీవన విధానం గుర్తింపుకి వచ్చేసరికి కొంత ఆలస్యం అయ్యింది అనే చెప్పాలి. లక్షల కొద్దీ వలస కూలీలు తమ రెండు కాళ్ళే వాహనంగా మైళ్ళ కొద్దీ నడుస్తుంటే... బర్మా కాందిశీకులు గుర్తుకు వచ్చారు. కానీ వీరు సొంత దేశంలోనే ఉన్నారు. లక్షల మందికి బ్రతుకు భద్రత లేని వైనం సుస్పష్టమైంది. ఈ సంఘటన ఆధారంగా స్పందించే గుణం ఉన్న కవుల కలాల నుండి అనేక కవితలు వచ్చాయి. వారి మనో వేదనకి అద్దం పట్టాయి. మన బాధ్యతని గుర్తు చేశాయి.

వలస జీవులని చూసిన క్షణమే చదువుకున్న వారికి సాహిత్య చరిత్ర అధ్యయనం చేసిన వారికి సమాజం పై ఒక గాఢమైన ముద్ర వేసిన శ్రీ శ్రీ కవిత బాటసారి గుర్తుకు వచ్చింది. 1934లో మే నెలలో రచించారు.

*కూలి కోసం*
*కూటి కోసం*
*పట్టణంలో బ్రతుకుదామని*
*తల్లిమాటలు చెవిని పెట్టక*
*బయలుదేరిన బాటసారికి*
*మూడు రోజులు ఒక్క తీరుగ*
*నడుస్తున్నా దిక్కు తెలియక*
*దిగులు పడుతూ*
*దీనుడవుతూ తిరుగుతుంటే*
*చండ,చండం తీవ్ర తీవ్రం జ్వరం కాస్తే*
*భయం వేస్తే ప్రలాపిస్తే*
*బాటసారికి ఎంత కష్టం*
*పల్లెటూర్లో తల్లికేదో*
*పాడుకలలో పేగుకదిలింది.*

కరోన కాలంలో వలస జీవులపై అనేక పాటలు అనేక కవితలు వచ్చాయి. 86 సంవత్సరాల క్రితం శ్రీ శ్రీ రాసిన స్థితి నేడు కూడా కనిపించడం బాధాకరం. వలస పాలన కాలం నుండి ప్రపంచీకరణ కాలంలో కూడా అదే స్థితి వలసకూలీది.

శ్రీ శ్రీ నాటికి రాజ్యాంగం లేదు, హక్కులు లేవు కానీ నేడు అన్నీ ఉన్నాయి. ఏమీ లేని రోజుల్లో కర్మ సిద్ధాంతం

చాలా బలంగా రాజ్యమేలుతున్న కాలంలో తన వర్గానికి సంబంధించిన వ్యక్తి కాకున్నా వలస కూలీ గురించి నిజాయితీగా స్పందించిన మహాకవి శ్రీశ్రీ.

శ్రీశ్రీ కవిత నేటి కవితలుతో పోల్చడం వలన ఒక పరిణామ క్రమం తెలుస్తుంది. ఏమి సాధించాము అనేది స్పష్టమవుతుంది. నిజానికి ప్రభుత్వాలు వలస కూలిని పట్టించుకోలేదు. రైతు అంటే తలపాగా చుట్టి పురుషుడిని గుర్తించినట్టు కార్మికుడు అంటే ఫ్యాక్టరీలో పనిచేసే వారి గురించి వారి హక్కుల గురించి ఎక్కువ పోరాటాలు జరిగాయి. రోజు కూలీ పెంచాలని పోరాడితే, పెరిగిన కూలి పెరిగిన ధరల వలన మళ్ళీ కూటికి మాత్రమే వచ్చింది. అందువల్లనే తట్ట బుట్ట పట్టుకుని రోడ్డున పడ్డారు. ఒక పక్క కరోనా భయం, అందరూ ఒకే చోట ఉంటే చావు బ్రతుకు ఏదైనా పర్వాలేదు అని బయలుదేరారు.

శ్రీశ్రీ తర్వాత వలస కూలీల గురించి గోపిని కరుణాకర్, మీరజ్, శ్రీ చరణ్ కరుణాకర్రెడ్డి, రెడ్డి రామకృష్ణ... మొదలగువారు కవిత్వం రాశారు. కానీ అవి ఏదో ఒక సమూహానికి సంబంధించినవి. శ్రీకాకుళం వలస గురించి, మరొక దాని గురించి, అంతేకాదు, అవి నగరం వైపు అడుగులు గురించి రాసినవి. ఇవి నగరం నుండి సొంతూరుకి వేసిన అడుగులు గురించి రాసిన కవితలు. లోపల ఆకలి భయం, బయట అంటువ్యాధి భయంతో సొంతూరు వెతుక్కుంటున్న వలసకూలీల నడక నిజంగానే మనసును కదిలించేయనే చెప్పాలి.

'దిక్కులేక' అనే కవితలో రెడ్డి శంకరరావు

*"చంటోడుకి, కూడు లేక*
*ఉన్న ఊరికి పోదాం అంటే బండి లేక బస్సు లేక*
*తీసుకుపోయే దిక్కులేక దయ లేదు, జాలి లేదు,*
*ఊరు తెలిసేజాడ లేదు.*
*సద్ది మూట లేనే లేదు. పట్టుకొను తోడు లేదు*
*ఏలినోళ్ళ మాటలన్నీ గాలిలోని మాటలు అయితే*
*అందుకే ఆశ లేదు సొంత ఊరు పోయేలాగా*
*దారి మధ్యన దహనం అయితే"...*

బ్రతుకులోని అభద్రత. నడకలు గురించి రత్నాకరం

*నెత్తుటి నడక,*
*ఆకలి పేగుల నడక*
*అంటరాని నడక*
*అనాథల నడక*
*అన్నార్తుల నడక"*

ఆ నడకకి అంతు ఎప్పుడని మనసు మెలి పెట్టేబాధ, ప్రపంచీకరణతో దేశం అభివృద్ధి పథంలోకి వెళ్ళిపోతుంది, అనుకుంటున్న సమయం, లక్షల కొద్ది రోడ్డుమీద కూలీలు.

బండి సత్యనారాయణ

*"ఆసేతు హిమాచలం*
*దేశం దేహం మీ పాదాలతో*
*జాతీయ రహదారిని*
*పదునైన పాదాలతో*
*ఖండఖండాలుగా*
*పాతి పెడుతున్నారు*
*రక్తచరిత్ర రాస్తున్న*
*వలస వయాకరణులు"* అంటారు.

జాతీయ రహదారి ఒక అభివృద్ధికి చిహ్నం. నున్నటి తారు రోడ్లు, అటుఇటు మొక్కలు, దీపావళి నితలపించే విద్యుద్దీపాలు, రాత్రి పగలు తేడా లేకుండా హాయిగా సాగే పయనం చూస్తే అభివృద్ధి స్పష్టం. కానీ నేడు అదే జాతీయ రహదారిని వలస కార్మికులు నుంచి చూస్తే ముక్కల ముక్కల అయిపోయింది, నిజం బయటపడింది.

ఇదే భావం నూనెల శ్రీనివాసరావు..

*"తెగిన చెప్పులు పగిలిన పాదాలు*
*దగాపడ్డ జీవితాలు*
*బ్రతుకు చిత్రాలు*
*వెలుగుతున్న భారతావనికి*
*చీకటి ఆనవాళ్లు"*

ఇన్ని కోట్ల మందికి కనీసం గుర్తింపు లేని వైనం, లాక్ డౌన్లో వారి బ్రతుకు ఎలాగనే విషయం, ప్రభుత్వాలికి, ఏ మనుషులకి గుర్తింపు లేదు, వారి పాదముద్రలు చూసేదాకా.

ఎద్దుల రాజారెడ్డి

*"అన్నం పొద్దుకు ఎదురుచూసే అనాథలకు ఎరుక*
*ఆకలి విలువ*
*రెక్కలు కట్టుకుని ఆలీ పిల్లల చెయ్యి పట్టి*
*అలుపు సొలుపు పక్కనెట్టి పురిటిగడ్డకు పుట్టెడాశతో*
*ఎండమావికెదురేగే*
*సగటు మనుషులు"*

ఇలా నడిచి వెళ్తున్న కూలీలు కొందరు అలసిసొలసి రైలు పట్టాల మీద ఉసురు వదలడం నిజంగా మనసున్న ప్రతి మనిషి ని కలచివేసింది.

ఆ విషయాన్ని సింహం అనేకవి' బలి' అనే కవితలో

*"అంధకార బంధురాలు*
*వలస కూలీల జీవితాలు*
*మృత్యు శకటం మీదకొస్తున్న*
*తెలివి రాలేదు వాళ్ళకి*
*అది మూర్ఖత్వం కాదు*
*బ్రతకలేని అశక్తత*
*బ్రతుకు మీద నిరాసక్తి"*

కొన్ని వందల కిలోమీటర్లు నడిచారు నిద్దర సుఖమెరుగదు అంటారు, బ్రతుకు భయం కూడా అలసిన వొళ్ళు ఎరుగదు అని తెలిసింది.

వలస కూలీలు సొంతగూటికి రావడానికి పడిన పాట్లు లో వాళ్ళ విలువలు కూడా గుర్తించగలం. తల్లిని వీపున మోసి తీసుకు వస్తున్న కూలి..

*'అమ్మ నువ్వు నాకు భారమెట్టవుతావ్*
*మమ్మల్ని ఇంత కాలం సాకిన నువ్వు బరువెట్టవుతావ్*
*దవాఖానకి నన్ను మోసుకు పోలేదా*
*రాజ్యాలు పట్టించుకోకపోయినా*
*నేను నీ రాజునమ్మా,*
*నీ బోయను నేనే*
*నిన్నెలా విడిచి పెడతా*
*నిన్ను మా ఊరు చేర్చి తీరతా."*

ఇలాంటివి చూస్తే నిజంగానే కొంతమందికైనా కడుపు మండదా, కోపం రాదా, నారాయణ రావు అనే కవి 'మళ్ళీ వస్తామని' కవితలో

*"మేము వెళ్లి పోతున్నాం, మేమువెళ్ళిపోతున్నాం,*
*ఐదారేళ్ల మా పిల్లలు*
*60 ఏళ్ళ మా పెద్దలు*
*కడుపుతో ఉన్న ఆడాళ్ళు*
*చింకి పాతర్ల మా సామాను*
*అన్ని సర్దుకుని సాగిపోతున్నాం*
*కనికరంలేని ముఖాన ఉమ్మేసి ,*
*కన్నీళ్ళతో కాళ్ళు నొప్పులుతో*
*మేము కదలి వెళ్లిపోతున్నాం"*

గోవర్ధన్ రావు నానీల్లో

*" వలస వెళ్లిన జీవితాలు*
*అవి తీరం చేరని నావలు*
*నడకే ఇప్పుడు మహా వాహనం*
*పాలకులను ప్రశ్నించే సాహసం"*

కూలీల బ్రతుకులో కొంచెం కూడా భద్రత లేకపోవడం ప్రశ్నించాల్సిన విషయంగా కవులు గుర్తించారు.

నాలుగైదు అపార్ట్మెంట్స్ కట్టిన వాళ్ళు కోట్లకు పడగలెత్తుతారు. నమ్మకంగా పనిచేసిన కూలీకి అదే అపార్ట్మెంట్లో మళ్లీ అదే కూలిగా అభద్రత జీవితం మొదలు. లాక్ డౌన్‌లో అది కూడా లేదు. వాళ్ళ జీవనం గురించి ఆలోచిస్తే...

శంకర్రావు 'నిర్వికారంగా నిర్విరామంగా' అనే కవితలో

**కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దారులంతా**
**కదిలేకార్మిక జీవుల, పాదముద్రలు**
**గడపతొక్కిన ఊరు**
**అక్కున చేర్చుకుంటుందా**
**రెక్కల చాటున ఎదిగిన నగరం**
**రేపు మళ్లీ రమ్మంటుందా"**

బ్రతుకుతెరువు ఎంతకష్టం అయిపోయిందో చూడండి. గోపి గారు' మథనం 'అనే కవితలో

***"చేతులు అందరికీ ఉంటాయి కానీ కూలీలకు***
*చాకిరీ శానిటైజర్*
*సొంతూళ్ళ కెళ్లి*
*ఏం చేస్తారు తండ్రి*
*అక్కడున్నదీ ఇదే ఎండ.*
*బ్రతక లేక వలస వెళ్ళినవారు ఎలా బతుకుతారనే"*

ఆవేదన వ్యక్తం చేశారు కోవూరు శ్రీనివాసరావు

*" పురోగతి చూపని ప్రణాళికలు*
*ఎన్నో కాల గర్భంలో కలుస్తుంటే*
*అభివృద్ధిని కాంక్షించే ప్యాకేజీలు*
*నీటిమూటలుగా అవుతుంటే*
*బడుగు జీవుల వెతలు రావణ కష్టాలుఅవుతుంటే*
*నడుస్తున్న ప్రాణికోటి బిడ్డలను చూసి*
*నేలతల్లి ఆక్రోశిస్తుంది"*

గూటికి చేర లేని వలస పక్షుల విముక్తి కోసం ప్రపంచమంతా విలపించింది.

## చినుకు మాట్లాడితే!

- వారణాసి భానుమూర్తి రావు
9989073105

సముద్రాలు మేఘాలను
రాయబారానికి పంపిస్తే
చిట్టి చిట్టి చినుకమ్మలు
మళ్ళీ సముద్రాన్ని పలకరిస్తాయి

ఆవిరి బుడతలు ఆకాశానికి ఎగిరే కొద్దీ
నీటి మేఘాలు వువ్వెత్తున పొంగుతాయి
ఏకధాటిగా చినుకు చినుకు ఆడుకొంటూ
గగనం నుండి వాన రాగాల్ని పాడుకొంటూ
భూమి తల్లిని అభిషేకం చేస్తాయి
కల్మషం లేని జలంతో
కరిమబ్బులు నేలమ్మను దీవిస్తే
పచ్చని ప్రకృతి పులకరిస్తుంది
పుడమిని చీల్చుకొని రెండు లేతమ్మ ఆకులు
రెపరెప లాడుతూ ఆడుకొంటాయి



చల్లని తుషార బిందువులతో
ప్రభాత కిరణాల్ని పరిచయం చేసుకొంటాయి

చినుకమ్మ మాట్లాడితే
ఈ పృథ్వి పులకరించదా?
ఈ పక్షులు పలకరించవా?
ఈ తరువులు కుశల ప్రశ్నలు వెయ్యవా?

చినుకమ్మ మాట్లాడితే
ఈ కవి గుండెల్లో అక్షరాల హరివిల్లు పూయదా?
భావాల పొదరిల్లు వికసించదా?
కవిత్వం సంద్రమై పొంగదా?

◆

అలాగే "తాళాలు తీయండి" అనే కవితలో ఎన్ వి ఎస్ శాస్త్రిగారు.. ***"ఉక్కు నరాలకు ఉపాధి కల్పించండి/ ఎవరి బతుకు వారు సాగించేలా సహకరించండి / అదే కరోనా భయం పై /మనం సాధించే విజయం/ బతకడం కూడా నిత్యావసరమే కదా!"*** అని వారి బతుకు తెరువు పైదృష్టి పెట్టమంటారు.

మరొక కవి ***"దిగులు గుట్టల్ని మోసుకెళ్తూ/అటు నుంచి ఇటు/ ఇటు నుంచి అటు/ ఆకలి తరిమే వేటలో / నడక ఆగేదెప్పుడు"*** అంటారు. వీరికి స్థిరమైన జీవితం ,ఆప్తులుకి దగ్గరగా ఉండే జీవనం ఎప్పుడొస్తుందో అని దిగులు అందరికీ కలుగుతుంది.

సిరికి స్వామినాయుడు 'ఓ కొత్త పొద్దు కోసం 'అనే కవితలో ***'జయహో దుర్భర భారత్***

***దేశం యిప్పుడో చెరిగిపోని నెత్తుటి పాదముద్ర***
***వర్తమాన చరిత్ర మీద***
***వలసకూలీ గర్భస్థ శిశువు రాస్తున్న***
***ఎలిజీ!........***
***నడక రేపటి తలరాతల్ని మార్చే***
***లాంగ్ మార్చ్ గావాలి!***
***ఓ కొత్త పొద్దు కోసం!"*** వారి జీవితాల్లో మార్పు కోసం పోరాట స్ఫూర్తినిచ్చారు.

వలస కూలీల నడకలు నిజంగానే యావత్ భారత జాతి అభివృద్ధికి ప్రశ్నార్థకంగా నిలిచాయి. కొత్తగా ఆలోచించక తప్పదు. అసలు కూలీలు ఎక్కడ ఎక్కడ ఉన్నారు. ఏ ఏ రంగాల్లో పని చేస్తున్నారు. వ్యవసాయం, గనులు, భవన నిర్మాణం, లోడింగ్ అన్ లోడింగ్ లలో ఈ కూలీలు కనిపిస్తారు.

వీరిని గుర్తించి సంఘటిత వ్యవస్థలో భాగస్వాములుగా మార్చలేరా, వీళ్లు లేకుంటే భవనాలు లేవు వ్యవసాయం సాగదు. కచ్చితంగా వలసకూలీకని మళ్ళీ వెనక్కి పిలుస్తారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో శ్రీకాకుళం లాంటి జిల్లాల నుండే వలస కూలీలు అధికం. గోదావరి కృష్ణా జిల్లా లాగ ప్రతిమడికీ నీరు అందించాలని సంకల్పిస్తే కచ్చితంగా ముక్కారు పంటలు పండుతాయి. కానీ ఆ సాయం చేయక వ్యవసాయ రంగంలో పనిచేసే వారిని భవన నిర్మాణ వలస కూలీలుగా మార్చారు.

ఇప్పుడైనా ఆధార్ ఆధారంగా కూలీలు రిజిస్టర్ చేసుకుని ఏ రంగంలోకి ఎవరిని తీసుకు వెళ్తున్నారు, ఎంతమంది ఎక్కడికి వెళ్లారు అనే లెక్కలుండాలి. వాళ్ల బ్యాంకు పుస్తకాలకి కూలీవేయాలి. వీళ్ళకి కూడా కాంట్రాక్ట్‌లో పని చేసినంత కాలం ఈపీఎఫ్ ఉండాలి. కనీసం కొంత భద్రత వస్తుంది. కూలీలందర్నీ ఉద్యోగులుగా మార్చాలి. కనీస భద్రత కలగజేయాలి, వారి జీవన విధానంలో మార్పు రావడానికి ప్రభుత్వాలు కృషి చేయాలనే ఆర్తి, ఆవేదన, క్రోధం కూడా ఈ కవిత్వం ద్వారా స్పష్టమవుతుంది.

◆

## పట్టాల కింద దేశం

- శిఖా-ఆకాష్
9381522247

కరోనా కవిత

పోట్టను కాళ్లకు కట్టుకుని
ఇంటినీ..ఇల్లాలినీ... ఊరునీ
తలపై పెట్టుకుని చీమలదండోలె
ఆశల రెక్కలల్లాడిస్తూ...
బ్రతుకు కాలి
చెమట నెత్తురుల ప్రవాహమై
సాగిపోయిన కాలం పేరు
ఆకలి కూలి !-

♦

విషపు పురుగు నుండి
విషపు గాలి వరకు
ఎటునుండి ఎటు కదిలినా
కనిపించని ఆపదేదో..
చావు గంటయ్ మ్రోగుతున్నది!?

♦

ఆకలీ.. ఆకలీ...
నీవెంత కనికరంలేని దానివే..!
మనిషి చావుకు కోటానుకోట్ల
ఎక్స్గ్రేషియాలుగా
ప్రకటించే దేశంలో
బతుక్కి ఆసరా కాలేని
ప్రభుత్వాలే...ఎప్పటికి
చావు డప్పు మ్రోగించే యములోళ్లు!
కాసేపు నెపం మహమ్మారి
ఆకలిమీదో..
కనపడని మహా మహమ్మారి
కరోనా మీదో నెట్టేద్దాం-

♦

పేదలబతుకులు చిగురించిన
గాయాలైనా గానీ
ఆకలికి పరిష్కారమేది?
కాలమే ఒక ప్రశ్నయి
సమాధానాల్లేని
ఒకానొక నిర్బంధ జాలం.
కన్నతల్లి చూపైనా లేదు.
జన్మభూమి వూపిరైనా తాకలేదు!

♦

భరోసా లేని పరాయి చోట
తెల్లారితే నేనేమిటో... జీవితం
అభద్రతావలయంగా
భయపెడుతున్న చోట
నిద్ర కిటికీలు మూసి
చావు తలుపులు తెరిసి
తెల్లారగట్ల బతుకు తెల్లారిపోయే దారేదో
వెతుక్కున్నారు!?

♦

చిరునామా లేదు!
నా దేశం రైలుపట్టాల క్రింద
సమాధికావడం పేరు
వలస!?
తెల్లవారుజాము
మనిషి నెత్తురోడటం పేరు
ఆకలి!?

♦

యిది ముమ్మాటికీ
ప్రభుత్వ హత్యేనని
కరోనా పాఠం!.

♦

---

## కరోనాను బొందవెడ్దాం


- పున్నమి వెంకటయ్య
9581235315

కరోనా కవిత

ఏం కాలమొచ్చేనమ్మా!
ఇల్లు వోకిలూడ్సి రొండు దినాలాయే
ఎద్దులకాడ పెండకసువూడ్వనీకే వోలే
బర్లకు పాలువిండ్దమంటే భయం
ఏం బీమారమ్మా! గీ బీమారికింగ్లంబెట్ట!
ఎవడు జేసిన కంపో!
మనకందర్కి జుట్టు కొని గద్లం గద్లం జేస్తుంది
గిప్పుడంతా యాడజూసిన గిదే ముచ్చట
యా ఇంట్ల జూసిన గీ కర్రే పురుగు ముచ్చట్లే
 బిడ్డను మనుమిచ్చుడు మర్సింద్రు
కొడుక్కి బాసింగ బలం జూసుడు లే
నిన్న మొన్నట్దాక  పైసలు సంపాదించాలన్నోడు
గిప్పుడు పానం పైలంగుటే జాలనుకుంటుండు
నిన్నట్దాక టైం లేదన్నోడు
గీపొద్దు పొద్దట్నుంచి కాలు బయట వెట్తే అడ్గు
పిల్లలైతే మస్తు మర్సిపోయింద్రనుకోంద్రి
అవును మరి గాళ్లతో ఆడ్కోన్నికే గిట్లనన్న
పొద్దు జిక్కినందుకు పోరగాళ్ళుగూడా మస్తుకుసైంద్రు
యాదమర్సిన యతలుగితలన్ని మతికొచ్చి
 యాసర్కొచ్చినంతసేపు యాజేసుకునింటరు
మందు టానిక్ లేని గీ కర్రేపుర్గు బీమార్ని బొందవెట్టాలి
అంద్రం గుబుల్వాడకుండా పైలంగుందాం
పసివిల్లల్ని పండుముసల్లోల్లను మరింత పానం బెడ్దాం!
పానాలుంటే గీ పండ్గలు పంచన్లు మల్లజేసుకోవచ్చు
పెద్దలు జెప్పిన మాటలు పెడసెవిన వెట్టకుండా
గీ బేకారి బీమార్ని బేశర్తుగా బొందవెడ్దాం!

♦

# దర్జీల వాస్తవ జీవన చిత్రం




వి. వెంకట్రావు



- ఎస్. హనుమంతరావు
8897815656

'మారిపోయెరా కాలము' నవల 2017 వ సంవత్సరంలో ప్రచురింపబడి, మంచి గుర్తింపు పొందింది. దీని రచయిత వి. వెంకట్రావు. టైలర్ల జీవితాల్లోని కష్టసుఖాలను చర్చించిన నవల అని ట్యాగ్‌లైన్ పెట్టారు రచయిత. 'నావెల్స్ ఆర్ సెమీ ఆటోబయోగ్రాఫికల్స్.. అని అంటారు. కొంతవరకు ఈ నవల ఈ పరిధిలోకి వచ్చేదని చెప్పాలి. వృత్తిరీత్యా టైలర్ అయిన ఈ రచయిత, కథకు భంగం కలగకుండా, తన వృత్తి జీవితాన్ని సమర్థవంతంగా చిత్రించారు ఈ నవలలో. కథ ప్రధానంగా విజయనగరంలోనూ, ప్రధాన పాత్ర, హైదరాబాద్‌లో కొంతకాలం వుండవలసి రావడంతో అక్కడా సాగుతుంది. అతను విజయనగరానికి తిరుగుప్రయాణం కట్టడంతో నవల ముగుస్తుంది.

ప్రజల వస్త్ర కొనుగోలు అలవాట్లలో వచ్చిన మార్పువల్ల టైలరింగ్ వృత్తిలో వున్నవారి జీవితాల్లో రేగిన పెనుమార్పుల్ని భూమికగా చేసుకుని వచ్చిందీ నవల. ఒకానొక సమయంలో దర్జీలు దర్జాగా బ్రతకలేకపోయినా, పెద్ద ఇబ్బందుల్లేకుండానే బ్రతుకులు నెట్టుకొచ్చారని, కాకపోతే జనం బట్టలు కుట్టించుకోవడం తగ్గించి, రెడీమేడ్ వైపు మొగ్గుచూపడం వల్ల వారి జీవితాలు తల్లక్రిందులయ్యాయని ఈ నవల ప్రతిపాదిస్తుంది. రెడీమేడ్ వస్త్రాల పరిశ్రమ విజృంభణతో టైలరింగ్ షాపులు వెలవెలబోవడం మన కళ్ళతో చూసిన విషయమే. వాస్తవిక ధోరణిలో సాగడం ఈ నవల బలం. సమాజంలో జరుగుతున్నదే చూపిందీ నవల.

పూర్వం రోజుల్లో రెండు జతల బట్టలతో ఏడాది అంతా గడిపే వారు మన సమాజంలో చాలామంది వుండేవారు. ఆ రోజుల్లో టైలర్లకి ఆదరణ అంత ఎక్కువగా వుండేది కాదు. కాని ప్రజల ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన గుణాత్మక మార్పుల వల్ల, కొనుగోలు శక్తి పెరగడం వల్ల తర్వాత టైలరింగ్ షాపులు ఒక వెలుగు వెలిగాయి. ముఖ్యంగా కోస్తాంధ్రలో సంక్రాంతి సమయంలో వారి వ్యాపారం పతాకస్థాయిలో నడిచేది. మళ్ళీ రెడీమేడ్ వస్త్రాల కారణంగా అవి తిరోగమన దిశలో ప్రయాణిస్తున్నాయి. ఈనాటి తరానికి టైలరింగ్ షాపుల కన్నా ట్రయల్ రూముల గురించి ఎక్కువ తెలుసు. ఉపాధి కోల్పోయిన టైలర్లు మాల్స్‌లో కేవలం కస్టమర్ల కొలతల్ని చూసి, వస్త్రాల సైజుల్ని సూచించే స్థాయికి దిగజారారు. ఏ ప్యాంట్ సైజో పొడుగ్గా వుంటే, వాటిని సైజుకి కత్తిరించి కుట్టేపనికి పరిమితమయ్యారు. అయితే దీనికి మరో పార్శ్వముంది. మహానగరాల్లో బోటిక్‌లు, డ్రెస్ డిజైనర్లు పుట్టుకొచ్చి మంచి వ్యాపారం చేస్తున్నారు. కానీ వీరి సంఖ్య చాలా తక్కువ. కాని చిన్న పట్టణాలు, గ్రామాల్లోనూ టైలరింగ్ షాపులు బాగా దెబ్బతినడం వర్తమానంలో ఒక విషాద వాస్తవం. దాన్నే ఈ నవల పట్టుకోవడం విశేషం. ఒక వృత్తి సంక్షోభాన్ని రికార్డు చేసిన నవలలు మన తెలుగులో తక్కువ. ఆ పని ఈ నవల చేయడం ఒక మంచి పని.

ఇంతకు ముందే ఇదే అంశాన్ని తీసుకుని ఖదీర్‌బాబు 'న్యూ బాంబే టైలర్స్' కథ రాశారు. అలాగే ప్రఖ్యాత అభ్యుదయ

రచయిత బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు అరవైలలో 'మనిషి చేసిన మేలు' అనే కథ రాశారు. ఇది తర్వాత ఆయన కథల సంపుటిలో కూడా చోటు పొందింది. ఈ కథలో ఒక మంచి మనసున్న టైలర్ పాత్ర కనిపిస్తుంది. కథలో వాతావరణం కోసం వృత్తిచిత్రణ కనిపించినా, ఇది ప్రధానంగా దైన్యస్థితిలో ఉన్న ఓ స్త్రీని, ఆమె కూతురును ఆదుకున్న ఒక ఆదర్శవంతుడైన వీరాస్వామి అనే టైలర్ కథ.

కథానిక యవ్వనంలో రాస్తారు. నవల అనుభవంతో పండిన తర్వాత రాస్తారు అనే మాట ఒకటుంది. వెంకట్రావు గారు తన జీవితానుభవం నించి ఈ నవల రాశారు అనిపిస్తోంది. తన ముందుమాటలో రచయిత "నాకు తెలిసిన జీవితాన్ని, కళ్ళముందు కనిపిస్తున్న మార్పుల్ని నా అవగాహన మేరకు చిత్రించాను." అని చెబుతారు. ఈ రచయితకు కేవలం జీవితానుభవమే కాదు, మార్క్సిజం వెలుగులో కలిగిన శాస్త్రీయదృష్టి కూడా వుందని ఈ నవల స్పష్టం చేస్తుంది.

ఒక వ్యక్తి జీవితంలో వచ్చే మార్పులు యాదృచ్ఛికాలు కావని, వాటికి సామాజిక, ఆర్థిక చలనాలు కారణమని ఈ నవల ప్రతిపాదిస్తుంది. ఈ విషయంలో రచయితకు స్పష్టమైన ఎరుక వుంది. ఈ సంగతినే పదేపదే స్పష్టం చేస్తారు రచయిత. "పెట్టుబడిదారీ వ్యవస్థ వేళ్ళూనుకునే క్రమంలో ఇటువంటి మార్పులు అనివార్యం. మన నమ్మకంతో, మన ఆశలతో వాస్తవాలకు, మార్పులకు సంబంధం వుండదు. చరిత్ర తన మానాన అది నడుస్తూనే వుంటుంది" అని ఒకచోట అంటారు రచయిత.

విజయనగరంలో ఒక రిక్షా కార్మికుని కొడుకు నారాయణ. తండ్రికి, తన కొడుకు తనలా రిక్షా తొక్కి బతకాల్సిన స్థితి రాకూడదని, ఏదైనా చేతివృత్తి నేర్పిస్తే, తన కాళ్ళ మీద తను నిలబడగలడని ఒక టైలర్ దగ్గర పని నేర్చుకోవడానికి చేర్పిస్తాడు. పని నేర్చుకున్న నారాయణ వివిధ టైలరింగ్ షాపుల్లో పనిజేస్తూ, మాస్టర్ల చేత గౌరవింపబడుతూ, పెద్దమనిషి తరహాగా జీవిస్తుంటాడు. అతనికి ఒక కొడుకు, ఒక కూతురు.

దసరా సమయంలో బరంపురం ప్రాంతాల నుండి టైలరింగ్ షాపుల వాళ్ళు వచ్చి, విజయనగరంలో నిపుణులైన టైలర్స్‌ని అక్కడికి తీసుకెళ్ళి సీజన్ అయ్యేవరకు వుంచుకుని హెచ్చుమొత్తం ముట్టచెబుతుంటారు. టైలర్లు అంతా ఆ ఏజెంట్ల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తూ వుంటారు. ఆ రకంగా కుటుంబ ఆర్థిక అవసరాలు తీర్చుకోవచ్చని వారి ఆశ. అలాంటి వారిలో నారాయణ ఒకరు. అయితే రాను రాను పరిస్థితి మారిపోతుంది. బరంపురం ఏజెంట్ల రాక నిలిచిపోతుంది. దానికి కారణం రెడీమేడ్ వస్త్రాలు మార్కెట్‌ను ఆక్రమించుకోవడమే.

ఈ స్థితిని రచయిత ఇలా రికార్డు చేస్తారు...'కుట్టేసి సిద్ధంగా వున్న రేడీమేడ్ బట్టలు అందుబాటులోకొచ్చాయి. అద్దాల బీరువాల్లో, ఆకర్షణీయంగా మంచి మంచి పేకింగులతో, అట్టపెట్టెలతో అందంగా, కళ్ళు జిగేల్‌మనేట్టు వున్నాయి. షాపుల నిండా ట్యూబులైట్ల వెలుగులే. అలాంటి షాపుల నుండి టైలరింగ్ షాపుల్లోకి వస్తే.." అవి రేడీమేడ్ షాపుల ముందు వెలవెలబోతూ కనిపిస్తాయి. పైగా ప్రజల అలవాట్లలోనూ మార్పులొచ్చాయి. ఒకప్పుడు పండగలకి ముందే బట్టలషాపు బట్టలు కొని కుట్టించుకోవడానికి ఇచ్చేవారు. ఇప్పుడది మారి పండగ దగ్గర పడ్డాక కుటుంబం అంతా షాపుకెళ్ళి బట్టల్ని ఎంచుకుని తెచ్చుకుంటున్నారు. ఈ కారణంగా టైలరింగ్ షాపులు బేరాలు లేక మూతపడుతున్నాయి. టైలర్లు వృత్తిని వదిలి వేరే పనుల్లోకి వెళ్ళిపోతున్నారు. ముఖ్యంగా పిల్లలు, మగవారి బట్టల విషయంలో రేడీమేడ్ దుస్తులదే పైచేయి.

ఆర్థిక ఇబ్బందులన్నా, ఊళ్ళో స్వంత ఇల్లు వుండటం, పక్కపోర్షన్ అద్దెకివ్వడంతో బ్రతుకు బండిని ఏదో ఓ మాదిరిగా లాగిస్తుంటాడు నారాయణ. అయితే ఆదాయం సరిపోక జీతాన్ని అడ్వాన్స్‌గా తీసుకుంటుంటాడు తరచుగా. పరిమితమైన మద్యపానం ఒకటే అతని బలహీనత. ఇలా సాగుతున్న నారాయణ జీవితం, యాక్సిడెంట్ కావడంతో కుడిచెయ్యి విరిగి ఒక్క కుదుపుకు లోనవుతుంది. హైదరాబాద్‌లో రేడీమేడ్ పరిశ్రమలో పనిజేసే కొడుకు దగ్గరికి సతీసమేతంగా వెళ్ళవలసి వస్తుంది.

అక్కడ రామాచారితో పరిచయమవుతుంది నారాయణకి. స్వర్ణకార కళలో నిష్ణాతుడైన చారి, కొడుకు చేసిన మోసానికి బలి అయి, శ్రీకాకుళం జిల్లాలోని స్వంత ఊరు వదలి కూతురు దగ్గరకి హైదరాబాదు చేరుకుని, బ్రతుకు తెరువు కోసం సెక్యూరిటీగార్డుగా పని చేస్తుంటాడు. చారి ప్రగతిశీల సాహిత్యం బాగా చదువుకున్నవాడు. సామాజిక విషయాలపై స్పష్టమైన అవగాహన కలిగిన వ్యక్తి.

అతని మాటలు వింటూ, అతను చదివే పుస్తకాల వైపు ఆకర్షితుడవుతాడు నారాయణ. శ్రామిక వర్గదృష్టి చారిది. అతని ప్రభావంతో, చిన్నప్పుడు వదిలేసిన చదువును కొనసాగించి,

ఆయన చదివే పుస్తకాల్ని చదవాలని ఉబలాటపడతాడు నారాయణ.

'కష్టపడేవాళ్ళదే న్యాయం. వాళ్ళకే అన్యాయం జరుగుతోంది' అంటాడు చారి. 'అందుకే నచ్చుతాడు అతను..' అని అనుకుంటాడు నారాయణ. 'కష్టపడే వాళ్ళంతా ఒక వర్గం. అది తెలుసుకోలేకపోతున్నారు కష్టపడే వర్గం. ఎంతసేపూ కులం కులం అంటారు. అన్ని కులాల్లోను పేదలు వున్నారు. ఈ పేదవర్గం అనే స్పృహ లేదు' అంటాడు చారి. ఇది ఆ పాత్ర వేదనే కాదు రచయితది కూడా అనిపిస్తోంది. రచయిత 'స్వరాన్ని' స్పష్టం చేసిన పాత్ర ఆచారిది.

'సహజ అవసరం కాదు మాపని' స్వర్ణకారుడైన ఆచారి నారాయణతో అన్న మాటలివి. 'బట్ట అవసరమే. కుర్చీ అవసరమే. తిండి అవసరమే. మరి బంగారంతో ఏం అవసరం. బంగారం లేకపోయినా బ్రతకవచ్చు. కాని తిండి లేకపోతే బతకలేం. బట్టలేకపోతే బతకలేం' ఇది చారిలో కనిపించే ఆలోచనా ధోరణి.

ఆచారి గుండెపోటుతో హఠాత్తుగా మరణిస్తాడు. ఆయన కూతురు చారి పుస్తకాల్లో కావాల్సిన వాటిని తీసేసుకోమని నారాయణతో అంటుంది. 'కేపిటల్' గ్రంథం రెండు భాగాలు తీసుకుంటాడు నారాయణ, చారి గుర్తుగా.

'ప్రపంచ జనాభాను రెండు రకాలుగా విభజించాలి. ఒకటి 'కేపిటల్' చదివిన వాళ్ళు. రెండు చదవని వాళ్ళు. ఇన్నాళ్ళూ రెండోభాగంలో ఉండేవాడిని. కనీసం ఆచారికోసమైన చదవాలి. నేడు చదవడమే కాదు సాధ్యమైనంత వరకు అందరికీ చెప్పాలి' అని అనుకుంటాడు నారాయణ. నారాయణపై ఆచారివేసిన గాఢమైన ముద్రకు ఈ మాటలు నిదర్శనంగా నిలుస్తాయి.

చెయ్యి బాగుపడ్డాక ఖాళీగా వుండలేక, కొడుకు పనిజేసే రెడీమేడ్ పరిశ్రమలో ఉద్యోగిగా చేరతాడు నారాయణ. కాని అక్కడ పని విధానానికి తట్టుకోలేక వచ్చేస్తాడు. విజయనగరంలోని పాత యజమాని రమ్మని పిలవడంతో, భార్యతో సహా ఊరుకి తిరుగు ప్రయాణం కడతాడు నారాయణ. దీంతో నవల ముగుస్తుంది.

ఈ దర్జీ వృత్తి మన దేశంలో ఇస్లామిక్ పరిపాలనా కాలం నించి మొదలైందనిపిస్తోంది. ఇదివరలో ఈ వృత్తిలో స్థిరపడిన వారిలో ఈ వర్గం వారు ఎక్కువగా కనిపించేవారు. ఈ వృత్తిలో వాడే పారిభాషిక పదాలు ఈ విషయాన్ని రూఢి పరుస్తాయి. ఈ నవలలో ఇలాంటి పదాల్ని మనకి పరిచయం చేస్తారు రచయిత. 'అంగుస్తాన్' అంటే టైలర్లు కుడి చెయ్యి మధ్య వేలుకి, చేతి పని చేసేటప్పుడు సూది గుచ్చుకోకుండా పెట్టుకునే రక్షణ సాధనం. 'అంగుళి' అంటే సంస్కృతంలో వేలు అని అర్థం. వేలుకి పెట్టుకునేది కాబట్టి దానికి ఆ పేరు వచ్చి వుంటుంది. ఇది ఉరుదూ పదం అనిపిస్తోంది. అలాగే మెడదగ్గర గుండ్రని భాగాన్ని 'గులక్' అంటారట. ప్రాంతం బట్టి మాండలిక బేధాలు వుండవచ్చుని చెబుతారు రచయిత.

నవలలో కొన్ని సంభాషణలు పాఠకుల్ని ఆసక్తిగా చదివిస్తాయి. "ఏట్రా.. ఇది!.. రేడీమేడ్ కొన్నావు..టైలర్ అన్నవాడు ఎవడైనా రేడీమేడ్ కొంటాడా?.. కుమ్మరోడు కుండను కొన్నట్టు?" అంటాడు నారాయణ, తనకి రేడీమేడ్ షర్టుకొన్న కొడుకుతో. మరోచోట, నారాయణ మనవలు టీవీలో 'పోగో' ఛానెల్ పెట్టమంటారు. ఆ ఛానల్ విషయం తెలియని నారాయణ "పోగా' టైలర్ వంటి మీద పోగులు కాక ఇంకేం వుంటాయి" అంటాడు. ఇలాగే ఇంకొకసారి... 'అసలు సిరి ఉంటేనే సీడ కూడా ఉంటుంది. సిరిని అంటిపెట్టుకునే ఈ జబ్బులన్నీ" అంటాడు నారాయణ. ఇది చారి పాత్ర ప్రభావంతో అన్నమాట. ఇంకొకచోట "ఫొటోలో ఉన్నట్టే కుట్టాలట. ఫొటోలో ఉన్నంత పెర్సనాల్టిగా వున్నాడేటి? ముందుకి కడుపు తన్నుకొచ్చేసింది. తిండి తగ్గించుకోరుగాని.. సినిమా హీరోల్లా వుండాలని కోరిక" అంటాడు. నిజమే ఒళ్ళు బట్టే డ్రెస్సు.. ఈ సందర్భంలో డెబ్బైలలో ఓ మాసపత్రికలో వచ్చిన గుత్తుల భాస్కరరావు కథ 'చక్రాల చీర' గుర్తుకొచ్చింది. బట్టల షాపు ముందుపెట్టిన బొద్దుగా వున్న బొమ్మకి కట్టిన చీరని చూసి ముచ్చటపడి ఓ బడుగుజీవి కష్టపడి డబ్బులు పోగుచేసుకుని ఆ చీరని కొంటాడు. బక్కచిక్కి వున్న అతని భార్యకి ఆ చీర ఏ మాత్రం నప్పదు. దాంతో అతను డీలాపడతాడు.

జీవితాన్ని సరళంగా స్పష్టంగా డాక్యుమెంట్ చేసిన ఈ నవల ఒక వారపత్రికలో సీరియల్‌గా వచ్చింది. ఎన్నో పత్రికల్లో రివ్యూలు వచ్చి పాఠకుల దృష్టిని ఆకర్షించింది. ఉత్పత్తి సంబంధాల్లో వచ్చిన మార్పుల వల్ల అనివార్యంగా ఉత్పత్తి సాధనాల్లో కలిగే పరిణామాలు మనిషి జీవితంపై చూపే ప్రభావాన్ని సైద్ధాంతిక చర్చ లేకుండానే చెప్పిన నవల 'మారిపోయెరా కాలం'. సాహిత్యాన్ని కాలక్షేపం కోసం కాక, అవగాహన కోసం, వికాసం కోసం చదివే పాఠకులు ఇష్టపడే నవల ఇది. రచయిత వి. వెంకట్రావు అభినందనీయుడు.◆

# పురస్కారాలు

## సాహిత్య ప్రస్థానం మే 2020 పురస్కారాలు

**కనుమరుగవుతున్న కళారూపానికొక జ్ఞాపిక**

వ్యాసానికి : రూ.500/-

రచయిత : పాదిలి నాగరాజు

**ఎలా?**

కవితకు : రూ. 500/-

రచయిత : రాయపాటి శివయ్య

■■■

వ్యాసానికి కల్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం

కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం, చెక్కులు ఈ రచయితలకు అందుతాయి

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

*- ఎడిటర్*

## ల్యాండ్ స్కేప్ గార్డెన్

- తిరునగరి శరత్ చంద్ర
6309873682

అక్కడ
నడిచే అడుగులకే
పూలు పూస్తాయి
ఆ పూల పేరు ఆశయాలు.
అక్కడ
కదిలే చూపులే కవితలు రాస్తాయి
ఆ కవితల తీరు సూర్యోదయాలు.
అక్కడి చెట్ల క్రింద కూర్చున్న
విద్యార్థులు ఋషులై కనబడతారు.
పుస్తకాల పుటల జపమాలలు తిప్పి
తపస్సు చేస్తుంటారు
ఉద్యోగ లోక క్షేమం కోసం
హోమం చేస్తుంటారు.
తమ శ్రమనే ఆజ్యంగా పోస్తారు.
రోజంతా రాళ్లై భూమికి
అతుక్కుపోతారు.

ఆ వనంలో అడుగుపెట్టగానే
ప్రతి వాడికి
జ్ఞానోదయమవుతుంది.
ప్రతి కొమ్మ గాలి ద్వారా,
ప్రతి పక్షి తన రెక్క ద్వారా
ధర్మసందేశాన్ని మనిషి
మెదడులోకి వంపుతుంది.
అందుకే -
అక్కడి ప్రతి చెట్టు నాకు మహాబోధిలా
కనబడుతుంది.
అక్కడ
కొన్ని పక్షులు ప్రేమసందడిలో
ఓలలాడుతూ కిలకిలరావాలు చేస్తాయి.
మరికొన్ని
నాయకత్వ లక్షణాలను
ఒంటికెక్కించుకుని
సమావేశాల్లో మునిగితేలుతాయి.
అక్కడి పూలరంగులు గాలిలో చేరి
సూర్యుడి కిరణాలకే కాంతులద్దుతాయి.
అక్కడి అవనియే వేరు.

సన్ రైజ్ లో ఒక అందం
సన్ సెట్ లో ఒక అందం ల్యాండ్ స్కేప్ ది.
గ్రీనరీ ఎప్పుడూ
అంటిపెట్టుకునే ఉంటుంది
ల్యాండ్ స్కేప్ ని.
వసంతం ఆ వనాన్ని
విడిచి పోనేపోదు.
ఎన్నెన్ని బృందగానాలో ఆ అభినవ



బృందావనంలో..
షాలిమార్, హ్యాంగింగ్, పింజోర్ ,
లీజర్ వాలే,
చాస్ మీ షాహీ, నిషాత్, లోదీ గార్డెన్స్
ఎన్నో గుర్తొస్తుంటాయి
మా ల్యాండ్ స్కేప్ ని చూస్తే..
అక్కడ పాదం మోపిన ప్రతీసారి
అరికాళ్లలో
ఏదో పులకింతల పుప్పొడి చేరి
శరీరం తీపిరాగాల
తేనెపట్టు అవుతుంది.
మనసు పావురమై ఎగిసి
ఆ పూలవనాల చుట్టే కేరింతలు
కొడుతుంది.

*(ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ల్యాండ్ స్కేప్ గార్డెన్ గురించి..)* ♦

# దుర్భర ఘట్టంలో నిర్భర మంత్రాల నిజరూపం



- తెలకపల్లి రవి

భారతదేశం మరీ ముఖ్యంగా పేద భారతం ఎదుర్కొంటున్న కరోనా కష్టాలకూ ప్రధాని నరేంద్ర మోడీ ఆత్మనిర్భరత ప్రవచనాల ప్యాకేజికి ఏమైనా సంబంధం ఉందా? పోనీ ఆ ప్రవచనాలకు తర్వాత ఆర్థిక మంత్రి ప్యాకేజీల పేరిట వరుసబెట్టి చేసిన సుదీర్ఘ ప్రకటనలకూ పొంతన ఏమైనా ఉందా? ప్రభుత్వ ఖజానాలోంచి పైసా తీయకుండా తక్షణ ప్రత్యక్ష సహాయం ప్రసక్తిలేకుండా ప్యాకేజీ ప్రచారాలకు అర్థమేమైనా ఉందా? రోజుల తరబడి వినిపించిన విధాన ప్రకటనల తర్వాత దేశంలో ఏ తరగతికైనా ఎంత సహాయం ఎప్పుడు ఏ విధంగా అందుతుందో అంతుపట్టిందా? ఈ ప్రశ్నలన్నిటికీ సగటు భారతీయుడిని ఎవరిని అడిగినా తల అడ్డంగా వూపేస్తారు.

ప్రచారక్ ప్రధాని ప్రకటించిన ప్యాకేజీ వాస్తవానికి టాకేజీ మాత్రమేనని అందరికీ అర్థమై పోయింది. ప్రతిదానికి ఒక టాగ్‌లైన్, ఒక కాయినింగ్ ప్రచార ప్రక్రియకు ప్రాణం. స్వచ్ఛభారత్, శ్రేష్ఠభారత్, మేకిన్ ఇండియా, వంటి పదబంధాలతో కొత్త సీసాలో పాతసారా కుమ్మరించడం ఆయనకు బాగా అలవాటై పోయింది. సమయం సందర్భం చూడని సూక్తులు సంఘపరివార్ ప్రతినిధిగా దానికి నాలుగు శ్లోకాలు ఇది మోడీ వరవడి. వేల సంవత్సరాల భారతదేశ ఘన వారసత్వం హిందూత్వ వాదుల స్వంతమైనట్టు చెప్పుకోవడం అందులోనూ తన ఆరేండ్ల పాలనతో జోడించి ఆత్మస్తుతి చేసుకోవడం దీనికి అదనం. ఈ పరవశంలో సమయం సందర్భం కూడా చూడని ప్రచార ప్రవృత్తి ప్రధానిమోడీ ప్రత్యేకత. ప్రస్తుత ప్రహసనం దానికి ప్రస్ఫుటమైన ఉదాహరణ.

### కరోనా ముట్టడిలో క్వాంటమ్ జంపు కబుర్లా?

ఇప్పుడు సందర్భం కరోనా నివారణ, దాన్ని అరికట్టే పేరిట విధించిన లాక్‌డౌన్లతో ఏకపక్ష చర్యలతో ఊహించని సమస్యల పాలైన కోట్లాది భారతీయులకు ఊతం ఇవ్వడం. ఉపశమనం కల్పించడం. ఈ సమయంలో ఆత్మ నిర్భరత పేరిట అనర్గళ ప్రబోధం చేస్తే ఉపయోగమేమిటి? ఇంతకూ నిర్భరత అంటే ఆధారపడటం. ఆత్మ అంటే తనపై తానే. స్వాతంత్రం వచ్చిన నాటినుంచి మనం చెప్పుకుంటున్న స్వావలంబన స్వయం పోషకత్వ సాధన తప్ప ఇది మరొకటి కాదు. కాని అదే చెబితే మోడీజీ గొప్ప ఏముంటుంది? కాబట్టే ఆత్మ నిర్భరత అన్న కొత్త పద సృష్టి. పట్టాలపై మృత్యువుపాలైన, రోడ్లమీద నడవలేక అసువులు బాసిన, ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన, ఊరూరా ఆకలితో ఆలమటిస్తున్న కోట్ల మంది వలస జీవులు, జీతాలు రాని పనులు లేని కార్మికులు తిండి దొరకని అభాగ్యులు, వీరిలో ఎవరికీ ఆర్థిక సహాయం గానీ, ఆహార దినుసులు గానీ అందించని అధినేత ఆత్మ నిర్భరత

చెప్పడం యాదృచ్ఛికం కాదు. మేము ఎలాగూ పట్టించుకోం గనక మీరు మీ తంటాలు పడండని ప్రధాని భారతీయులకు చెబుతున్నారన్నమాట! సంక్షోభాన్ని అవకాశంగా తీసుకోవడం కరోనా తాకిడి వంటి వాటికి ఎలా వర్తిస్తుంది? కరోనా తాకిడితో తల్లడిల్లిన దేశం కాలూచేయీ కూడదీసుకుని మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించవలసిన సమయంలో క్వాంటమ్ జంప్‌ల గురించిన కబుర్లు చెప్పడం మరెంత అసందర్భం?

## పైసా ఇవ్వని పాలు పోయని ప్యాకేజీ

ఈ నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రోజువారి ప్రకటనలు నిరర్థక తతంగాలుగా మారడం యాదృచ్ఛికమేమీ కాదు. ఖజానా నుంచి నయాపైసా తీయకుండా, తక్షణ ప్రత్యక్ష సహాయం ప్రసక్తి లేకుండా ఇంత ఆర్భాటంగా ప్యాకేజీ పరంపర ప్రకటించడం ప్రపంచంలో ఇదే మొదటిసారి కావచ్చు. చిన్న మధ్య తరహా పరిశ్రమలతో మొదలుపెట్టి వివిధ రంగాల వారిగా ఆమె చేసిన ప్రకటనలన్నీ గతంలో ఉన్నవీ భవిష్యత్తులో రానున్నవీ తప్ప తక్షణమైనవి కాదు. నగదుతో గడువుతో ముడివడినవీ కాదు. ఎంఎస్ఎంఈ నిర్వచనం మార్చడం లాంటివైతే శాసన ప్రక్రియ పూర్తి చేశాకే అమలులోకి వస్తాయి. టీడీఎస్ పాతికశాతం తగ్గింపు వంటివి తాత్కాలిక వాయిదాలు మాత్రమే. అత్యధిక భాగం ప్రతిపాదనలు ఎప్పుడు ఇచ్చేది చెప్పని అప్పులు. ఉదాహరణకు మూడు లక్షల కోట్ల అప్పులు అంటూ ఆర్థికమంత్రి చెబితే అందులో కేంద్రం వాటా పదివేల కోట్లనీ అది కూడా వెంటనే అమలుకు వచ్చేది కాదనీ నిపుణులు లెక్క కట్టారు. ఆ అప్పులు ఇవ్వడానికి బ్యాంకులు భయపడుతుంటే మళ్లీ ఆ మంత్రిగారే ఊదరగొడుతున్నారు. జీతాలు రాని కార్మికులు ఉద్యోగులకు వాటిని ఫలానా తేదీలో అందిస్తామన్న హామీ ఏదీ లేదు. పీఎఫ్‌లో కార్మికులు కట్టిన వాటా కూడా ఎగవేయడం పరిపాటిగా మారిన దేశంలో యజమానుల వాటాను తగ్గించి అది కూడా చెల్లిస్తామని చెప్పడం ఎలాంటి రాయితీ ఎవరికి రాయితీ? చట్టాలలో మార్పులు కూడా క్వాంటమ్ జంప్‌లో భాగంగా చెప్పిన ప్రధాని మాటలు కార్మిక చట్టాలపై వేటుగా మారడం దేనికి నిదర్శనం? (తర్వాత దశలో సుప్రీం కోర్టు జీతాలు ఇవ్వలేకపోతే మేమెలా ఆదేశించగలమని చేతులెత్తేయడం ద్వారా న్యాయవ్యవస్థ కూడా ఎటున్నదీ చెప్పేసింది) వ్యవసాయ కార్మికులు అన్న మాటకూడా ఆర్థిక మంత్రి నోటరాకపోవడం, బడ్జెట్‌లో చెప్పిన పథకాలను కేటాయింపులనే అటూ ఇటూ తిప్పి చెప్పడం ఏ విధమైన క్వాంటమ్ జంప్? విదేశీ పెట్టుబడులకు మార్కెట్‌లకు తలుపులు బార్లా తెరిచి గనుల నుంచి గగనాల వరకూ అప్పగించిన కేంద్రం కరోనాలోనే జ్ఞానోదయమైనట్టు లోకల్ బ్రాండ్లను పెంచుకోవాలని స్వదేశీ స్మరణ ప్రారంభిస్తే విలువేమిటి? ఆ వెంటనే హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వంటివారంతా తమ తమ శాఖలలో దేశీయ బ్రాండ్లనే వాడాలని ఆఘమేఘాల మీద ఆదేశాలు ఇవ్వడం హాస్యాస్పదం. వారీ హడావుడి చేస్తున్నప్పుడే హెచ్ఎఎల్‌ను దెబ్బతీసి మరీ కొనుగోలు చేసిన రఫేల్ యుద్ధవిమానాల రాక ఇందుకు నిదర్శనం. చైనా మార్కెట్టు అక్కడ పెట్టుబడులు తరలిపోతాయి గనక వాటిని భారత్‌కు ఆకర్షించాలనే మహత్తర వ్యూహం ఏదో ఇందులో ఉందని భ్రమ పెట్టే ప్రచారం కూడా ఇందులో భాగమే. ఇదే సమయంలో దేశంలోనే పెద్దదైన కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ జియోలోకి మూడు వారాలలో అరవై వేల కోట్ల పెట్టుబడులు రావడం, చిల్లర కొట్టును కూడా ఫేస్‌బుక్ వాట్సప్ ఆగ్రిగేటర్‌లతో అనుసంధానం చేసి పట్టుబిగించే అవకాశం అనుమతించడం తలకిందులుగా లేదూ?

## అనుమానాస్పద పోకడలు

ప్రధాని ప్రసంగంలోనూ నిర్మలా సీతారామన్ ప్రకటనలలోనూ ప్రజారోగ్య రంగానికి సంబంధించిన ప్రస్తావనలే లేకపోవడం మరీ విపరీతం. సమస్యే ఆరోగ్య సవాలైనప్పుడు దాన్ని విస్మరించడం ఎలా జరిగింది? లాక్‌డౌన్ తర్వాత దేశంలో వైరస్ పాజిటివ్ కేసులూ మరణాలు కూడా పెరిగినా మనమేదో కరోనాను జయించేసి తదనంతర కర్తవ్యాలు నిర్దేశించుకుంటున్నట్టు బిల్డప్ ఇవ్వడం ఆత్మ వంచనే. టెస్టుల సంఖ్య చాలా పరిమితంగావున్నా ఇప్పటికే మనం పాజిటివ్‌లలో చైనాను దాటేశాం. మరణాల సంఖ్యలోనూ ప్రపంచ జాబితాలో చేరాం. అన్నిటికంటే ఆందోళన కరమేమంటే ఈ వైరస్ వ్యాప్తి, టెస్టులు, సోకిన వారికి అందుతున్న చికిత్స, మరణాలు, స్త్రీ పురుష వయో నిష్పత్తి వంటి వివరాలు విడుదల చేయడంలోనూ ఆంక్షలు విధించడం. మొదటి నుంచి వీటిని పర్యవేక్షిస్తున్న ఐసీఎంఆర్‌ను తప్పించడం. వారిపై ఒత్తిడితెచ్చి గుజరాత్ సంస్థకు కిట్లు పీపీఈల ఆర్డర్లు ఇప్పించడం వంటివి జరిగిపోయాయి. ఈ అంశాలపై సైన్స్ ఉద్యమ నాయకులతో

## కవిత

# రాతి మనసులు

- ప్రసాద్ బాబు .పి.యస్.వి.
9704387870

మా నేత్రాలు మమ్ము
ఒకరికొకరి తిలకించుకొని
తన్మయంలో మునిగి ఊహా
లోకంలో విహరించేందుకేనా...
మా పొడవైన నాసికాలు
ప్రకృతి పరిమళాలను పసికట్టి
పరవశించి పగటి కలలు
కనేందుకేనా....
మా సొంపైన చెవులు
ఇంపైన శబ్దాలు విని
ఊరుకొనేందుకేనా..
మా నునుపైన చర్మాలు
సుతిమెత్తగా స్పర్శించినా
స్పందించలేవా...
మా మధురమైన గొంతులకు
ప్రేమ పలుకులు పలుకుటకు
అర్హతలేదా..
మా మృదువైన పెదవులు
అధరామృత రుచిని
ఆస్వాదించలేవా..
మా జంట హృదయాలు
ఎప్పటికీ ప్రేమకు
స్పదించలేవా...



మా మనస్సులు
ఎప్పటికీ ఒక్కటి కాలేవా..?
మా మనసులు రాతి మనస్సులు
అయినంత మాత్రాన...? ♦

---

చర్చించిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక మే 8న ప్రచురించిన కథనాన్ని నెట్‌నుంచి తొలగింప చేశారు. గుజరాత్ ఢిల్లీలలో మీడియా ప్రతినిధులపై కేసులు విధించడం నోటీసులివ్వడం కూడా ఇందులో భాగమే. చివరకు ఆరోగ్య సవాలు ముగిసి ఆర్థిక రంగమే ముఖ్యమైనట్టు ఇప్పుడు ఆరోగ్య శాఖ బ్రీఫింగ్స్ కూడా ఆపేశారు. ఇదంతా వ్యూహాత్మకంగా జరుగుతున్న వ్యవహారమే. తమ సన్నద్ధత లోపం తెలియకుండా ఆరోగ్య సదుపాయాలు లేవు కాబట్టి లాక్‌డౌన్ యాభై రోజులు నడిపించారు. లాక్‌డౌన్ విధింపులాగే సడలింపు కూడా ప్రణాళికా బద్ధంగా లేకపోవడం వల్ల ఇప్పుడు కేసులు పెరుగుతున్నా పరిష్కారం లేదు. కేరళ అత్యంత జయప్రదంగా వైరస్‌ను అరికట్టింది. గుజరాత్ మహారాష్ట్రలు దారుణంగా విఫలమైనాయి. కానీ ఈ వివరాలు పంచుకోవడం కేంద్రానికి ఇష్టం లేదు.

### రాష్ట్రాలకు రిక్తహస్తం.. మోడీనే సమస్తం


మొత్తం మోడీ ఘనతగా చూపించే ప్రచారం ప్రసంగాలు తప్ప రాష్ట్రాల పాత్రను కనిపించకుండా చేయడం, వాటికి భాగస్వామ్యం సహాయం అందించకపోవడం ఇందులో మరీ దారుణమైన అంశం. అన్నీ ఢిల్లీ నుంచి వచ్చినట్టు ఉండాలి. పీఎం కేర్స్ ఫండ్‌పై ఎవరి అదుపు లేదు. అంటే రాజ్యాంగ నిబంధనలతో నిమిత్తం లేకుండా మోడీజీ మొత్తం చక్రం తిప్పుతారన్న మాట. అది బీజేపీ రాజకీయ ప్రయోజనాల బాటలో ఉంటుందని అందరికీ తెలుసు. ఆత్మ నిర్భర భారత్ మంత్రాన్ని త్వరలో వచ్చే శాసనసభ ఎన్నికలలో ప్రయోగించడం ఖాయం. దీనికి తోడుగా అంతర్జాతీయంగా ఆయన హీరోగా ఉన్నాడనే మోత మోగిస్తున్నారు. ఇది మనం గర్వించాల్సిన సమయమని మోడీ స్వయంగా ప్రసంగంలో చెప్పుకున్నారు. తాజా వివరాల ప్రకారం రెండు మాసాల లాక్‌డౌన్ కష్టాల తర్వాత కూడా భారతదేశం కరోనా కాటుకు గురైన మొదటి పది దేశాల్లో ఒకటిగా ఉంది. ఇది చాలక కోట్ల మంది వలస కార్మికుల ఆకలి కేకలు ఆవేదనాత్మక గాథల మధ్య అగమ్యంగా మారిన అఖిల భారతం దేనికి గర్వించాలో ఆయనకే తెలియాలి. అయితే ఆ విధమైన చిత్రణ దేశ ప్రజల మెదళ్లకెక్కించడానికి పెద్ద ప్రయత్నమే జరుగుతున్నది. మీడియాలో పెద్ద భాగం అందుకు తోడ్పడుతున్నది కూడా. అందుకే ఏ నాడూ మీడియా గోష్టి జరపని మోడీ అనుకూలమైన మీడియాధిపతులతో వీడియోభేటీలు జరిపారు. ఒక విపత్తును కూడా రాజకీయ ప్రయోజనానికి వాడుకోవడం గురించి నోమిక్లిన్ షాక్ డాక్ట్రిన్ అన్న పుస్తకం 2008లోనే రాశారు. డిజాస్టర్ క్యాపిటలిజం అన్న పదం అందులో ఆమె ఉపయోగించారు. మోడీత్వ విన్యాసాలు బీజేపీ బడాయిలు అక్షరాలా అందుకు పర్యాయ పదాల్లా ఉన్నాయి. కరోనా సమరంలో ఘోరంగా విఫలమై అమెరికాకు మహావిషాదం తెచ్చిపెట్టిన అధ్యక్షుడు ట్రంప్‌కు వంతపాడటం ఇందులో కొసమెరుపు.

(నవ తెలంగాణ దినపత్రిక 26.05.2020) ♦

## బంట్రోతు

- చిన్ని నారాయణరావు
9440202942


అతగాడు
గంగను మోసే శివుణ్ణి
కాపలాకాసే నందీశ్వరుడు
కార్యాలయ యవనికపై
తొలిసంతకం అతనిది
పనుల జాతరలో మొలకలెత్తిన
జనం గుండెల్లో రంగుల హెూలీలు
పూయిస్తాడు
శబ్ద భేదిని ఛేదించే
అభినవ అర్జనుడు అతగాడే
అధికారం జడలు విప్పగానే
పరుగుల పీటీ ఉష అవుతాడు
స్వప్నాలు పండించుకొనే కర్మవీరుల
పాలిట మార్గదర్శకుడవుతాడు
అవనత శిరస్సుతో వినమ్రంగా
పూలసజ్జలు పరుస్తాడు
కాలానికి కాపలాదారై
స్తంభింపజేసే నైపుణ్యం అతడిదే
అతని దేహమ్మీద కారుణ్య
పవనాలు
గుండెలపై ఎండిపోయిన అడవులు
కళ్ళల్లో ఇంకిపోయిన నీటిచెలమలు



చివరకు దారిచూపే సైన్‌బోర్డుగా
శిలా సాదృశ్యమవుతాడు
జీవితం జైల్లో బందీగా
మనిషే మునిగిపోతాడు! ♦

## దారి తప్పిన ఋతురాగం

- చందలూరి నారాయణరావు
9704437247



భానుడు
వెలుగు ఇచ్చేలోగా
మేఘుడు అడ్డుపడి
దారి తప్పినది
ఋతురాగం.

ఉరిమే లోగే
మబ్బు అలిగి
నీరు కరువై
నేల నెర్రెలైంది.

చినుకు
కినుకతో
పొలం కళ తప్పి
రైతు కల 'చితి'కింది.

భానుడు
బాధగా
వర్షిస్తున్నాడు

మేఘుడు
ఆగ్రహంతో
మండుతున్నాడు.


అరక 'సాగు' లేక
నేల ఒడిలో ఒరిగి
నాడి ఆగింది.

రైతు బతుకు
పంటకు
బలైంది. ♦

## రైతు మొగ్గలు

- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017

తొలకరికి పుడమితల్లి పులకరించినప్పుడల్లా
రైతన్నగుండెల్లో ఆశలు చిగురిస్తూనే ఉంటాయి
తొలకరితో ఆనందించి పరవశించేది అన్నదాత



మూగజీవుల మోములో ఆనందాన్ని కురిపిస్తూనే
వాన చినుకులతో నిండారా స్నానం చేయిస్తుంది
తనువులు తడిసిన పశువులు నర్తించే నటరాజులు

కళ్ళల్లో వేనవేలదీపాలను వత్తులువేసి చూస్తూనే
తొలకరికోసం నిరంతరం అసిధారవ్రతం చేస్తుంటాడు
బక్కచిక్కిన పొలాలకు నీళ్ళు తాపాలన్న తపన రైతన్నది

కరువు కాటకాలతో పల్లెలన్నీ వల్లకాడు కావడంతో
పొట్టచేతి పట్టుకుని పిల్లలతో వలసపోయిన రైతన్నలు
పట్నంలో కూలీలుగా మారిన పెద్ద భూస్వామ్య రైతులు

పల్లెటూళ్ళు దేశానికి పట్టుగొమ్మలని చెవిలో ఊదినా
కరువురక్కసి కాటుకు పల్లెలన్నీ వలసబాట పట్టాయి
పనుల్లేక రైతులందరూ కూలీలుగా కొత్త అవతారం ♦

కథ



# 1957

- గనారా
99492 28298

రామాలయం ప్రక్క నుంచి రెండు ఆవుల్ని, నాలుగు గేదెల్ని రైలుకట్ట అవతలికి తోలుకుపోతున్నాడు వీరాస్వామి. ఉదయం తొమ్మిది గంటలకే ఎండ తీవ్రం అయి చికాకు కలిగిస్తుంది.

'ఎండదెబ్బ తింటాడని' తల్లి ఎంత వాదించినా తండ్రి అంగీకరించలేదు. పైగా కుర్రాణ్ని 'నువ్వే పాడు చేస్తున్నా'వని ఆమెపై విరుచుకు పడ్డాడు.

ఇంటి దగ్గరే ఉంటే తండ్రితో సూటిపోటి మాటలు పడాలి. పైగా, ఖాళీగా ఉంచకుండా గొడ్లసావిడి బాగు చెయ్యమంటారు. ఈ బాధపడేకన్నా అదేదో గొడ్లని తోలుకుపోతే పరలో చెట్లక్రింద యువబృందంతో ఆటలు ఆడొచ్చు.

వెళుతూ, వెళుతూ రామాలయానికి కాస్త ఎడంగా ఉన్న పంపుదగ్గర ఆగి, బుడ్డిలో నీళ్ళు పట్టుకొని, రెండు దోసెళ్ళ నీళ్ళు తాగాడు.

దారిని పోయేవారు ప్రతీరోజు ఇంటికి వెళ్ళేముందు ఆ పంపు దగ్గరే ఆగి కాళ్ళుచేతులు శుభ్రం చేసుకుంటారు. గుక్కెడు నీళ్ళు తాగడానికి సమీపంలో ఉన్న రెల్లిపేట పిల్ల వచ్చింది.

"మీకు వేరే కుళాయి ఉంది కదా! ఈ పంపు దగ్గరకు వచ్చావేంటి?" గతంలో వచ్చిన గొడవలు దృష్టిలో పెట్టుకొని అడిగాడు వీరాస్వామి.

"ఇప్పుడు ఖాళీగానే ఉంది కదా! గుక్కెడు నీళ్ళు త్రాగి పోదామని"

"కాస్త దూరంగా జరిగి కడుగుకో! మీద పడతాయి"

పెద్దగొల్ల వీరాస్వామి ఆమె కులంతో తన కులాన్ని లెక్క కట్టుకున్నాడు.

తన కన్నా చాలా తక్కువ కులందే!

"పొద్దు ఎక్కువైంది కదా! ఇవ్వాడు తోలుకుపోతున్నావేమిటి?"

వీరాస్వామితో మాట కలిపింది.

కుళాయి నొక్కి పంపు అంతా కడిగి దోసెళ్ళల్లో నీళ్ళు పట్టి ముఖంపై జల్లుకున్నాడు.

"ఓలమ్మో! మైలైపోతాది!" వెటకారంగా అంది.

కోపంతో కళ్ళల్లోకి సూటిగా చూసాడు.

"నేనేమన్నాను? బాపనోళ్ళే నీళ్ళు తోడి పోస్తారు"

వీరాస్వామికి ఆమె మాట తీరు నచ్చలేదు. పైగా కాసింత గర్వం తొణికిసలాడింది.

"నీకు నాకు తేడా ఏమిటో! నేను పందులు కాస్తాను. నువ్వు గొడ్లు కాస్తావు. నేను మనుష్యుల పెంట, నువ్వు గొడ్లది ఎత్తుతావు. అంతే తేడా!" రోషంగా అంది.

వీరాస్వామి తమాయించుకొని వాదన పెంచకుండా భుజానికి ఉన్న తుండుగుడ్డ సర్దుకొని ముందుకు పోయాడు. దారి పొడవునా అదే ఆలోచన! ఎంత మాట అంది? నా పని దాని పని ఒక్కటేనా! వాళ్ళు కల్లు తాగుతారు. నేను పాలు, పెరుగు తాగుతాను. నేను గొడ్లు మేపుతాను, వాళ్ళు గొడ్లు

తింటారు' అనుకుంటూ రైలు కట్ట దాటి పరలోకి వెళ్ళి అక్కడ ఉన్న మందలతో కలసిపోయాడు.

కులాలవారిగా దళితులైన మాలమాదిగలు కాస్త దూరంగా రెల్లిప్రజలు, పందుల్ని మేపే ఎరుకుల వాళ్ళు ఉంటారు. వీరికి బాగా దూరంలో కాపులు, గొల్లలు, రెడ్లు ఉన్నప్పటికి క్రమంగా పేటల విస్తరణ పెరిగి చిన్నపెద్ద గొడవలు జరుగుతుంటాయి.

కుళాయిల దగ్గర దళితులకు నీళ్ళు పట్టుకొనే అవకాశం లేకపోవడంతో తరచూ గొడవలు అవుతూ ఉంటాయి. 'సి.వి.కె.రావు' అనే కమ్యూనిస్టు నాయకుడు కలగజేసుకొని మరో కుళాయి అదనంగా వేయించి నీళ్ళ సమస్య పరిష్కరించాడు.

చల్లబడి, పొద్దు కుంగుతుంటే గొడ్లు చెరువులోకి తోలి శుభ్రం చేస్తూ అక్కడ ఉన్న గొల్ల కుర్రాళ్ళు, కాపుల కుర్రాళు ళ్ళ, బ్రాహ్మణుల సొంత ఆవుల్ని తోలుకొచ్చిన పాలికాపులు పనిలో పడ్డారు.

అవతల ఒడ్డున ఎండిపోతున్న చోట బుదదలో పడి దొర్లుతున్న పందుల్ని కర్రపుల్లతో అదిలిస్తున్న, ఉదయం చూసిన రెల్లి అమ్మాయిని వీరాస్వామి చూసాడు. నూనెరాసి దువ్వుకుని, కొప్పులో పూలు పెట్టుకొని, పూలచీర కట్టి ఆకర్షణీయంగా కనిపించింది. ఎంత పెంట తీసే పిల్ల అయినా తన అప్పాచెల్లెల కన్నా నాజుకుగా, శుభ్రంగానే కనిపిస్తుంది.

వీరాస్వామికి ఉదయం వచ్చిన కోపం లేదు.

"ఓరె పోలమ్మ వచ్చింది" అన్నాడు స్నేహితుడు.

"నీకు పేరు ఎలా తెలుసురా!"

"నేను పాలు పోసె బావనోళ్ళ ఇళ్ళల్లో దొడ్లు తుడుస్తుంది."

◆◆◆

ఓ రోజు గుళ్ళో భజన అయిన తరువాత ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. కాని వీరాస్వామి మరో ఇద్దరు స్నేహితులు కబుర్లు చెప్పుకుంటూ గుడి అరుగుమీద కూర్చున్నారు.

మొదటి ఆట సినిమా వదిలారు. రాత్రి పది అయింది. అక్కడక్కడ వీధి లైట్లు వెలుగుతున్నాయి. నాసిరకం కాంతి. నలుగురు ఆడవాళ్ళు గుంపుగా వస్తూ రెల్లిపేటవైపు తిరిగారు. బహుశా రెల్లి ఇంటి ఆడపడుచులనుకున్నాడు వీరాస్వామి.

మిత్రబృందంలో ఒకడు హుషారుగా విజులు వేసాడు. వెంటనే వాడ్ని వారించి,

"మీరు వెళ్ళండి మా వాడికి నేను బుద్ధి చెబుతాను. పెద్దలకు తెలిస్తే గొడవలు అవుతాయి." అని వీరాస్వామి సర్ది చెప్పాడు.

ఆడవాళ్ళకు కోపం వచ్చింది.

"పోదం పదవే ఏదో సరదాగా ఈల వేసాడు. మనం గొడవ చేస్తే రెండువైపులా బుర్రలు పగులుతాయి. ఆ అబ్బాయి చెబుతున్నాడు కదా!" అంటూ పోలమ్మ వీరాస్వామి కళ్ళల్లోకి చూసింది.

◆◆◆

రామాలయ కమిటి శ్రీరామనవమి ఘనంగా చేయాలని నిర్ణయించింది. అటు రెల్లిపేట కూడా అమ్మవారి ఉత్సవాలు యధా ప్రకారం పెద్దఎత్తున జరపాలని నిర్ణయించారు.

పోలీసులకు సంకటంగా మారింది. గతం నుంచి అనేక తగాదాలతో ఉన్న కులాల మధ్య ఎక్కడ చిచ్చు రగులుతుందోనని భయం. చిన్న సంఘటనకు కూడా పట్టుదలకు పోయే కుల రక్కసి. ఇది గమనించి ఇరువర్గాల పెద్దల్ని పోలీసు స్టేషన్‌కు చర్చలకు యస్.ఐ. రప్పించాడు.

"టౌన్‌లోంచి మా పేటకు, వాళ్ళ పేటకు ఒకటే దారి. గుడి అరుగులపై కూర్చొని మా అమ్మాయిల్ని చూసి వెటకారం చేస్తుంటారు. చాలా సహించాం, ఈ గొడవలు ఎందుకని మేమే కంపదారి శుభ్రం చేసుకొని వేరే మార్గం ఏర్పరుచుకున్నాం. అయినా నీళ్ళ పంపు దగ్గరకు వచ్చే ఆడవాళ్ళని ఎగతాళి చేస్తూ అవమానిస్తున్నారు."

"మా గుడి దగ్గర నవరాత్రులకు హరికథలు, బుర్రకథలు, డ్రామాలకు వాళ్ళంతా వచ్చి పోతుంటారు. అప్పుడప్పుడు ఆడవాళ్ళ వైపు రాళ్ళు పడుతుంటాయి. చాలాసార్లు సర్ది చెప్పుకున్నాం" కాపుపెద్ద అన్నాడు.

"నీతి లేని వెదవల్ని పట్టి ఇవ్వమన్నాం! పేట కుర్రాళ్ళు అదుపులోనే ఉంటారు" రోషంగా ఒక రెల్లిపెద్ద అన్నాడు.

"సినిమా లైన్ల దగ్గర, బ్లాకు మార్కెట్టు దగ్గర గొడవలు ఉన్నాయి సార్!" అన్నాడు కానిస్టేబుల్.

"మా కులపు కుర్రాళ్ళు మొరటోళ్ళు కాదు" అన్నారు ఒక కాపు, ఒక గొల్ల.

"కల్లు పాక దగ్గర, సారా కొట్టు దగ్గర ఇవేవి ఉండవు సార్!" కానిస్టేబుల్ వివరించాడు.

"గొడ్లు కోసిన చెత్త అంతా గెద్దలు మా పేటలో వేస్తున్నాయి. దూరంగా కోసుకోమన్నాం"

"ఎగిరే పిట్ట ఎవరి అదుపులో ఉంటుంది. పైగా వాళ్ళ గొడ్లు చస్తే, మేమే శుభ్రం చేసిస్తాము. బలిసినవాళ్ళు కాబట్టి నీచంగా మాట్లాడుతుంటారు"

"నోరు ముయ్యండి తాగుబోతు వెదవల్లారా!"

రెల్లి పెద్దకు కోపం వచ్చింది.

"మేము తాగుబోతు వెదవలమే సార్! బీడీలు, చుట్టలు తాగుతాం. నల్లమందు మింగుతాం! ఎందుకో తెలుసా! మురికి కాలవల్లో పీకల్లోతు మునిగి ఈ చేతులతోనే తీస్తాం! మలమూత్రాలు మేమే ఎత్తి పాడేస్తాం! శవాల్ని తియ్యడానికి మీరు పిలిస్తే పరుగెత్తి వస్తాం! ఆసుపత్రిలోకొస్తాం! అప్పుడు మాకు వచ్చే వాసన మీరు భరించగలరా! అందుకే సార్ తాగుతాం! మాకు సీమసరుకు ఎక్కడ దొరుకుతుంది? అందుకే కల్లుకి నాటుసారాకి బలైపోతాం" అన్నాడు.

యస్.ఐ. నోట మాట రాలేదు.

"నా దగ్గర వెదవ వేషాలు వెయ్యకండి. నవమి ముందు వస్తుంది కాబట్టి ముందు మీరు చేసుకోండి. తరువాత జాతర చేసుకోండి. ఎవరన్నా వెర్రివేషాలు వేస్తే, బొక్కలో వేసి కాళ్ళు చేతులు విరిచేస్తాను. కాగితాల మీద సంతకాలు చేసి వెళ్ళండి!" అంటూ తీర్మానం చేసింది పోలీసు గొంతు.

♦♦♦

జాతరకు సంబంధించిన మేకపోతులు పోలమ్మ ఇంటి దగ్గరే ఉంచారు రెల్లిపెద్దలు. అందుకే పరలో ఉన్న రాగిచెట్టు దగ్గరకు ఆకులు కోయడానికి పెద్దగెడ తీసుకొని వెళ్ళింది. దూరంగా తాటితోపు దగ్గర బిల్లాట ఆడుతున్న వీరాస్వామి చూసాడు. ఇదివరకు జరిగిన సంఘటన దృష్టిలో పెట్టుకొని కృతజ్ఞత చెప్పడానికి దగ్గరకు వెళ్ళాడు.

పోలమ్మ చిన్నగా నవ్వుకుంది.

"ఆ రాత్రి చాలా భయం వేసింది. మీ పెద్దలకు తెలియదు కదా పోలమ్మ! వాడు వట్టి ఎదవ. మీరు వెళ్ళిన తరువాత గట్టిగా తగిలించాం"

"మా పేటలో ఆడొళ్ళకు నేనంటే చాలా ప్రేమ. అందుకే నా మాట వింటారు... నా పేరు నీకెలా తెలుసు?"

"ఆ వెదవే చెప్పాడు"

పై కొమ్మలు అందక పోలమ్మ ఎగురుతుంటే వీరాస్వామి గెడ తీసుకొని కొన్ని రాగికొమ్మలు కోసి ఇచ్చాడు.

"నీవు చాలా పొడుగు" అంది అభినందనంగా.

నాలుగు రోజులు వరుసగా వచ్చి ఆకులు కోసుకుంటుంది. గెడ పైకి ఎత్తి ఎగురుతుంటే మట్టిగాజులు సవ్వడి, నల్లపూసలు, ఎర్రపూసల దండ ఎగిరి గుండెలపై లయబద్ధంగా పడి సంధ్య వెలుగులో మెరిసిపోతున్నాయి. వీరాస్వామికి, పోలమ్మ శరీరంలో రహస్యంగా దాకున్న హొయలు ఒక్కొక్కటిగా బయటపడుతుండటం చూసాడు.

పోలమ్మ నదురుగా కనపడుతుంది.

వీరాస్వామిలో నిగారింపు తన్నుకు వస్తుంది.

క్రమంగా అక్కడ పోలమ్మకు, వీరాస్వామికి స్నేహితులకు జత కలసింది.

♦♦♦

కొద్దిరోజులకు అమ్మవారి జాతర కూడా వచ్చింది. సాయంకాలం వూరేగింపు మొదలై తెల్లవారుజామున ముగుస్తుంది.

మధ్యాహ్నం అందరూ ఊరేగింపుకు సిద్ధమవుతుండగా పోలమ్మ ఇత్తడి కేరీజీతో రావిచెట్టు దగ్గరకు వచ్చింది.

దూరంగా కనబడుతున్న వీరాస్వామిని చూసి రమ్మని సైగ చేసింది. స్నేహితులు తలోదిక్కులో ఉన్నారు.

"తిను అమ్మవారి ప్రసాదం" అని కేరేజీ మూత తీసింది. లోపటి నుంచి కమ్మని వాసన వచ్చింది. నూనెలో తేలిన ముక్కలు కనిపించాయి.

"ఈ రోజు వేటపోతు వేసాము" అంది పోలమ్మ.

కారేజీ మూతలో నాలుగు గారెలు, 'పోతు' మాంసం వడ్డించింది.

అనుమానంగా ఆమె ముఖంలోకి చూసాడు.

"ఈరోజు అమ్మవారికి నైవేద్యం"

"గొడ్డు కాదు కదా!"

"ఏం కావాలా! చాలా బాగుంటుంది. బలం కూడాను"

దూరంగా జరిగాడు.

"కాదు! ఇక్కడకు వచ్చే మేకపోతే!"

అనుమానిస్తూనే నోట్లో పెట్టుకున్నాడు.

మరోటి, మరొకటి పూర్తి చేసాడు.

♦♦♦

ఆ నోట, ఈ నోట రెల్లిపిల్ల వెంట వీరాస్వామి తిరుగుతున్నాడని అటువైపు, ఇటువైపు వాళ్ళకు తెలిసింది.

పోలమ్మకు రెండు, మూడుసార్లు వాంతులు అయ్యాయి.

తండ్రి నిలదీసాడు

విషయం చెప్పింది

కులపెద్దలతో సమాలోచన జరిపాడు తండ్రి.

"వాళ్ళకు మనకు ఏదో ఒక విషయంలో గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు మరింత పెరుగుతాయి. బాగా ఆలోచించాలి. టౌనులో మిగిలిన పెద్దలతో కూడా చెప్పడం మంచిది" అన్నాడు రెల్లిపెద్ద.

"ఈలోగా ఆ కుర్రాడిని కట్టడి చేసి ఈ వూరు నుంచి పంపేస్తే?"

"అటువైపు పెద్దలకు కబురు చేసి మాట్లాడదాం"

"మనపిల్లదే తప్పంటారు" పేట ఆడవాళ్ళు కూడా సలహా ఇచ్చారు.

"తప్పు ఒకరివైపు ఉండదు" అన్నాడు ఎవరో

"ముందు వాణ్ని మనపేటలోకి తీసుకువచ్చి పెళ్ళి చేసుకోమని అడుగుదాం!"

"వాళ్ళు పెద్దకులపోలన్న, గర్వం. పైగా కుర్రాడికి చప్పుడు కాకుండా పెళ్ళి జరిపిస్తారు"

"అప్పుడప్పుడు మన కూడు తిని, నీళ్ళు తాగినవాడికి పట్టింపేంటి?" ఆ విధంగా చర్చ జరిగింది.

వీరాస్వామి మనస్సులో పోలమ్మ పూర్తిగా ఆక్రమించింది. రెండురోజులుగా కనిపించటం లేదు. మనస్సులో ఏదో కీడు సంకించింది.

రాత్రి 8 గం॥లకు గుడి దగ్గరకు వెళుతున్నట్లు ఇంట్లో అబద్ధాలు చెప్పి బయటకు వచ్చాడు.

మసక మసక వెలుగులో తలకు తువాలు చుట్టి, మెల్లగా నడుచుకుంటూ రెల్లిపేటలోకి ప్రవేశించాడు.

మట్టిరోడ్డు, ముగ్గులతో తీర్చిదిద్దిన వాకిళ్లు. అన్ని గుడిసెలే! అయినా, మట్టితో మెత్తిన గోడలు, పసుపు పూసిన గడపలు. అక్కడక్కడ కోళ్ళు గూడులు ఉన్నాయి. దూరంగా పెద్దదడి కట్టి పందుల్ని ఉంచారు.

వీరాస్వామి వాళ్ళు రెల్లి ప్రజల కన్న కాస్త ఉన్నత కులస్తులు. ఉన్నవారే!. పెంకుటిల్లు, మట్టితో మెత్తిన ఇటుక గోడలు, ఎత్తు అరుగులు. గచ్చు చేయని అరుగు మీద అప్పుడే ఈనిన మేకపిల్లలు, గడ్డివేసిన గదులు చిందరవందరగా ఉంటాయి. వాకిట్లో మేకల మంద కట్టిన దడి, దూడల పెంట, రొచ్చుతో చెమ్మగిల్లిన వాకిళ్లు, ఇంటికి ఇంటికి పశువుల పాక, గుప్పుమనే వాసన.

పోలమ్మ వాకిలిలో చల్లగాలికి నిద్రపోతుందేమోనని గమనిస్తుంటే, పాక వెనక నుంచి నలుగురు కుర్రాళ్లు వచ్చి వడిసిపట్టి, నోరు మూసి వేగంగా అక్కడ నుంచి గుంజుకుపోయారు.

నోట్లో గుడ్డకుక్కి చేతులు పెడవిరిచి కట్టి అమ్మవారి గుడిలో వేసారు. బైట తాళం పెట్టారు.

వీరాస్వామి ఇంట్లో కనిపించకపోయేసరికి అంతటా వెతికారు. కనిపించలేదు. అతని సావాసగాళ్ళని అడిగారు.

"అన్నవరం చూసి రావాలని!" అన్నాడని స్నేహితుడు చెప్పాడు.

''అదే జరిగి ఉంటుందని'' కుటుంబం సమాధానపడింది.

◆◆◆

తన్ని పట్టుకొన్న వాళ్ళల్లో ఏసుపాదం ఒకడు. నూకరాజు ఉన్నారని అర్థం అయింది. ఇద్దరూ కూడా తనతో పాటు 5 వరకు చదివారు.

రెల్లిపేటలో జనం అంతా ఎవరి పనుల్లోకి వాళ్ళు తెల్లవారకుండానే వెళ్ళిపోతారు.

వీరికి ఫలానా వృత్తి అని లేకపోయినా ఎక్కువమంది మురికి కాలువలకు, బళ్ళు తోలడానికి, ఆడవాళ్ళు అయితే దొడ్లు తుడవడం. ఈ వృత్తే అనాదిగా ఉన్నదేనా! లేక మధ్యలో వచ్చిందా! అనేది అనుమానమే! ఆ నోట, ఈ నోట విన్నదాన్ని బట్టి కొండల్లో గడ్డి తెచ్చి అమ్మేవారని అందుకే 'రెల్లి' అని పేరంటారు. కాయకూరలు, పళ్ళు దిగువనున్న పట్టణాలు విశాఖ, అనకాపల్లికి తెచ్చి అమ్మి గౌరవప్రదంగా జీవించేవారు. గిరిజనుల మీద దాడులు పెంచి, బ్రిటీష్‌వారు అనేక చట్టాలు తెచ్చిన తరువాత వీరు ఉపాధి కోల్పోయి అనేక ప్రాంతాలకు విస్తరించారు. పట్టణీకరణ వల్ల ధనికుల, పాలకుల అవసరాలకు దళితులకే దళితుల్ని చేసారంటారు ఈ వర్గాన్ని.

ఏసుపాదం తొమ్మిది గంటలకు వచ్చి కట్టు విప్పి ముఖం కడుక్కోమన్నాడు.

బయట తన్ని పట్టుకున్న వాళ్ళే కాక మరో ఇద్దరు ఉన్నారు.

మంచినీళ్ళు, కాస్త టీ ఇచ్చారు.

"పోలమ్మ అంటే నీకు ప్రేమే కదా!"

"అవును"

"అది కడుపుతో ఉంది. తెలుసా!"

తల వూపాడు.

"దాన్ని ఏం చేస్తావు?"

## కవిత

# సమైక్య గీతిక

- కోడిగూటి తిరుపతి
9573929493

కొమ్మ చిగురు తొడిగినా....
ఆయుధాలుగా తలపోస్తున్నాయ్
ఆ "మెదళ్ల"కు ఏ చెదలు పట్టిందో!
పక్షులు కువకువమన్నా....
ధిక్కార స్వరంలా కంపిస్తున్నాయ్
ఆ చెవులకు ఏ చిలుము చేరిందో!

రంగుబట్ట వేలాడినా....
నిరసన జెండాగా జడుస్తున్నాయ్
ఏ నూన్యత అవహించిందో!
దారం పోగులు అల్లుకున్నా....
యమపాశంలా ఉలిక్కిపడ్తున్నాయ్
ఆ కళ్ళకు ఏ కలక పడిందో!

చిరు గొంతుకలు పాఠం వల్లించినా....
యుద్ధ తంత్రంగా కలవరిస్తున్నాయ్
ఆ "ఎద"లను ఏ క్రీనీడ కమ్మిందో!
అందుకేనేమో....!



న్యాయం అడిగే గొంతుకల నిషేదిస్తున్నయ్
నిక్కచ్చితనపు వ్యక్తిత్వాల నిర్బంధిస్తున్నయ్
నిజాలు రాసే కలాలకు సంకెళ్లు వేస్తున్నయ్
శాంతియుత పోరాటాల అణిచివేస్తున్నయ్
చివరికి
చదువుల బడిని వదలక
దేశ ద్రోహం నేరం మోపుతున్నయ్
ఇకనైనా జనగణమా!
ఈ మత మౌఢ్యాన్నీ తొలిచేసి
సమైక్య గీతికల పల్లవిద్దాం రండి...!
ఈ వినాశకర శక్తుల
హద్దులు దాట తరిమేసి
స్వేచ్ఛా పతాక ఎగరేద్దాం రారండి..!! ◆

---

"పెళ్ళి చేసుకుంటాను"

"మీ కులపెద్దలు ఒప్పుకోరు. నీ కుటుంబానికి నిప్పు, నీళ్ళు ఇవ్వరు"

"తెలుసు. అయినా ఈ వారం అన్నవరం తీసుకువెళ్ళి పెళ్ళి చేసుకుంటాను. పోలమ్మ లేకుండా బతకలేను"

వీరాస్వామికి వాళ్ళకి మధ్య సంభాషణ అలా జరిగింది.

"నీవు తీసుకువెళ్ళి పెళ్ళి చేసుకోవడం జరగని పని. మేమే ఇక్కడ అమ్మవారి గుడిలో చేస్తాం. ఈ సాయంకాలమే!"

రెల్లి పెద్దలు వచ్చిన తరువాత చర్చల్లో యువకుల వాదనే నెగ్గింది.

పెళ్ళి సమయంలో పేటలో స్త్రీలు, పురుషులు కాపలాగా ఉన్నారు.

పేట కులస్తుల ఆచార వ్యవహారాలతో పెళ్ళి జరిగింది. దంపతులకు సాంప్రదాయ ప్రకారం మొదటిరాత్రి ముగిసింది.

మరునటిరోజు వీరాస్వామి ఆచూకి తెలిసింది. బ్రహ్మాండం బద్ధలైంది.

ఏడ్పులు, పెడబొబ్బలు. ఇంట్లోంచి బయటకు వచ్చాయి. అన్ని పేటలకు తెలిసిపోయింది.

అక్కడ వీరాస్వామి కులంవాళ్ళు తక్కువ. కొందరు కాపులు, కొందరు రెడ్లు, దూరంగా బ్రాహ్మణ అగ్రహారం, అక్కడక్కడ ఇతర కులాలు.

ఐక్యత లేదు. ఎవరి కులం, గౌరవం వారిదే!

రెల్లి ప్రజలు వివిధ కులాల సమాఖ్య అయినా అనేక దశాబ్దాలు వీరిని పాకీపనికి ఈ సమాజం పరిమితం చెయ్యడం వల్ల అంతా ఒకే కులం అనే భావన వాళ్ళల్లో జీర్ణించిపోయింది.

కేసు పోలీసుస్టేషన్‌కు చేరింది.

కులపెద్దలు, వీధిపెద్దలు చేరారు.

వీరాస్వామి తల్లి కొడుకును పట్టుకొని ఏడ్చింది.

వెనక అప్పాచెల్లెల్లు ఉన్నారని ప్రాధేయపడింది.

మౌనం వహించాడు.

కులపెద్దలు వెలివేసామన్నారు.


రెల్లిపెద్దలు గౌరవంగా వీరాస్వామిని స్వీకరించారు.

కొందరు సంస్కర్తలు కులాంతర ఆదర్శ వివాహం అన్నారు.

పరువు హత్యలేని చరిత్ర అక్కడ తాత్కాలికంగా ముగిసింది. ◆

## కవిత

# సైకిల్




హిందీ మూలం : అనంత మిశ్రా
తెలుగు : విజయచంద్ర
9438720409


ఎండలో నిల్చొని ఉంది సైకిల్
ఎండలోనే నిలబడి ఉంటోంది సైకిల్
ఎండ నుంచి తప్పించుకోలేదు
తనంతట తాను నీడ లోకి పోలేదు

ఎంతో దూరం నడిచింది
నడిచి వచ్చి నిల్చుంది

రోడ్డుపై చూస్తే
ఎంతో శీఘ్ర గతిలో
పరిగెడుతూ ఉంటుంది సైకిల్

పాపం ఇక్కడ మాత్రం
ఎండలో దీనంగా
మృత దేహంలా  పడి ఉంది

ఎండ చాలా చిరాకు పెడుతోంది
సైకిల్ కు ఒక పెడల్ ఉంది
అయినా తొక్కలేక పోతోంది

పరిగెత్తే సామర్థ్యం ఉన్నా
ఉన్న చోటే కదలకుండా
నిల్చొని ఉంది సైకిల్

ప్రపంచానికి ఒక వింత
ఎండ నుంచి పక్కకు పోలేదు సైకిల్
ఒక చెట్టు నీడలోకి చేర లేదు

తన చక్రాలు తానే తిప్పుకో లేదు
బెల్లు కొట్టి
తన యజమానిని పిలవ లేదు

రోడ్డు మీద మళ్ళా స్వైర విహారం
చేస్తూ ఉంటుంది
విపత్కర సమయంలో
సైకిల్ చేసే సహాయానికి
జవాబే ఉండదు

అయినా ఎండలో
ఎంత నిస్సహాయంగా
నిల్చొని ఉందో సైకిల్ !

---

# వాడు-మేము


- జి. పేరిందేవి
9966088201


వాడంతా ఒట్టి అమ్మకూచి..
వెన్ననూ దొంగలించ లేదు!
గోకులాన్ని రక్షించ లేదు!
ఊరి పొలిమేరల్లోనే కట్టుబాట్లన్నిటినీ
పురిటి చెలమలోనే కడిగి
మాపై కవనపరిమళాన్ని అద్దినవాడు
వాడికిప్పుడు మూడేళ్లు



రెండుసంవత్సరాలు కూడా నిండని వాన్ని
రెండు కళ్ల పర్యంతమవుతూ
స్కూల్లో చేర్చాం....
వాడికిప్పుడు మూడేళ్లు
ప్రణవి ఉంది, అమిత ఉంది, అరవిందున్నాడు
అని కబుర్ల స్కూలుబ్యాగుని అమ్మఒళ్ళో కుమ్మరిస్తాడు.

నాన్న గుండెనాడుల్ని పసిగట్టినవాడు.
బజారుకు వెళ్తున్నాడని గ్రహించి
నాన్నా! Pulsar నాదీ నీదీ కదా!
అని నేనుకూడా నీతో వస్తానని
చెప్పకనే ఊ కొట్టిస్తాడు.

తండ్రీకొడుకుల మధ్య ఆలకయుద్ధం జరిగితే
వాడు ప్రకటించే వరుణాస్త్రం
నేను.......అమ్మబంగారు!
వాడు ఎంత తిన్నప్పటికీ,
నాన్న కంచంలో చివరిముద్ద మాత్రం
నాన్న బాల్యజ్ఞాపకం...

రాత్రికి అమ్మగూడులో దాక్కొని
ఆ వూర్లో ఒక ఆవుంది పులుంది,
అంటూ కథల ఊయల్లో నిదురిస్తాడు.

# కరవు చెలమల్లో తోడిన కన్నీటి కవిత్వం



ఆవుల వెంకటేశులు



- జంధ్యాల రఘుబాబు
9849753298

"కాలం మారుతుంది చేసిన గాయాల్ని మాన్పుతుంది" అన్నాడో సినీ కవి. నిజమే కాని ఊరకే కాలాన్ని చూస్తూ కూచుంటే గాయాలు మానవు, ఇంకా ఎక్కువవుతాయి. అందుకే కాలానికి ఎదురీదాలి. అందుకు మంచి ప్రేరణ కావాలి. మనిషికి ఓ ఆయుధం ఉండాలి. అలా కవిత్వాన్నే ఓ ఆయుధంగా, ప్రేరణగా తీసుకొని జీవితంలో విజయం సాధించి తన కవిత్వాన్ని తానొచ్చిన సమాజానికే కానుకగా ఇచ్చిన, ఇస్తున్న ఆవుల వెంకటేశ్వర్లు కవిత్వమే "మానని గాయం" కవితా సంపుటి. చిన్నప్పుడు కరువు పరిస్థితుల్లో ఒక రైతుగా తండ్రి పడిన కష్టాలను, పెద్ద కుటుంబాన్ని ఎన్నో కష్టాలకోర్చి పెంచి పెద్ద చేసి చదివించిన తల్లి తండ్రుల శ్రమ, జీవితం చేసిన గాయాలను గేయంగా మలచుకుంటూ కొలిమిలోనుండి వచ్చిన మండే ఇనుప చువ్వలాగా జీవితాన్ని ఓ తిరుగుబాటుగా మలచుకొని రాసిన కవిత్వమే వీరి కవితా సంపుటి "మానని గాయం". అందులో నాలుగు దశాబ్దాల అనంత కరువు మనకు దర్శనమిస్తుంది. ఆయన కరవు చెలమల్లోనుండి తొవ్విన ఒక్కో అక్షరం కవిత్వగా మారి ఈ కవితా సంపుటిగా రూపు దిద్దుకుంది. కవిత్వమే కాకుండా కథ, వ్యాస రచయితగా కూడా ఆవుల వెంకటేస్వర్లు తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితులే. వివిధ సాహితీ సంస్థల పురస్కారాలే కాక కవిత్వ పోటీల్లో బహుమతులు కూడా అందుకున్నారు. రాయలసీమ కరువును కళ్ళకు కట్టినట్టు రాస్తారు.


ఏ కవిత్వంలో ఐతే ఆవేదన, సంవేదన ఉంటాయో, ఏ కవిత్వంలో ఐతే అనుభూతి ఉంటుందో అందులో మానవీయ కోణం ఉండి తీరుతుంది. ఈ మానని గాయం కవితా సంపుటి నిండా మనకు మానవుడే కనిపిస్తాడు. కష్టాలమయమైన అతడి జీవితం కనిపిస్తుంది. మానని గాయం కవితా సంపుటి శీర్షిక కవితలో ***"ఆశలు చివికిన జీవితాన్ని మోసుకుంటూ/ ఊరికి ఉత్తరాన ఉన్న సమాధిపురం వైపు/ పయనిస్తున్నాయి కదులుతున్న జీవశ్చవంలా"*** అంటారు. ***"నడుము విరిగిన ఆలోచనలు/ చీకటి దుప్పటి కప్పుకొని/ గుండెగాయాల కుక్కిమంచంలో కూలబడి/ ప్రతి క్షణం భయంల్తో ఉలికిపడుతున్నాయి"*** అని భవంతుల ఒరలోని నవ్వుల కత్తులు చేసిన గాయాల వల్ల ***"కారుతున్న రగతంలో బడుగు బతుకుల బొటనవ్రేళ్ళు/ అప్పుల పత్రాలపై నిశాని ముద్రలు వేస్తూనే ఉన్నాయి"*** అని బాధ పడతారు. గమనం మార్చుకొన్న చినుకు కవితలో మేఘం ***"బక్కరైతు/ గుండెలో హోమీ శూలాన్ని దింపి/ పొంగుతున్న రుధిరానికి ఆనకట్టలు కడుతోంది"*** అని కరువును కళ్ళకు కడతారు. ***"రెక్కలు తెగిన చకోరంలా/ ఆకాశం వైపు చూస్తోంది పుడమితల్లి/ గమనం మార్చుకున్న చినుకుకోసం"*** అని చినుకు తమకు చేస్తున్న మోసాన్ని ఆర్ద్రంగా చెబుతారు.

వీరి "తీయని కల" కవితలో తమ అంతరంగాన్ని మనకు పంచుతారు ***"అవధులు దాటిన అనుభవాలలో కరిగిపోవాలని/ ఉరకలేస్తున్న సెలయేరులా తీరం అధరాలను చుంబిస్తూ/***

## కవిత

# అదృశ్య యవనిక

- ఆర్. లక్ష్మి
8842351683



*ప్రపంచానికీ మనసుకూ నడుమ*
*కనిపించని గాజుతెరలు*
*అంతా పారదర్శకమే*
*దరికి చేరే దారే లేదు*

### ప్లస్ మైనస్

*నీరవ నిశ్శబ్దం – నిరంతర ఏకాంతం*
*మేధ – మనిషికి అందించిన*
*అపురూపమైన –*
*అతి భయంకరమైన బహుమానాలు*

### అంకురం

*ఎక్కడైనా – ఎప్పుడైనా*
*వినియోగంలో కంటె*
*విస్ఫోటనం*
*ఎక్కువ శక్తి వెలువడుతుంది*
*మనిషి మేధస్సూ అంతే*

### గెలుపా ఓటమా

*నీ కన్న తక్కువ శక్తి ఉన్న వాడిని*
*పీడించి*
*విర్ర వీగుతున్నావు సరే*
*నీకంటే శక్తిమంతుడి నుండి*
*నిన్ను నువ్వు*
*రక్షించుకోగలుగుతున్నావా?* ♦

***

***విశృంఖల విషపరిష్వంగంతో/ అంతరంగ వర్చస్సు కోల్పోయిన మనిషిని/ మరో ప్రభాత ప్రత్యూషం మానవీకరిస్తున్నట్టు/ ఓ తియ్యని కల!"*** అంటారు. ఎందుకా తియ్యని కల అంటే '***"నిరంతరం కాసుల కొలనులో/ తనువును తడుపుతున్నా/ దాహం తీరని పెనుతాపం/ అగ్నికుంపటిలా అంతరంతరాల్లో రగులుతున్న సవ్వడి"*** మనిషిని స్థిరంగా బతకనివ్వడం లేదంటారు. చివరి మజిలీ అన్న కవితలో ***"శిధిల దేహ మైదానంలో/ అనుభవాల విత్తులు చల్లి/ ఎంతకూ మారాకువేయని మొలకలపై/ రుధిరాశ్రువులను కురిపించి/ వ్యధల వడ్లగింజలతో కడుపు నింపుకుంటున్న/ చెలరేగిన క్షామాన్ని ఈదుతున్న కర్షకుడిని"*** అని అనంత రైతు మనసులోకి పరకాయ ప్రవేశం చేస్తారు.

రెక్కలు తెగిన స్వేచ్ఛ కవిత ప్రపంచీకరణ నేపథ్యంలో రాసింది. ***"విలువలు వలువల్ని విప్పుకొన్న నాగరికత/ మేధోదేహాన్ని మరయంత్రంగా"*** మలచిందంటారు. ***"బంధాలను తెంచుకున్న ఆశలు/ డాలర్ గాలానికి చిక్కుకొని పోతున్న/ ప్రాణాలను చేత చుట్టుకొని/ చేపపిల్లలా రోదించాయి"*** అంటారు. మానవీయ ప్రతీకలు రాయల శిల్పాలు అన్న కవితలో కొన్ని చారిత్రక విషయాలు చెబుతూనే ***"ఏకశిలా రథం ఊరేగి వస్తోంది/ విశృంఖల విష సంస్కృతిని విరగదీయటానికి"*** అని రాయల శిల్పాలు ***"ఘనీభవించి హృదయాంతరంగాల్ని/ మానవత్వీకరిస్తున్నాయి చైతన్య సజీవ శిల్పకళాకృతులై"*** అని మానవత్వాన్ని శిల్పాల్లో చూస్తారు. కన్నీటి మూట, యంత్ర కౌగిలిలో, విధ్వంసం మొదలైన కవితల్లో ఛిద్రమౌతున్న మనిషి బతుకుని చూపిస్తారు. వెలగు బింబమై అన్న కవితలో నిశ్చేష్టులైపోతున్న మనుషులకు ***"కలతలేల కార్పణ్యాలేల వెర్రెత్తిన వాంఛలేల/ ప్రభవించు పల్లవించు/ మానవీయ వెలుగు బింబమై"*** అని ఉద్బోధ చేస్తారు.

జ్ఞాపకం అన్న కవితలో ***"పడగలెత్తిన భవంతుల పునాదులలో/ అమ్మ శీలం సమాధి అయితే/ చిరునామా లేని నా పుట్టుక/ కుప్పతొట్టిని చేరిన జ్ఞాపకం"*** అంటూ వీధిబాలల జీవితాన్ని తడుముతారు. ఇక వారికి గోరుముద్దలెవరు తినిపిస్తారు, లాలిపాటలెవరు పాడతారనే కదా మన అనుమానం, అందుకే దానిని నివృత్తి చేస్తూ ***"ఎంగిలి విస్తరాకులందించిన గోరుముద్దలు/ ఊరకుక్కలు పాడిన లాలిపాటలు/ పాడుబడిన మెతుకులకై శునకంలా/ కాలానికి కాపలా కాచిన జ్ఞాపకం"*** అని గాయపడ్డ ఆ మనసుల గురించి చెబుతారు. నాగరిక వధ్యశిలపై అన్నది మరో కవిత. ***"కళ్ళతో నవ్వుతూ/ కుయుక్తుల పద్మవ్యూహాన్ని పన్ని/ కపటం కత్తితో స్వప్న బాహువుల్ని తెగ్గోసి/ చిరునవ్వుల చురకత్తితో ఆడుకుంటున్న/ అంకురాన్ని ఛిద్రం చేసినావు"*** అని ఆదర్శాలు వల్లించేవాళ్ళు ***"చరిత్రను శూన్యం శూలానికి వేలాడదీసినావు"*** అని ఎద్దేవా చేస్తారు. ***"భూమ్యాకాశాలను కొల్లగొట్టాలని/ రిమోటు హస్తాన్ని తలమీద పెట్టుకొని/ నాగరిక వధ్యశిలపై/ నాట్యం చేస్తున్న భస్మాసురుడివి"*** అని అమానవీయ ప్రపంచీకరణనూ తడుముతారు. నవ పారిజాతం బాల్యం అన్న కవితలో కూడా బాల్యాన్ని కవిత్వీకరించారు.

కవిత్వ నిర్మాణమే కాకుండా తనదైన శైలి, ఆర్ద్రత కలబోసి కవితా వస్తువును అలవోకగా ఒడొసిపట్టుకునే వీరి "మానని గాయం" చదివాక మంచి కవిత్వం చదివామన్న సంతృప్తి మన మనసుల్లో నిలిచిపోతుంది. ♦

## ప్రజ్వలన

- పి. లక్ష్మణ్ రావ్
9441215989



కవి రాసింది కవిత్వమని మీరంటే
నేనొప్పుకోను
చెమట చుక్కకి, కన్నీటి చుక్కకి మధ్య
ఆవిరైపోతున్న వ్యదార్ధ గాధలను
అక్షరాల ఆలంబనతో ఓదారుస్తున్నాడంతే !
ఆకలి రక్కసికి, ధన పిశాచికి మధ్య
నలిగిపోతున్న జీవిత చక్రాలను
అక్షరాల శక్తితో ఆపుతున్నాడంతే !
బతుకు పోరాటానికి, ఆయుష్షు ఆరాటానికీ మధ్య
బిగుసుకుపోతున్న కష్టాల సంకెళ్లను
అక్షరాల ఆయుధంతో ఛేధిస్తున్నాడంటే !
మానవ బంధానికి, ఆర్ధిక బంధానికీ మధ్య
ఛిద్రమైపోతున్న మానవత్వ చిరునామాను
అక్షర యుక్తితో కనుగొంటున్నాడంతే !
స్వార్థానికి, సౌహార్ధనికీ మధ్య
గుర్తించలేకపోతున్న అజ్ఞాన తిమిరాలను
అక్షర కిరణాలతో తరిమికొడుతున్నాడంతే !
మనోదౌర్భల్యాలకీ, క్షణికానందానికీ మధ్య
పెరిగిపోతున్న నిర్లిప్త ధోరణులను
అక్షరాల జ్వాలాతో కదిలిస్తున్నాడంతే !
హక్కుల చైతన్యానికీ,బాధ్యతల నిర్లక్ష్యానికి మధ్య
ఊగిసలాడుతున్న ఉదాసీనతను
అక్షరాల కొరడాతో అదిలిస్తున్నాడంతే !
కవి రాసింది కవిత్వమని మీరంటే
నేనొప్పుకోను
అక్షరాలను ప్రజ్వలిస్తే
దగ్ధం కానిదేదీ లేదని చెబుతున్నాడంతే ! ♦

---

## ఔను.... వారు కరోనాను జయించారు!

- సరికొండ నరసింహారాజు
9398254545

కరోనా కవిత

కనపడని శత్రువుతో
బతుకు యుద్ధం చేస్తున్నప్పుడు....
నిబంధనల నీతివాక్యాలను ముక్కలు చేయడం
బయట అడుగు పెట్టడం ఒక భస్మాసుర హస్తమే!
యుద్ధభూమిలో తీసుకున్న నిర్ణయం సరిచేసుకోలేనిది
అన్నట్టు....
నా కాళ్ళ కింద కరోనా బాంబు పేలనే పేలింది!
కరోనా పాజిటివ్ అన్న పచ్చి నిజం...
నన్ను ఐసొలేషన్‌లో బంధించింది!
కాలంబోనులో దోషిలా నేను...
గాయపడ్డ ఒంటరి పక్షి లా నేను...
ఈ జీవన్మరణ పోరులో
బతుకు బలిపీఠంపై నిలబడ్డాను
భయం, భద్రతల నడుమ నలిగిపోతూ...
మానవతా రెక్కలపై వచ్చిన దేవతలల్లే వైద్యులు
వారి సేవలపాత్రలలో అమృతం త్రాగించారు!
వారి ప్రాణాలొడ్డి నా ఊపిరి దీపాలు నిలిపారు!
అగ్ని పునీతమై పునర్జన్మ ఎత్తాను!
ఔను! నేను కరోనాను జయించాను!
జీవనదిలా ప్రవహించే వారికి జేజేలు...
దాతృత్వంలో వున్న ఆనందం దాచుకోవడంలో ఏది!
చెట్టులా పచ్చదనం పంచేవారికి జేజేలు...
సేవించడంలోవున్న ఆనందం సేదతీరడంలో ఏది!
అవనితల్లిలా అమ్మతనం చూపేవారికి జేజేలు...
త్యాగించడంలో వున్న ఆనందం భోగించడంలో ఏది!
మనిషి పద్యం ప్రతిపదార్థమై జీవించడంలో ఆనందం
జీవించినా మరణించడంలో వుంటుందా...
వల్లకాటిని సైతం పూలవనాలుగా మార్చి
శవంగుడ్డను శాంతి జెండాలుగా ఎగరేస్తూ
పాడెలను మానవతా పల్లకీలుగా చేసే
సంజీవినీ విద్యేదో ఆ ప్రాణదాతల చేతుల్లో వుంది!
కరోనా రోగుల పట్ల వివక్ష చూపని
వారి సేవారాగానికి బృందగానం పాడుదాం!
మార్పును ఆహ్వానించనివాడు
మనిషెట్లా ఔతాడు!
నా అడుగుల అద్దంలో నన్ను నేను చూసుకుంటూ
మట్టిగా పరిమళించే మనిషినై
కరోనా రోగుల సేవలో పునరంకితమవుతూ
నేడు సరికొత్తగా మొలకెత్తుతున్నా!
కరోనా లేని లోకాన్ని సృష్టిస్తూ
కరుణ నదులై ప్రవహించడమే ...
నేడు మనిషిముందున్న తక్షణ కర్తవ్యం!! ♦






# మానవత్వాన్ని మేల్కొలిపే కవిత్వం

- డాక్టర్ పెంకి విజయ కుమార్
9553392949

*'ఏ బాల్కానీలోనో హాయిగా ఉయ్యాలూగుతూ తాగేందుకు నా కవిత్వం కాఫీ కాదు దేహమ్మీద నుండి రాలుతున్న చెమట చుక్క'*

అని తన కవితా లక్ష్యాన్ని సూటిగా ప్రకటించుకున్న శ్రమైక జీవన సౌందర్యకవి బిల్ల మహేందర్. లక్ష్యాన్ని ప్రకటించడం వేరు, ఆ లక్ష్య సాధనకు కట్టుబడి అదే మార్గంలో పయనించడం వేరు. ఆ మార్గంలో పయనించడమంటే కవి తన వ్యక్తిగత జీవితాన్ని ఎంతో కొంత త్యాగం చేయక తప్పదు. అలా త్యాగం చేసిన నాడే ఆ కవి, అతని కవిత్వం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారు. బిల్ల మహేందర్ ప్రజల గుండెలను తట్టిలేపే కవిత్వానికో చిరునామా.

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో 'పిడికిలి' శీర్షికతో ఉద్యమ కవిత్వాన్ని ప్రకటించి విజయం సాధించడమే కాకుండా దివ్యాంగులలో ఉత్సాహాన్ని ప్రోదిచేసేలా 'గెలుపు చిరునామా' పేరుతో కవితల సంపుటి ఆవిష్కరించి మరోమెట్టును అధిరోహించారు. ప్రస్తుతం మానవ జాతిలో మృగ్యమవుతున్న మానవత్వాన్ని మేల్కొల్పడానికి 'ఇప్పుడొక పాట కావాలి' అంటూ వచన కవితా సంపుటితో ముందుకొచ్చారు.

సంపుటిని పరికించిచూస్తే... కవి ప్రస్తావించిన వర్తమాన విషయాలు తప్పుదారుల్లో నడిచే వారికి చెర్నాకోలా దెబ్బల్లా ఛెల్ మన్పిస్తాయి. పనిలోపనిగా మానవత్వాన్ని మేల్కొల్పడానికి పూనుకుంటాయి.

*'నిజంగా మీరు/ నా కోసం ఏదైనా/ ఖచ్చితంగా చేయాలనిపిస్తే.../ ఇకనుండి/ ఎప్పుడైనా గడపదాటేముందు / మొలిచిన మీ అంగాన్ని ఇంట్లోనే వదిలి వెళ్ళండి!!'...*

నానాటికి స్త్రీ తత్వాన్ని చిదివేస్తున్న పురుష అహంకారానికి, మృగాడితత్వానికి ఈ కవిత ఓ చురక.'మొలిచిన అంగం' పదప్రయోగం పదునైన అభివ్యక్తితో అధిక్షేప ధోరణిని ప్రస్ఫుటపరుస్తుంది. పురుషాధిక్యాన్ని ప్రశ్నిస్తుంది. సమంజసమైన ఆలోచనల్లోకి నెడుతుంది. బాల్యాన్ని చదువుల పేరుతో చిదిమేస్తున్న తల్లిదండ్రులకు చెంపపెట్టు 'ఎగిరి పోనివ్వండి' కవిత. ఈ కవితలో

*'నిత్యం ఎగిరే సీతాకోక చిలకల రెక్కల్ని విరిచి/ నువ్వు నేను ఇవ్వాళ స్వేఛ్ఛ గురించి మాట్లాడడం/ అంతకన్నా అసలే బాగాలేదు'*

అని పిల్లలకు సహజ స్వేచ్ఛనివ్వకపోవడంలో తల్లిదండ్రుల నిర్లక్ష్యాన్ని ఆత్మాశ్రయ ధోరణితో హెచ్చరించడం

బాగుంది. ఆకలేసి మామిడిపళ్ళు దొంగతనం చేసిన అభాగ్యున్ని పొట్టనపెట్టుకున్న నీచ కులపోకడల లోకంలోని దారుణాన్ని కళ్ళకు కడుతూ

*'నిన్నటిదాకా/ తరగతి గదిలో మామిడి తీపి గురించి పాఠమై మోగిన నేను / రేపు విషమని ఎలా చెప్పను..??/ ఇప్పుడు / నా దళిత బిడ్డలకు / ఈ దేశపు జాతీయ ఫలం కూడా / అంటరానిదేనని ఎలా బోధించను??'*

అంటూ తనలోని బోధకుని బాధకునిగా మార్చిన సంఘటనలపట్ల కవి స్పందించిన తీరుకు, మానవత్వాన్ని ప్రశ్నించిన విధానానికి జేజేలు పలకాల్సిందే. నరుక్కుంటూ పోతే అడవులేకాదు, మనుషులూ మిగలరంటాడు ఓ సినిమా రచయిత. మహేందర్ మాత్రం

*'అడవి అంటే/ రాయి రప్పనేకాదు/ గనులు ఖనిజాలు అంతకన్నా కాదు/ కొన్ని మన అడుగు జాడలు/ ఇంకొన్ని ఆకుపచ్చని బతుకులు'* అంటారు. మరో కవితలో *'ఫ్..,/ మనిషి ఒక్కడే ఎంత లోతుల్ని తవ్వినా/ 'ఒట్టి' మనిషిగానే మిగులుతున్నాడు!!'* అంటారు.

నిజమే కదా!. అడవులు, ఖనిజ సంపదలతోనే మానవ వికాసం పచ్చగా ముడిపడి ఉందని చెప్పడం, అందుకుగాను వాటిని సంరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యతని గుర్తుచేయడం ప్రశంసనీయం. మరికొన్ని కవితల్లో మానవ జీవన వికాసానికి అడ్డంకులైన దుఃఖం, అందుకు కారణ 'భూతాల'ను సహేతుకంగా ఉదహరించి తూర్పార బట్టడం, వాటికి పరిష్కారాలను సూచించడం కవి నిపుణతకు నిదర్శనం.

*'దుఃఖము ఇవ్వాల్టిదికాదు/ యేండ్ల తరబడి మోస్తూనే ఉన్నాను/ వెనుకకు ఏ పేజీ తిరగేసినా/ అక్షరాలన్నీ కన్నీళ్లతో తడిసి బరువెక్కుతాయి'* అంటూనే మరోకవితలో *'కాలాన్ని గెలుస్తూ ముందుకెళ్ళడమే జీవితమైనప్పుడు/ గాయమన్నది చిన్న మాటే ఉత్తమాటే'* అనే వాక్యాలు మనోవికాస పాఠాలల్లే మార్మోగుతాయి. నానాటికీ నల్లపూసవుతున్న మానవత్వాన్ని తట్టి లేపే ప్రయత్నంలో కవి సంధించిన పదాలు తప్పిపోతున్న మనషుల హృదయాలకు శరాలై తాకుతాయి.

*'నీ కళ్ళముందే/ మాంసపు ముద్దలు తెగిపడుతున్నా/ .../ ఇప్పుడిక్కడ మనుషులంతా కన్నీళ్లుకూడా రాల్చలేని మరబొమ్మలుగా మిగిలి/ మనుషులుగా ఎప్పుడో తప్పిపోయారు'*

అని నేటి సాంకేతిక యుగంలో స్పందనలేని ఇనుపహృదయాలపై సిరాను చిలకరించి మేల్కొలిపే విధంగా కవిత కదలాడటాన్ని గమనించవచ్చు. మానవత్వాన్ని మేల్కొలపడానికి అక్షరాన్ని ఆయుధంగా ఎంచుకున్న కవి *'నాకు అక్షరమంటే/ కాలే కడుపులోంచి రాలే కన్నీళ్లలోంచి/ కష్ట జీవుల చెమట చుక్కలోంచి ఎగిసిపడే ఓ నిప్పు కణిక/ తాడిత పీడిత జనాల గుండెల్ని నిత్యం తట్టి లేపే ఓ వెలుగు చుక్క'*

అంటూ తన కవితా లక్ష్యాన్ని ఉన్నతీకరించడం ఒక ఎత్తయితే

*'చీకట్లో వెన్నెలను కురిపించినోడు కదా/ వెలివాడల్లో వెలుగుల్ని పూయించినోడు కదా/ అతడికి యుద్ధమేమి కొత్త కాదు కుట్రలు తెలియంది కాదు/ జైలు ఊచలేన్నో సరిగ్గా లెక్కతెలుసు/ ఏదో ఒక సమయాన/ నది సంద్రమై ఉప్పొంగుతుంది/ చిరునవ్వు పాయిరమై పంజరంలోంచి ఎగిరొస్తుంది'* అని తాడిత పీడిత వర్గాల పక్షాన నిలిచి, వారి మోముపై చిరునవ్వులు పూయించడంలో కవి ఆర్ద్ర హృదయం గోచరిస్తుంది.

*'తొలకరి జల్లులకు తడిసి ముద్దైన మట్టి వాసన/ మండుటెండలకు రాలిపడిన సెమట సుక్కలు/ ఎరుపు జెండా వైపుకు ఎగిసిపడిన బిగి పిడికిళ్లు/అలానే బావుంటాయి'*

అంటూ శ్రమజీవుల పక్షాన ఎర్రజెండాతో నిలబడటం కవి పోరాట పటిమకు, నిబద్ధతకు అద్దం పడుతుంది. అదే నిబద్ధతతో

*'గుండె గుండెల్లో మమతల్ని నింపి/ గుడిసె గుడిసెల్లో వెలుగుల్ని పూయించే ఓ కొత్త పాట కావాలి'* అని కోరికను వ్యక్తపరుస్తూనే *'ఇక పని చేయాల్సింది కరగాల్సింది/గడ్డకట్టుకు పోయిన కొందరి మానవత్వం'* అని గొంతెత్తి స్వేచ్ఛా గీతికను ఆలపిస్తూ *'రేపటి ఉదయం కోసం/ కవిత్వాన్ని ఆయుధంగా మలిచి/ చెమట చుక్కల చుట్టూతా పహారా కాస్తాను'*

అంటూ భరోసా ప్రకటించి మానవత్వాన్ని మేల్కొల్పే కవిత్వాన్ని రచిస్తూ, సమాజ శ్రేయస్సును కాంక్షిస్తున్న బిల్ల మహేందర్ అభినందనీయులు. ప్రతుల కోసం 9177604430 కి సంప్రదించండి. ♦

# లాక్డౌన్ కాలం

- ఆవుల చక్రపాణి యాదవ్
9963350973

కరోనా కవిత

భయం భయంగా నడుస్తుంది ప్రపంచం
రోడ్లపై మాట్లాడే మనుషుల్లేక
దినదిన గండంగా గడుస్తుంది కాలం
రోడ్లపై మృత్యువు నడుస్తుండగా
♦
ఎక్కడి వారక్కడ స్వీయ బందీలై
సూక్ష్మ శత్రు దాడికి బెదిరి
సాలెగూడులో చిక్కుకున్న పురుగులా
గిలాగిలా తండ్లాడుతున్న జీవితాలు

చూసిన చానెల్ చూస్తూ విసిగి పోతూ
లాక్ డౌన్ కాలం కథలు కథలుగా
ముందు తరాలకు చెప్పుకోవడానికి
ఒక ఘనకార్యంగా పనికొస్తుంది
♦
తినను తిండి లేని కూలీ బతుకులు
చేతిలో చిల్లిగవ్వ లేని చిల్లర బతుకులై
మలమల మాడే కడుపుమంటకాహుతై
పేదల ఆకలికేకల చావులే
కరోనా చావులకంటే ఎక్కువౌతాయేమో!

శవాలగుట్టలు చరిత్ర సాక్ష్యంగా నిలిచిపోతాయి
లాక్డౌన్ కాలం పాఠ్యాంశాలుగా
ముందు తరాలకు చెప్పుకోవడానికి
♦
రోగుల ప్రాణాలకు తమ ప్రాణాలొడ్డు వైద్యులు
నర్సులు
యమునికి ఎదురునిలిచే పోలీసులు
శత్రువును తరిమేసే పారిశుద్ధ్య కార్మికులు
కనిపించని శత్రువుతో పోరుకు వేల వందనాలు

సర్వ మతాల దేవుళ్ళు తలుపులేసుకుంటే
కష్ట కాలంలో మానవత్వం మాత్రమే
ముందుకొచ్చింది
నిస్వార్థ భావన నిజరూపమై నిలిచింది
లాక్డౌన్ కాలం మనిషిని మనిషిగా మార్చింది ♦

---

# ఎర్రని పాద ముద్రలు

- ఎస్. ఏం. సుభాని
9490776184

కరోనా కవిత

కర్కశత్వం
కరోనాది మాత్రమే కాదు
ఆకలిది
బీదరికానిది కూడా

ఆకలి
ఎండిన డొక్కల్ని తొలుస్తుంటే
పేదరికం
బతుకుని పరిహాసం చేస్తుంది

పట్టెడు మెతుకులు
గుక్కెడు నీటిచుక్కలు
గుప్పెడు భరోసా కూడా అందని
ఈ బతుకు పోరులో

శ్రమజీవన సౌందర్య ప్రతీకలు
అస్తవ్యస్థ జీవితపు ఆనవాళ్ళై
బంధాలకై నిర్బంధాలను తెంపి
ఊరి జాడ వెతుకుతున్నారు

నెత్తిన బతుకు మూటలతో
చంకన ఆకలి ప్రాణాలతో
గర్భంలో రేపటిని మోస్తూ
పిల్లా జెల్లల్ని
తోపుడు బండై
భారంగా లాగుతూ
సొమ్మసిల్లుతుంటే
మండుతున్న ఎండ
బొబ్బలెక్కిన కాళ్లకు
కారం పులుముతుంది

కష్టాల కొలిమిలో కాలుతూ
వేల మైళ్ళ దూరం
నడిచీ.. నడిచీ..
నడిచీ.... నడవలేక
చిట్లిన పాదాలు చిందిన
రక్తం సాక్షిగా
నల్లని రహదారులపై
ఎర్రని పాద ముద్రలు. ♦

# సాహిత్యం ఎందుకు? ఎవరికి?

- శ్రీశ్రీ



30 April 1910 – 15 June 1983

సామాజిక జీవితం లేకపోతే సాహిత్యం అనేదే సాధ్యం కాదు. ఈ సంగతి జ్ఞప్తిలో ఉంచుకుంటే సాహిత్యం ఎందుకు? అనే రెండు ప్రశ్నలకూ జవాబు వస్తుంది. ఎందుకంటే సమాజాభివృద్ధికనీ, ఎవరికంటే ప్రజలకీ అని.

కాని ఈ సమస్యలింత సులభంగా సూక్ష్మంగా పరిష్కారం అయిపోగలిగినవి కావు. అభివృద్ధి అంటే ఏమిటి? ప్రజలంటే ఎవరు? అనే ప్రశ్నలు మళ్లీ బయలుదేరుతాయి. వాటికి జవాబిచ్చే ప్రయత్నంలో మరికొన్ని కొత్త ప్రశ్నలెదురవుతాయి.

ఇప్పుడు రాస్తున్న రచనలన్నీ అభివృద్ధికే దారితీస్తున్నాయా? ఈ రాస్తున్నవన్నీ ప్రజల అందుబాటులోకి వస్తున్నాయా? అసలీ సాహ్యితం పట్ల ప్రజలేమాత్రం సుముఖంగా ఉన్నారు? దాదాపు నూటికి 90 పాళ్ళు నిరక్షరాస్యులుగా దరిద్రులుగా ఉంటూన్న ప్రజలకు మీ పాటలూ, పద్యాలూ, కథలూ, కబుర్లూ చెవికెక్కుతున్నాయనే నమ్ముతున్నారా? అటువంటి అవకాశం లేనప్పుడు ఇక మీ సాహిత్యం ఎందుకు?

సాహిత్యంలో ఏ మాత్రం సంబంధం ఉన్నవారైనా ఈ ప్రశ్నలను గురించి తీవ్రంగా ఆలోచించక తప్పదు.

ప్రజాసామాన్యానికి సాహిత్యం అందుబాటులో లేదన్న యదర్థాన్ని గుర్తించక తప్పదు. స్వతహాగా దాన్ని అందుకోడానికి వారు అనర్హులు కారని కూడా గుర్తించాలి. కొన్ని ప్రతిబంధకాలు అడ్డుపడి ప్రజలు సాహిత్యానికి నాడు దూరమైపోయారు. ఆ ప్రతిబంధకాలను తొలగిస్తే సాహిత్యానికి ప్రజల ఆదరం దొరుకుతుంది. ఎక్కడ సాహిత్య సభలు జరిగినా ప్రజలు తండోపతండాలుగా వస్తూ ఉండడమే వారిలో ఉన్న తీవ్రకాంక్షకు నిదర్శనం. అట్టి కాంక్షను సంతృప్తిపరచకపోతే ఆ లోపం రచయితలదే అవుతుంది.

నిజానికి లోకాన్ని నిరాకరించి ఏ రచయితా కావ్యం అల్లలేడు. లోకాతీతమైన విషయాలు రాస్తున్నాని యెవడైనా అనుకుంటే అంతకంటే ఆత్మవంచన ఇంకొకటి ఉండబోదు. రచయితలకు ఆత్మవిశ్వాసం ఉండవలసిందే. కాని ఆ దృఢ విశ్వాసం ఇతరులపట్ల అలసభావంగా పరిణమించకూడదు. "నేను చాలా గొప్పవాణ్ణి కాని నన్నెవ్వరూ గుర్తించకుండా ఉన్నారనుకోవడం తప్పు. గొప్పతనంలో ఉన్న గొప్పతనం గుర్తించబడడంలోనే ఉంటుంది. అందుకే పేరు ప్రఖ్యాతులు వచ్చిన ప్రతి వ్యక్తిలోనూ ఏదో ఒక విశేషం ఉంటుంది, ఉండి తీరుతుంది. అలాగే ఒక విశేషం ఉన్నప్పుడు దాన్ని గుర్తించగలిగినవారు కూడా ఉంటారు.

ప్రజాసామాన్యానికి మొత్తం మీద ఉండే ఒకానొక ఇంగితజ్ఞానమే నాయకత్వానికి తూకం వేస్తుంది. జీవితంలోని అన్ని శాఖలకూ – కళ, సాహిత్యం, పరిపాలన, నీతి అన్నిటికీ ఈ సమిష్టి జ్ఞనమే నికషోపలం. కాబట్టి దేని ప్రాశస్త్యాన్నైనా, నిర్ణయించవలసిన వారు ప్రజలే.

అటువంటి ప్రజలు ఈనాడు అంధకారంలో, అజ్ఞానంలో, దారిద్ర్యంలో అలమటిస్తున్నారు. వీరినిట్టి స్థితిలో ఉంచడం కొందరికి లాభదాయకం. కాబట్టి స్వప్రయోజనం కోసమని

ప్రజాభివృద్ధి వీరు నిరోధించక తప్పడం లేదు. ప్రజలలో జ్ఞానం వృద్ధి అవుతున్నకొద్దీ ఇటువంటి వారికి ఆటకట్టు అయి తీరుతుంది. ప్రజలు అజ్ఞానంలో మగ్గుతూ ఉండడం ఎవరికైనా లాభకరం కావచ్చును కాని రచయితలకు మాత్రం కాదు. ప్రజాసామాన్యం నికృష్టస్థితిలో ఉంటే రచయిత కూడా ఆ స్థితిని దాటలేడు. నిజమైన వికాసాన్నీ ప్రబోధాన్నీ ఇచ్చే శక్తి సాహిత్యానికే ఉన్నప్పుడు దానిని రచయిత ప్రజాయత్తం చేయకుండా ఉండలేడు. గాయకుని సంగీతం, చిత్రకారుని బొమ్మలూ, నటుని అభినయం, సాహిత్యపరుల రచనలూ ఎందుకంటే ప్రజలకు ఉత్తేజపరచడానికే. ఇది అన్ని కాలాల్లోనూ జరుగుతున్న పని. ఈనాడు ముఖ్యంగా జరగవలసిన పని.

సాహిత్యానికి ప్రజలు దూరమైపోయినట్లే ప్రజలకు సాహిత్యపరులు కూడా దూరమైపోతున్నారు. ప్రజలను కలవరపరిచే సమస్యలతో నిమిత్తం లేకుండా వీరందరూ ఎవరి ప్రాకారాలలో వారు జీవిస్తున్నారు. ఇందువల్ల ప్రజలకూ రచయితలకూ పెద్ద అఖాతం ఏర్పడింది. ప్రజల సమస్యలే తన సమస్యలని రచయిత గ్రహించలేకుండా ఉన్నాడు. ఎవరికీ బోధపడని రాతలు రాస్తున్నాడని రచయితపట్ల ప్రజలు ఔదాసీన్యం వహించడం తటస్థిస్తోంది. ఈ విధంగా ఇరువురి మధ్యనూ ఏర్పడ్డ అఖాతం నానాటికి మరింత హెచ్చిపోకుండా చేయాలంటే రచయితలే ముందుగా ప్రజలవైపు చెయ్యి జాచవలసి వుంటుంది. నేను ప్రజలకంటే అధికుణ్ణనిగాని, అతీతుణ్ణనిగాని, రచనలు వారి కోసం రాయడంలేదనిగాని అనుకొని ప్రయోజనం లేదు. సమాజంతో సంబంధం వదలుకొని సమాజం తన్ను ఆదరించలేదని బాధపడే రచయితను చూచి జాలిపడడం తప్ప మరేమీ చెయ్యలేము.

నేటి ధనస్వామ్య వ్యవస్థలో సాహిత్యం ఎందుకు? ఎవరికి? అనే ప్రశ్నలకు చటుక్కున స్ఫురించే జవాబులు కూడా లేకపోలేదు. రచయితలలో నున్న ఎన్నో కల్మషాలను పట్టి చూపించే జవాబులవి. ఈ వ్యవస్థను ఎందుకు మార్చవలసి ఉందో చూపించడానికి ఈ జవాబులూ, వీటి వెనక ఉన్న మనస్తత్వమూ ఉపకరిస్తాయి.

సాహిత్యం ఎందుకు? డబ్బుకోసం. సాహిత్యం ఎవరికి? ధనమున్న వారికి. ఇవీ ప్రస్తుతం వ్యవస్థలో స్ఫురించే జవాబులు.

ఇరవయ్యో శతాబ్దం ప్రారంభమైన సరికి ధనస్వామ్య వ్యవస్థ పారమ్యం పొందింది. స్వచ్ఛంద వ్యాపారం అనే సూత్రం నిరాఘటంగా రాజ్యం చేసింది. దీని ఫలితంగా ఆఫీసు కుర్రాళ్లు కోటీశ్వరులయ్యారు. తిరుగుబోతులు సామ్రాజ్య నిర్మాతలయ్యారు. వారి జీవితాలు స్వయం సహాయానికి ఉదాహరణలయ్యాయి. అట్టి పనులను ముందుతరాల వారికి ఆదర్శప్రాయులుగా చూపించడం జరిగింది. "నేను జీవితం ప్రారంభించినప్పుడు జేబులో మూడు షిల్లింగులు లేవు. ఇప్పుడు నేను మూడు కోట్ల పౌన్లను కేవలం దానధర్మాలకింద వినియోగించగలుగుతున్నాను' అని ఒక కోటీశ్వరుడంటే స్వచ్ఛంద వ్యాపారానికి జై అనక తప్పింది కాదు. లోకానికి కొత్తకొత్త యంత్రాలు, రైళ్లు, స్టీమర్లు, తపాలాలు, తంతి, నిస్తంత్రి వార్తలు, కాలాన్నీ, దూరాన్నీ జయించడం – ధనస్వామ్య వ్యవస్థకు అసాధ్యమన్నదే లేదన్నట్లు కనబడింది. నిర్మాణ దృష్ట్యా ధనస్వామ్యం ప్రపంచమంతటా ఒక బలిష్టమైన వల అల్లివేసింది. అడుగున ప్రారంభించడం, ఒక్కొక్క మెట్టుగా ఎక్కడం, శిఖరం అందుకోవడం! జీవితం ఈ సింపుల్ ఫార్ములాకి రెడ్యూస్ అయిపోయినట్లు తోచింది.

కాని ఈ శతాబ్దంలో యాభై సంవత్సరాలైనా పూర్తి కాకుండానే రెండు ప్రపంచ మహాయుద్ధాలు ఒక దాన్ని కన్నా ప్రచండంగా ఇంకొకటి చెలరేగాయి. గత శతాబ్దంలో హెచ్చరికలు చేసిన వారి జోస్యాలు ఫలించడం మొదలుపెట్టాయి. స్వేచ్ఛా వ్యాపారం స్పర్ధలకీ, అనర్థాలకీ, యుద్ధాలకీ దారి తీస్తుందనీ, ధనస్వామ్యవ్యవస్థలో గర్భితంగా ఉన్న పరస్పర వైరుధ్యాలే దాని పతనానికి కారణమవుతాయనీ, తర్వాత అంతకన్నా న్యాయబద్ధమైన, సామ్యసిద్ధమైన వ్యవస్థ ఏర్పడుతుందనీ, చేసిన జోస్యం ఫలోన్ముఖానికి వస్తోంది.

ప్రపంచం ధనస్వామ్య వ్యవస్థలోంచి సామ్యవాద వ్యవస్థలోకి రెండు మహామారణ హోమాల ఫలితంగా మారిపోతున్న ఈ సంధియుగంలో మనం జీవిస్తున్నాము. ఈ దృక్పథాన్ని అలవరచుకోకుండా ఇంకా పాత బాటలలోనే పాత పాటలతోనే కాలం గడుపుతూన్న రచయితలున్నారు. వారు ఆరాధిస్తున్న ఆదర్శాలు బహిరంగంగా పరువు పోగొట్టుకొంటున్నప్పటికీ ఇంకా వాటినే పట్టుకొని ప్రాకులాడుతున్నారు. అయినా వీరి విషయమై మనం ఎక్కువగా బెంగ పెట్టుకోనక్కరలేదు. ఒక కొత్త శక్తి అది. ఇది వరకు ఆ శక్తి కొంత గొంతుక లేకపోయింది. ఇన్ని యుగాలుగా అణచిపెట్టబడిన ఈ శక్తి ఇప్పుడు విజృంభిస్తోంది.

# కవిత్వంలేని కవితలో...

- సాంబమూర్తి లండ
9642732008

కవిత్వంలేని కవితలో
చిరుగాలికే కరిగి
కొన్ని చినుకులై కురిసిన
తడి మేఘం కదలాడింది
లోలోపల మాటేదో
గబగబా చెప్పేయాలన్న
కవి ఆత్రం కనబడింది!

కవిత్వంలేని కవితలో
ప్రాకుతున్న పసిపాప
గోడలు పట్టుకుని లేస్తున్నప్పటి
ఒక వెలకట్టలేని ప్రయత్నం
కోయిల కమ్మగా పిలిచిందని
ఆదరాబాదర విచ్చేసిన
వసంతం ఆరాటం
అన్యాపదేశంగా కనబడ్డాయి!

నోటికి బాగా వచ్చేసిన పద్యం
అడిగే అడగ్గానే అప్పజెప్పేసిన
చిన్నప్పటి జ్ఞాపకం ఒకటి
కవిత్వంలేని కవితతో
మళ్లీ కళ్లముందుకొచ్చింది



కవిత్వంలేని కవితలో
నేర్చుకున్న బతుకు పాటొకటి
పచ్చిపచ్చిగానే వినబడింది
రేపటి పైరు
ఈ రోజే
పచ్చపచ్చగా నవ్వింది!

తీరంలో నిలబడీ నిలబడగానే
కాళ్ళను అల్లుకుపోయే
కెరటాల అల్లరితనం
మరోసారి స్ఫురణకొచ్చింది

కవిత్వంలేని కవితలో
ఒక వాక్యం కాలేని
జీవితం
అలంకారాల్లేని వ్యక్తిత్వం
సహజాతి సహజంగా పూసింది! ◆

---

బలప్రయోగంవల్లగాని, మాయోపాయాలవల్లగాని ఎవ్వరూ దీనిని అరికట్టలేరు.

ఈ శక్తిని ఉద్దీపింపజేసే రచనలు సాగించడమే సాహిత్యపరుల కర్తవ్యం. అందువల్ల ప్రజల పురోగమనానికి రచయితలు తోడ్పడిన వారౌతారు. లేనప్పుడు రచయితలే వెనకబడి ప్రజలలో నుంచే సాహిత్యవీరులు బయల్దేరుతారు. రచనల ప్రాశస్త్యానికి కొలతబద్దలు మారిపోతున్నాయి. ఈనాడు నలుగురు మిత్రులు మధ్య కూర్చొని పద్యం చదవడానికి బదులు నాలుగు వేల జనాభా ముందు మైక్‌లోకి తన సందేశం విసురుతున్నాడు కవి. రచయితకూ, పాఠకునికీ మధ్య వచ్చిన పెద్ద మార్పు ఇది. ఈ మైక్రోఫోన్ ముందు ఒకటిన్నర చరణాలు చదివి వేల కొలది ప్రజలను ఉగ్రూతలూగించవచ్చును. సంఘ చైతన్యానికి ప్రాతినిధ్యం వహించిన రచయితకు మాత్రమే ఇది సాధ్యమవుతుంది. మన ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా యంత్రయుగము మనకు సంప్రాప్తించింది. మనలో మనం కొట్లాడుకొని ఈ యంత్రాలకు బానిసలమై వీటికే బలి అయిపోవడమా, లేక మన మందరం ఒకే కుటుంబం అనుకొని ఒక సమాధానానికి వచ్చి ఈ యంత్రమునే మన బానిసలను చేసుకొని జీవితాన్ని ఇంకా వైభవంగా సౌఖ్యవంతంగా అనుభవించడమా అనే ప్రశ్నకు రెండు జవాబులుంటాయని నేననుకోను.

(ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం మూడో మహాసభలో (31.12.1945 నుంచి 2.1.1946) 'సాహిత్యం ఎవరికి? ఎందుకు? అనే అంశంపై జరిగిన సాహిత్య చర్చలో అధ్యక్షోపన్యాసం. ముద్రణ : తెలుగుతల్లి, మాసపత్రిక, మార్చి 1946)

**'సాహిత్యంలో విప్లవం, చరిత్ర, శిల్పం, స్వీయానుభవాలు' పుస్తకం నుండి. సంకలనం: తెలకపల్లి రవి** ◆

# కన్నీటిని తుడిచే చేయి

- శ్రీలక్ష్మి చివుకుల
9441957325

కరోనా కవిత

ఈ నిశ్శబ్దపు నిశీధిలో
అలుపెరుగని ఆ చేయి
తన పనిచేసుకుపోతోంది
అవును!
తను తప్పు ఎవరు చేయగలరు?
20 20 లో కూడా జరుగుతున్న
అన్యాయాలను
అక్షరబద్ధం చేయడానికి
ఆ చేయి పూనుకుంది
కరోనా రాక్షసి వచ్చి
ప్రపంచాన్నే కట్టడి చేసినా
విషాదాన్ని విలయాన్ని
కంటి ముందు నిలిపినా
అతివలపై ఆగని దాష్టీకాలను
ఆపలేని ఆ కలం
లిఖిస్తోంది నిశ్శబ్దంగా
రక్షణ దూరం పాటించమంటున్నా
యువతి కాని బాలికను
పెళ్లి పేరుతో
మూడు ముళ్ళ ఉరితాడు
బిగిస్తూనే ఉన్నాడు
వృద్ధుడైనా పశువు కాబట్టి
కామవాంఛను తీర్చుకునేందుకు
బాలిక కూడా కానీ పసిపాపను
పొదల్లోకి లాక్కు పోతున్నాడు
గృహ నియంత్రణ పేరుతో
తలుపులన్నీ మూసి
ఆ మృగం రేయింబవళ్లు
ఆలి రక్తాన్ని ఆనందంగా
జుర్రుకుంటూనే ఉంది
తాళిబొట్టు మద్యం సీసా
ఎదురుగా పెట్టి
ఏదో ఒకటి ఎంచుకో అంటే
తాళిబొట్టు లాక్కుని
మద్యం సీసా కాని
నడిరోడ్డుపై చిందులేస్తూ
వికటకవినని మురిసి పోతున్నాడు
ఎర్ర ప్రాంతంలో మా ఇల్లుంటే
ఇది ఆగేది కదా! అని
మౌనంగా అనుకుంటూ
బయటకు వెక్కి వెక్కి ఏడిచే
ఆ నిస్సహాయురాలి
కన్నీటిని తుడిచే చేయి ఏది?
ఆ చేయి లిఖిస్తోంది.
ఈ శతాబ్దపు
అతివల వెతలను
మరో శతాబ్దపు
మగువలు మాత్రమే
చదువుకునేందుకు వీలుగా
అక్షరబద్ధం చేస్తోంది.

♦

---

# దూరాంతరం

- గరికపాటి మణీందర్
9948326279

కరోనా కవిత

సూర్యోదయానికి
నెత్తుటి పువ్వులైన పాదాలు ఎదురుకోలు
సొమ్మసిల్లిన ప్రాణాలకు
తారసపడని సాంత్వన
ఇప్పుడు కొలవండి
ఈ దూరాభారాలను ఏ కొలతల్లో
పిలుస్తారో చెప్పండి.
గంట గంటకు భారమవుతున్న కాలాన్ని
ఏ గడియారంలో బంధిస్తారో చూపండి.
చేయని నేరానికి
ఆకలి కిరీటం పెట్టుకొని
తనువంతా గాయాలతో
ఎవరి బతుకు సిలువను వారు మోస్తున్నారు కదా.
ఆచ్ఛాదన లేని చిరు పాదాల ప్రశ్నలు
అమ్మా..మన ఊరు వచ్చిందా..
నాన్నా..ఇంకెంత దూరం నడవాలి.
ఈ ప్రహేళికల చిక్కుముడి విప్పేదెవరు.
మార్గమధ్యంలో మృత్యువు ఎదురుపడితే
ముడుతలు తేరిన నదుటిపై
రక్తచారికల ముద్దుపెడితే
ఈ దూరం తరగదు
ఈ అంతరము చెరగదు.

♦

కథ

# అమ్మకేమైంది



- చేలిక రాజేంద్రప్రసాద్
9985835601

గోడకున్న గడియారంకేసి చూస్తే ఆగిపోయి కనిపించింది. అసలే రాత్రి. ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా అని చూస్తూ బిక్కుబిక్కున గడుపుతున్నాడు రవి. ఇంటి పక్కనున్న వీరేశం మామ ఇంట్లోని ల్యాండ్ ఫోన్ పని చేయడం లేదు. ఊరందరికీ అదొక్కటే దిక్కు. మంచికైనా, చెడుకైనా అందరికీ అదే కేరాఫ్. బయట పెద్ద వర్షం ఇంటి దగ్గర ఏమైందోనని ఒకటే భయపడుతున్నాడు రవి. గతంలో ఎన్నడూ అంత అగులుబుగులైంది లేదు.

సరిగ్గా పుష్కర కాలానికి ముందు ముచ్చట....

రవి వాళ్లది చిన్న కుటుంబం. అమ్మ ఈరక్క. అయ్య గుండయ్య. చెల్లెలు జ్యోతి, తమ్ముడు నరేశ్. రవి వాళ్లది మరీ మారుమూల గ్రామం కాకున్న అంతగా అభివృద్ధి మాత్రం ఎరిగిన పల్లె కాదు. రోడ్డు సౌలతు కూడా లేని పల్లెటూరు. ఊరికి బస్సు కూడా రాదు. ఎటన్న పోవాల్నంటే నడుసుకుంటనో లేదంటే సైకిల్ మీదనో వెళ్లాల్సిందే. ఊర్లో ఉన్న బడిలో ఐదో తరగతి వరకు చదువు అయిందంటే ఇంకా సదువాలంటే పక్కనే మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నాగారంలోని పెద్దబడికి వెళ్లాల్సిందే. రెండు వేల మంది ఉన్న ఆ ఊరంతా ఎవుసం చేసుకుని బతికేటోల్లే. అందరిదీ అంతంత మాత్రమే ఉన్న జీవితం. పచ్చని పొలాలు. ఊరి చుట్టూ ఎప్పుడూ నీటితో కళకళలాడే నాలుగైదు చెరువులు. గుండయ్యకు చదువు రాదు. ఉన్న మూడెకరాల్లో ఎవుసం చేసుకుంట భార్యబిడ్డల్ని సాదుకుంటాండు. గుండయ్యతో పెళ్లైన నుంచి ఈరక్కకు భర్తే లోకం. ముగ్గురు పిల్లలు అయ్యాక ఆ నలుగురే లోకంగా బతుకున్న ఎడ్డి బాగుల్ది. పొద్దున లేచి ఇల్లు, వాకిలి ఊడ్చి, అలుకుపూతలు చేసి బువ్వకూర వండేదాక మొఖం కూడా కడుక్కోదు. వంటపని అయినంక ఇంత బగ్గు నోట్లేసుకుని పళ్లు తోముకునుడు, అటెంక (ఆ తర్వాత) పిల్లలను బడికి పంపే వరకు పనిల్నే మునిగిపోయేది. బిడ్డలు బడికెల్లినంక మొగనితో కలిసి బుక్కెడు బువ్వ తిని సద్దులు కట్టుకొని పెండ్లామొగల్లు ఇద్దరు కలిసి బాయి కాడికి పోయేటోళ్లు. ఇలా ఉన్నంతలో బుక్కెడు తిని సంబురంగా గడుపుతాండ్రు.

రవికి పక్కుళ్లే చదువు అయిపోయింది. సిటీ పోయ్యేందుకు తయారైతాండు. కొడుకెళ్తాండని తల్సుకుంటనె ఈరక్క సంటిపిల్లలలెక్క ఏడ్సుడు మొదలువెట్టింది. “ ఇంట్లో ఎప్పుడూ ఐదుగురం తిరిగేది. నువ్వెళ్లిపోతే నలుగురమైతం. నీ ఎనుక తమ్ముడొత్తడు.. ఆడిపోరికి ఎవలో ఓ అయ్యను సూసి పంపిత్తే దాని సందాల అది పోతది. ఇంట్ల మల్ల మీ అయ్యా, నేనే మిగులుతం” అంటూ ఎక్కెక్కి ఏడ్సింది. గుండయ్య ధైర్నం చెప్పిండు. పిల్లగాండ్లు సుఖంగా బతుకాల్నంటె పెద్ద సదువులు సదివియ్యాలె కదా. ఎప్పటికి మనదగ్గర్నే ఉంచుకుంటే వాళ్ల బతుకులెట్ల. అంటూ తనకు వత్తున్న దుఃఖాన్ని ఆపుకుంట గద్రాయించిండు. తమ్ముడు, చెల్లి మనిషోదిక్కు రవి మీద పడి ఏడ్సిండ్రు. రవి కూడా పెద్దగా ఏడుపు మొదలుపెట్టే సరికి “ పిచ్చోడా.. ఏడుపేందిరా.. సదువుకోసమే గదా.. బాగా సదువాలె.. నిన్ను చూసి తమ్ముడు కూడా మంచి నేర్సుకోవాలె..

" అంటూ గుండయ్య కొడుక్కు ధైర్నం చెప్పిండు. ఈరక్క కొడుకోసం చేసిన అప్పాలు బ్యాగుల సదిరింది. "యాల్లకు తిను.. ఎవ్వలతో కయ్యానికి పోకు.. మంచిగా సదివి పేరు తేవాలె బిడ్డా.." అంటూ కొడుక్కి పదేపదే చెప్పుతనే ఉన్నది. గుండయ్య కొన్ని పైసలిచ్చి "పైలం కొడుకా.. ఇంకా ఏమన్న కావాల్నంటె ఆగయ్య మామతో పంపిస్త.. నాకు నాలుగు దినాల ముందు సెప్పు.." అని కొడుక్కి చెప్పిండు. అవ్వ, అయ్యా, తమ్ముడు, చెల్లెలు, వీరేశం మామ, అనసూయ అత్త ప్రేమగా పంపుతాంటె రవి కండ్ల నీళ్లు తూడ్సుకుంట పట్టణానికి బైలెల్లిండు.

సిటీలోని ఓ కాలేజీల చేరిండు రవి. రెండు రోజులు ఎట్లనో ఓ తీరుగ క్లాసులు ఇన్నడు. అక్కడ్నే పరిచయమైన రాము అద్దెరూంలో సర్దుకుంటానని చేరిపోయిండు. అంతా కొత్తకొత్త. మొదట్ల కొంచెం కష్టమే అనిపించడంతో ఊకెఊకె (మల్లీమల్లీ) ఇంటికిపోయి వచ్చెటోడు. కొద్ది దినాలకు సిటీ వాతావరణం అలవాటైంది. సూత్తాంటనే మూడేండ్లు గడిచినయ్. డిగ్రీ అయిపోయింది. నరేశ్‌ది పదో తరగతి అయిపోయింది. చెల్లెలు తొమ్మిదిలకు చేరింది. ఊరికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రంలోని కాలేజీల తమ్మున్ని చేర్పించిండు రవి. ఇంటి దగ్గర ఎవుసం ఏమంత మంచిగ సాగుతలెదు. కాలం సరిగ అయితలేదు. అవ్వయ్యకు యేండ్లు మీదపడుతానయ్. పనుల్లేక కూలోల్లు పట్టణాలకు వలసలు పోయింద్రు. అన్ని కట్టాల్లో పొట్టకు సావు లేకుండా మాత్రం రోజులు నెట్టకొత్తాంద్రు గుండయ్య దంపతులు. పెండ్లాం మొగళ్లు దొడ్డు బియ్యం తిని, కొనుక్కొచ్చిన సన్నబియ్యం పిల్లలిద్దరికి పెడుతూ కాలం ఎల్లదీస్తాంద్రు. ఖర్సులు పెరిగినయ్. పెట్టుబడి కోసం అప్పులు ఇచ్చేటోల్లు లేరు. ఎవుసం జేసుడు సానా కష్టమైతాంది గుండయ్యకు. చదువులకు, పెట్టుబడికి, దవాఖాన్ల చుట్టూ తిరుగుడుకు ఏడి పైసలు సాల్తలెవ్. ఇంక తప్పేటట్టు లేదని కొద్దిగ భూమి అమ్ముదమని పెండ్లాంతో చెప్పిండు. అవ్వసొంటి భూమిని అమ్మడం ఇద్దరికీ ఇష్టం లేదు. కానీ యాళ్ల అట్లచ్చింది. ఓ మూలన కూసోని ఏడ్సింది ఈరక్క. బాయికాడికి పోయి భూమిని సూత్తాంటెనే కండ్లపొంటి నీళ్లు కారుతనే ఉన్నయి. పక్కలకెళ్లి లేసిన కాన్నుంచి మల్ల పక్కమీదికి పోయేదాక ఆ భూమిల్నే తెల్లాదేది. ఆ భూమిల్నే పొద్దుపోయేది. అసొంటి భూమిని అమ్మడానికి చేతులు రావడం లేదు. మరి పైసలెల్లక పెద్దోని చదువు మధ్యల్నే ఆగేటట్టున్నదనే బాధ ఓ పక్క. చిన్నోడు కూడా ఇంటర్ చదువబట్టె. వానిక్కూడా ఖర్సులు పెరగవట్టె. పిల్ల పెద్దమనిషైంది. ఈ కట్టాల నడుమ అమ్ముడు సరనిపించింది. అవసరం మనదైనప్పుడు కొనేటోడు అగ్గువకు అడుగుడు లోకం ఉన్నదేనాయె. గుండయ్య పరిస్థితి కూడా అట్టనే తయారైంది. గిట్టుబాటు కాక గుండయ్య భూమి అమ్మే విషయాన్ని వాయిదేసుకున్నడు. తెలిసిన శేటు దగ్గర భూమి కాయిదాలు కుదవ పెట్టి అప్పు తెచ్చిండు.

ఈరక్కకు ఆరోగ్యం సక్కగుంటలేదు. ఎప్పుడూ జ్వరం, బాగా దగ్గు. ఊళ్లె డాక్టర్ ఇచ్చే గోళీలు మింగడం, తినబుద్ధైతే బుక్కెడంత తినుడు. అంతేగాని పెద్ద దవాఖానకు పోయేందుకు పైసలు లేక రోజురోజుకు బక్కవడ్తాంది. ఊళ్లే డాక్టరేమో ఒక్కసారి పరీక్షలు చేయించుకో రోగమేందో తెలుస్తదని చెప్పుతాండు. పైసల్లేక ఈరక్క ఊళ్లె డాక్టరిచ్చిన గోళీలు మింగుతు ఇంటిదగ్గర పిల్లకు తెల్వకుండ రోజులు నెట్టుకొత్తాంది. రవి వచ్చినప్పుడల్లా ఈరక్క పాణం గురించి తెలువనియ్యకుండా పెల్లాం మొగలిద్దరూ మెదిలెటోల్లు. " వానికి తెల్తే రందికి సదువు సక్కగ సదువడు.. మనకెప్పుడూ ఈ కట్టాలు ఉండేటియేనాయె.. పెద్దోన్ని బాధపెట్టద్దు.." అనుకునెటోళ్లు. రవికి అమ్మ ఆరోగ్యం మీద అనుమానం వచ్చి అడిగినా ఈరక్క నవ్వి ఊరుకునేది. " ఏం లేదు కొడుకా.. కొంచెం పెయి ఎచ్చగున్నది.. ఊళ్లే డాక్టర్ తాతకు సూపించుకున్న. మందులిచ్చిండు. ఏసుకుంటాన.. నాకేం కాలె బిడ్డా.." అంటూ మాట దాటేసింది.

వీరేశం మామది కిరాణా దుకాణం. అనసూయ అత్త, వీరేశం మామంటే ఊరందరికీ ఇంటి పెద్దలెక్క. ఊరందరికీ వీరేశం ఇంట్ల ఫోనే దిక్కు. ఊల్లె ఎవ్వలకు ఫోన్ వచ్చిన వీరేశం ఇంట్లో మనిషి లెక్క మాట్లాడెటోడు. ఏ కార్యమైన పెండ్లాంమొగల్లు వచ్చెటోల్లు. దీవెనలిచ్చెటోల్లు. ఏమన్న కొత్తపని మొదలుపెట్టాల్నంటె వాళ్ల ఇగురుం (సలహా) అడిగెటోళ్లు. అందరు పగటిపూట ఎవుసం పనులకు పోతె ఎవలకన్న ఫోన్ వత్తె వాల్లచ్చినంక అనసూయ అత్త వాళ్ల ఇంటికెళ్లి చెప్పేది. ఈరక్క ఆరోగ్యం బాగలేదనే విషయం రవి ఎప్పుడు ఫోన్‌చేసినా దాచిపెట్టింది. ఈరక్క కూడా అనసూయత్తకు "చెప్పొద్దవ్వా... కొడుకు బెంగ పెట్టుకుని ఆగమైతడు.." అని బతిలాడింది.

రవి పీజీ పూర్తి చేశాడు. ఇంటి దగ్గర పైసలకిబ్బంది అయితాందని ఓ చిన్న ఉద్యోగం సూసుకున్నడు. రూం కిరాయి. తిండికి అవసరమైన సామాన్లు, చిల్లర ఖర్చుల వరకు ఎల్లదీసుకుంటాండు. అమ్మకు పాణం బాగ లేదనె విషయం

తెల్వదు. అప్పుడప్పుడు ఇంటికెళ్లి అందరిని చూసి వత్తాండు. ఇట్లుండగనే రవి ఓ రోజు వీరేశం మామ ఇంటికి ఫోన్ చేసిండు. ఎంతకూ ఫోన్ ఎత్తలేదు. ఎటైనా ఊరెళ్లారేమో అనుకున్నడు. తెల్లారి ఫోన్ చేత్తె అనసూయత్త ఫోన్ ఎత్తింది. “ అత్తా.. నిన్న నాలుగైదుసార్ల ఫోన్ చేసిన.. ఎత్తలేదు.. ఎటెళ్లింద్రు అత్తా.. ”అని అడిగిండు. “ ఎటు పోలేదు కొడుకా.. ఇంటికాన్నె ఉన్న.. మామ సామానుకు పోయి పగటిల్లి వచ్చిండు” అని చెప్పి.. “ ఇంటికత్తవా బిడ్డ ఈ నడుమ..” అని అడిగింది. మొన్ననే వచ్చిన కద అత్త. ఇప్పట్ల రాను అని రవి చెప్పిండు. ఎందుకత్తా అని అడిగితే అమ్మకు కొంచెం మంచిగుంటలేదు. నిన్న నువ్వు ఫోన్ చేసినప్పుడు అక్కన్నే ఉన్న.. అని చెప్పింది. ఆ మాటలు ఇనంగనె రవి గుండె కలుక్కుమన్నది. ఏమైంది అత్త అమ్మకు అని అడుగుడు మొదలుపెట్టిండు. ఏం లేదులే బిడ్డ.. కొంచెం మొస్స వత్తాంది. అన్నం తింటలేదు. నేనే రెండు రొట్టెలు చేసుకపోయి ఇచ్చిన.. తిట్టంగతిట్టంగ బలిమీటికి ఒక్కటి తిన్నది అని చెప్పింది. రవికి ఎట్లనో అనిపిచ్చింది. అమ్మకు అసలేమైంది అత్త అని గుచ్చిగుచ్చి అడిగిండు. కొద్దిరోజులు నుంచి ఆరోగ్యం మంచిగుంటలేదు. దగ్గు, మొస్స ఎక్కువైంది. నీకు చెప్పితె సదువు నాశనమైతదని చెప్పనియ్యలె. నువ్వొక్కసారి ఇంటికి రారా.. అంతా తెల్తది అని చెప్పింది అనసూయత్త. రవికి అప్పటికప్పుడే ఇంటికిపోవాల్ననిపించింది. కానీ తోటి ఉద్యోగి ఆ రోజు సెలవులో ఉండడంతో ఆ పూట ఆఫీసుల్నె గడిపిండు. తెల్లారి సెలవుపెట్టి ఇంటికి బైలెల్లిండు.

బస్సెక్కిన నుంచి రవికి ఎప్పుడెప్పుడు ఇంటికెల్దామా అని ఆదుర్త ఎక్కువైంది. మధ్యలో బస్సు దిగి ఆటోలోనో, రిక్షాలోనో ఊరెళ్లాలి. తొందరగ ఎల్తె బాగుండూ అనే ఆలోచనలో ఉండగానే బస్సు దిగే ఊరు వచ్చింది. అక్కడ ఆటోలు, రిక్షాలు లేక గంటసేపు నిల్సున్నడు. అప్పటికి ఓ ఆటో వచ్చింది. పికులాపికులం (ఫుల్‌గా నిండింది) ఉన్న ఆటోలో కమ్మీ పట్టి నిల్సుని ఊరికి బెలెల్లిండు. ఇల్లు దగ్గరకస్తాంటె ఏమోమో ఆలోచనలత్తానయ్. గుడ్లనిండ నీళ్లు తిరుగుతానయ్. ఆటోల నిల్సుని ఉండేసరికి దూరం నుంచె చెల్లెకు కనిపించిండు. జ్యోతి తల్లికి చెప్పింది. లేని బలాన్ని కూడగట్టుకుని ఈరక్క మంచంలకెల్లి లేసే ప్రయత్నం చేసింది. రవి దబదబ చెప్పు లిప్పి కాళ్లు కడుక్కుని అమ్మ మంచం దగ్గరకు పరుగెత్తిండు. గట్టిగా కావలిచ్చుకుని పెద్దగ ఏడ్సిండు. ఓ పక్క చెల్లె, తమ్ముడు, ఎవ్వళ్లకు వాళ్లు ఏడుస్తునే ఉన్నరు. అప్పుడే బాయికాడికెల్లిన గుండయ్య వచ్చి కొడుకొచ్చిన విషయం చూసి ఎప్పుడొచ్చినవ్‌రా అని అడిగిండు. ఏడుపులు ఇన్న చుట్టు పక్కలోల్లు వచ్చింద్రు.. అనసూయత్త దుకాణం మూసి వచ్చి, ఎప్పుడొచ్చినవ్‌రా రవి అని అడిగింది. ఈరక్క “ రా వదిన కూసో.. బిడ్డా.. అత్తకు పీటెయ్.. ” అని జ్యోతికి చెప్పింది.

మంచిచెడులు అడిగిన తర్వాత రవి అసలేమైందో తెల్సుకోవాలని అడుగుడు మొదలుపెట్టిండు. ఎంతకూ ఎవ్వలూ చెప్తలేరు. కొద్దిసేపటికి ఓపిక నశించి అరిచినంత పనిచేసిండు. జ్యోతి అన్న దగ్గరకుపోయి “ మాక్కూడా తెల్వనిత్తలేరన్నా..” అన్నది ఏడుపాపుకుంట. చివరకు అనసూయత్తే “ అరే రవి అమ్మకు కొద్ది దినాల్నుంచి పాణం మంచిగుంటలేదు. మనిషంతా ఎట్లనో అయితాంది. ఎందరు చెప్పిన ఇనిపించుకుంటలేదు. పెద్ద దవాఖాన్ల చూపించుకోమంటె పనులున్నయ్ రెబ్బోత.. మాబ్బోత.. అంటూ గడుపతాంది. ఇప్పుడు బాగా ఇబ్బంది పడ్తాంది. ” అంటూ చెప్పింది. “ అమ్మా రేపే దవాఖానకు పోదాం.. సిటీల్నె చూపిస్తా..” అంటూ చెల్లెకు అన్ని సదురవె అని చెప్పిండు రవి. రాత్రి గడిచింది. పొద్దుగాల్నె రవి తల్లిని, చెల్లిని తీసుకుని నగరానికి బయలెల్లిండు. తన రూంకు తీసుకపోయి మొఖాలు కడుక్కుని ఆస్పత్రికి బైలెల్లిండు. అక్కడ ఈరక్కకు కొన్ని పరీక్షలు చేసిన తర్వాత రిపోర్టులు చూసిన డాక్టర్లు ఆమెకు పెద్దరోగం (క్యాన్సర్) ఉన్నదని నిర్ధారించింద్రు.

విషయాన్ని రవిని పక్కకుపిల్సుకుని చెప్పింద్రు డాక్టర్లు. వాళ్ల మాటలు ఇనంగానే రవికి గుండు ఆగినంత పనైంది. కండ్లల్ల నీళ్లు కారుతాంటె ఏం మాట్లాడాల్నో తెల్వలేదు. డాక్టర్ గది ముందు అమాయకంగా వచ్చిపొయేటోళ్లను సూసుకుంటా కూర్చున్న తల్లీ చెల్లిని అద్దంలో సూసిన రవికి ఏడుపు తన్నుకొచ్చింది. అయినా అనుకున్నడు. పెద్ద రోగం ఎవ్వలకు చెప్పినా తట్టుకోరని రవి మనుసుల్నే దాసుకుని డాక్టర్ రాసిచ్చిన మందుల చిట్టీని తీసుకుని మందులు కొనుక్కొని అందరు కలిసి రూంకు చేరుకున్నరు. దారెంట, రూంకు వచ్చినంక కూడా డాక్టర్ ఏం చెప్పిండురా అని అమ్మ ఎన్నిసార్లు అడిగినా రవి అసలే చెప్పలేదు. ఏం లేదమ్మా కొంచెం రక్తం తక్కువున్నదట మంచిగ తింటె సరిపోతదని చెప్పిండ్లు అని మాట మార్చి చెప్పిండు వస్తున్న దు:ఖాన్ని ఆపుకుంట. కొద్దిసేపటికి అమ్మా ఏమన్న పండ్లు కొనుక్కొత్త.. చెల్లె నువ్వు తిందురట అంటు బయటకెళ్లే ప్రయత్నం చేస్తుంటే “ వద్దు బిడ్డ.. నాకేమొద్దు..

చెల్లెకేమన్నా తే.. అది సక్కగ తింటలేదు.. ఆడపిల్ల ఆరోగ్యం మంచిగుంటనే ముందుముందు ఏం కాదు.. లేకపోతే ఇగో నాలెక్క లేనిపోని రోగాలొత్తయి.. మళ్ల దవాఖాన్ల చుట్టు తిరుగాలె.. అని కొడుక్కు చెప్పింది. ఆ మాటలు వింటాంటె రవికి ఏడుపు ఆగలేదు. కండ్లనీళ్లు తూడ్సుకుంటునే పక్కనే ఉన్న పండ్ల బండికాడికిపోయి డజన్ అరటిపండ్లు, కొన్ని సేపులు (ఆపిల్స్), అంగురా(ద్రాక్ష) తెచ్చి తల్లికి, చెల్లెకి తినుమన్నడు. కొంచెం సేపటికి అన్నం తినిపించుకుని అమ్మకు గోళీలు వేయించి ఆ మాట, ఈ మాట మాట్లాడుకుంట నిద్రలకు జారుకున్నరు.

◆◆◆

ఎండకాలం అవడంతో పనులేమి లేకపోవడంతో ఊరంతా చెట్లకిందే కూర్చొని మంచిచెడులు మాట్లాడుకుంటూ కాలం గడుపుతున్నరు. రవి పాణం ఊరుకోక నాలుగొద్దులకోసారి ఇంటికి పోయివత్తనే ఉన్నడు. ఎవరడిగినా ఏం చెప్పుతలేడు. ఈరక్క మందులు ఆరు నెలల కోర్సు వాడుతోంది. రోజురోజుకు బొత్తిగా మనిషి తెర్లయితాంది. సూత్తాంటెనే రోజులు గడ్తానయ్.కాలం నెత్తిమీదకొచ్చింది. వానకాలం రానే వచ్చింది. ముసుర్లు పడుతానయ్. ఓ రాత్రి జోరువానందుకున్నది. అయిటిపూనినంక అదే పెద్దవాన. ఆ రాత్రి గుండయ్య, ఈరక్క, నరేశ్, జ్యోతి కలిసే బువ్వ తిన్నరు. ఈరక్క మందులేసుకుని పన్నది. గాలిదుమారానికి కరంటు పోయింది. ఉడ్కపోత్తాంటే అటుకొట్టుకుని, ఇటుకొట్టుకుని కట్టం(కష్టం)గా అందరు నిద్ర పోయింర్రు. అర్ధరాత్రి పూట ఏదో సప్పుడైతే గుండయ్యకు తెలివచ్చి(మెలకువ) లేచిండు. పెండ్లాం మంచం మొఖన సూసిండు. మొస్స తీసుకునేందుకు ఈరక్క ఇబ్బందిపడ్తాంది. "ఏమైతాందే.." అన్నడు. నాకంతా ఎట్లనో అనిపిత్తాంది.. అగులుబుగులైతాంది.. అని బలిమీటికి చెప్పింది ఈరక్క. శెత్తిరి (గొడుగు) దొరుకలేదు. చీకట్ల ఎక్కడేమున్నదో కనిపిత్తలేదు. "డాక్టర్ తాత దగ్గరికి పోరా నరేశ్" అనంగానే తలమీద తువ్వాల కప్పుకుని ఊళ్లే డాక్టర్ దగ్గరికి ఉరికిండు నరేశ్. జ్యోతి తల్లి మంచంల కూసోని ఏడ్తాంది. అమ్మా.. ఏమైతాందే.. అని పదేపదే అడుక్కుంటా కాళ్లుచేతులు నల్తాంది.. గుండయ్య దబదబ వీరేశం ఇంటికెళ్లి లేపిండు. అనసూయ, వీరేశం ఆగమాగం తలుపులు దగ్గరపెట్టి వానల్నే ఉరికొచ్చింర్రు. ఈరక్కను సూడంగనే అనసూయ అదిలిపడ్డది. ఎంబడే ఎనుకకు తిరిగి ఇంటికెళ్లి రవి ఇచ్చిన నంబరుకు ఫోన్ చేసింది. అది వాళ్ల ఓనర్ ల్యాండ్ ఫోన్. ముందుగాల రింగుకు ఎవలూ ఫోన్ ఎత్తలేదు. అనసూయ మళ్లఫోన్ చేసింది. ఈసారి అవతలి వాళ్లు ఫోన్ ఎత్తి మాట్లాడంగానే "ఒక్కసారి రవిని పిల్వరా.." అన్నది కంగారుగా. ఆ మాటలు వినగానే రవిని పిలిచిండు ఓనర్. రవి దిగ్గున లేచి వచ్చి ఫోన్ చేతికి తీసుకున్నడు. అనసూయ అత్త మాట గుర్తుపట్టిండు. "అత్తా ఏమైంది.." అని అడిగిండు గాబరాపడుతు.

"అరేయ్ రవి అమ్మకు..." అనంగనె ఫోన్ కట్ అయింది. రవి మళ్ల ఎన్నిసార్లు ఫోన్ చేసినా అనసూయత్త వాళ్ల నంబర్‌కు కలువలేదు. వానకు ఎక్కన్నో లైన్లు తెగిపోయినట్టున్నయ్. రవిలో భయం మొదలైంది. ఇంటికాడేమైందో అని గాబరషురువైంది. ఓనర్‌కు "థ్యాంక్స్ అంకుల్..' అని చెప్పి ఆలోచించుకుంటనె రూంలకు వచ్చి కూలబడ్డడు. కండ్లపొంటి నీళ్లు కారుతనే ఉన్నయ్. గోడకున్న గడియారం కేసి చూస్తే ఆగిపోయి కనిపించింది. ఏవేవో ఆలోచనలు. అమ్మకు ఏమైందో.. ఇంటికాడ పరిస్థితి ఎట్లున్నదో.. అనే భయంతో కండ్లపొంటి నీళ్లు కారుతనె ఉన్నయ్. బయట పెద్దవాన. ఎప్పుడు తెల్లారుద్దా ఇంటికెప్పుడు పోతనా.. అని ఒకటే టెన్షన్. రవికి గతంలో ఎప్పుడు అంతభయమైంది లేదు. అయ్యతో కలిసి అమ్మ పడిన కష్టం, చదివించడానికి అప్పులు దొరకక పడిన ఇబ్బందులు, బువ్వ సాలక తమ్ముడికి, చెల్లికి తనకు తినిపించి అమ్మ నీళ్లు తాగి పడుకున్న రోజులు.. అమ్మా, అయ్యా కడుపు ఎండబెట్టుకుని పైసలు కూడబెట్టి చదువులకు పంపిన దినాలు.. ఓదానెంట ఓటి చిన్నప్పటి విషయాలన్నీ రవి మెదట్ల తిరుగుతనే ఉన్నయ్. అమ్మ ఎల్లిపాయమిరంతో తినిపిచ్చిన ముద్దలు, కుటుంబమంతా కలిసి గడిపిన దినాలు అన్నీ కండ్లల్ల మెదిలినయ్ రవికి. అర్ధరాత్రి వేళ అనసూయ అత్త ఫోన్ అనేసరికి డాక్టర్లు చెప్పిన మాటలు యాదికొచ్చినయ్. తెల్లారితే గానీ బైట కాలు పెట్టలేని పరిస్థితి. కాలం వేగం తగ్గిందా అన్నంత ఆవేదన చెందాడు రవి. తీవ్రంగా మదనపడుతూనే ఆ రాత్రి క్షణాలను అతి కష్టంగా గడిపిండు. బైబై తెల్లరంగానె(కొద్దికొద్దిగా తెల్లవారుతుండగానే) తొందర్తొందరంగా ఊరుకు బైలెల్లిండు. ఇంటి దాపులకు పోంగనె రవి అనుమానం నిజమైంది. డాక్టర్లు చెప్పిందే జరిగింది. అమ్మ లోకాన్ని ఇడిసిపోయింది. చెల్లెను, తమ్ముణ్ని సూసుకుంటునే రవి నిశ్చేష్టుడైండు. ◆

# కాళ్ళు పాఠాలు చెబుతాయి

- పొత్తూరి సుబ్బారావు
9490751681

కరోనా కవిత

ఇప్పుడు కూడా
ఆ కాళ్ళు దూరంగా, దుర్బలంగా
సాగిపోతూనే వున్నాయి
అవి మోసే శరీరాలు
కాయకష్టం చేసి బక్కచిక్కటంతో
ఆ కాళ్ళకంతగా భారం అనిపించటంలేదు
పలుగూ, పారా - తట్టా, బుట్టా
పిల్లా జల్లలను మోస్తున్న దేహాలు
ఆ కాళ్ళకు నిస్సత్తువను ఆపాదించలేదు
వేసిన రైళ్ళనెక్కలేక
వెళ్ళే బస్సులనందుకోలేక
వేసారిన ఉదరాలకు తిండిలేక
ఆదుకునే నాథులందుబాటులో లేక
బాణంలా వంగుతున్న నడుములతో
నడుమ నడుమ అలసట తీర్చుకునే
ఆసరాలు అగుపించని రహదారుల్లోనూ
రైలు పట్టాలపైననూ
ఆ కాళ్ళు ముందుకు వెళుతూనేవున్నాయి
ఎన్నాళ్ళగానో వలస పక్షులుగా
బతుకెళ్ళబుచ్చుతున్నా
ఏదో దారిన స్వస్థలానికి చేర్చే
ఆ కాళ్ళకిపుడు కొత్త అనుభవం తోడైంది
కరోనాను ఖాతరుచేసే స్థితి
తమకెప్పటికీ లభించదన్న నిరాశతో
లాక్‌డౌనూ, సడలింపులూ
వాటి అర్థాలుకూడా తెలియని
అమాయక జనాన్ని మోసే
ఆ కాళ్ళు రాత్రింబవళ్ళు తేడాలేక
నడకసాగిస్తూనే వున్నాయి
వాగ్దానాలని నిలబెట్టుకోలేని
నాయకులకు దూరంగా
బడబాగ్ని జ్వాలలని భరిస్తున్న
వలస కార్మికుల జీవితాలకు
కాళ్ళు పాఠాలు చెబుతాయి
అవే పాలకులకెప్పటికైనా
గుణపాఠాలు చెబుతాయి

◆

---

# ఇక్కడ ప్రవేశం లేదు!

- పుట్టపర్తి మల్లికార్జున
9490439029

కరోనా కవిత

నెత్తిన మూటలతో ఆకలి మంటలతో
ప్రాణాలరచేత పట్టుకుని కదిలే సమూహాలు లేని
చంటి బిడ్డల శూన్యపు పొట్టను నింపేకి
ఎండిన రొమ్ముని నోటికందించే అమ్మలు లేని
ఇంటిలోనే బందీలుగా బతికే అవస్థల్లేని
ఆనంద ప్రపంచాన్ని నిర్మించేందుకు
నాతో వస్తారా!
ఆహ్వానించానే కానీ అందరికీ
ప్రవేశం లేదండోయ్
విపత్తు గోతుల్ని పూడుస్తున్న సైనికులకు
రాస్తాలపై స్వేదంతో లక్ష్మణ రేఖల్ని గీస్తున్న రక్షకులకు
చెత్తను మోసుకెళ్ళే కార్మిక కర్మయోగులకు
కొండెక్కే ప్రాణ దీపాల్ని వెలిగిస్తున్న
వైద్య దేవుళ్ళకు
సహకరించని వారికి ప్రవేశం లేదు
విష రసాయనాలతో పంట
దిగుబడి పోటీలు పెట్టే
పర్యావరణాన్ని హరించి
జీవకోటికి హాని చేసే
స్వార్థపు పొరల్లో ఇంకిన
దాతృత్వాన్ని తవ్వి తీయని
వలస కార్మికులకు
కాసింత మానవత్వపు లేపనం రాయలేని
వారికి ఇక్కడ ప్రవేశం లేదు
మూతికి ముసుగు చేతికి తొడుగు లేకుండా వచ్చే
కాలుష్యాన్ని కల్మషాన్ని తొలగించుకోని
చేతుల్ని చేతల్ని శుభ్రపరచుకోని
ఆలింగనాలకు కరచాలనాలకు ఆరాటపడే
సామూహిక విందులు వినోదాలకి వీడ్కోలు పలకలేని
లాక్ డౌన్ క్వారంటైన్ లను స్వచ్ఛందంగా పాటించలేని
వారికి ఇక్కడ ప్రవేశం లేదు

◆

# వైరస్‌ల వ్యాప్తితో విజృంభిస్తున్న వివక్ష



**- అర్చనా ప్రసాద్**

'శాంతి అంటే యుద్ధం లేకపోవడం మాత్రమే కాదు. కోవిడ్-19 కారణంగా విధించిన లాక్‌డౌన్‌లో...తమ ఇళ్లలో అత్యంత సురక్షితంగా ఉండాల్సిన ఎంతోమంది మహిళలు గృహహింసకు గురవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఇంట్లోనూ ప్రశాంతత కోసం నేను ఈ రోజు విజ్ఞప్తి చేస్తున్నాను'.

**- ఆంటోనియో గుటెరస్**, ఐక్యరాజ్యసమితి (యుఎన్ఒ) ప్రధాన కార్యదర్శి, ఏప్రిల్ 6, 2020.

ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తిని అడ్డుకునేందుకుగాను ప్రభుత్వాలు లాక్‌డౌన్‌ను విధించినప్పటి నుండి గృహహింస బాధితులు పెరిగిపోతున్న నేపథ్యంలో...అత్యవసర హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేసేందుకు గాను యుఎన్ఒ ఈ పిలుపు ఇచ్చింది. కొన్ని దేశాల్లో ఈ గృహహింస ప్రభావం అత్యధికంగా వుందని గణాంకాలు తెలియ చేస్తున్నాయి. గృహహింసకు గురైన మహిళల ఫోన్ కాల్స్...లాక్‌డౌన్ విధించిన మొదటి రెండు వారాల్లోనే 12.4 శాతం పెరిగాయని, ఆన్‌లైన్ సంప్రదింపుల కోసం అభ్యర్థనలు 270 శాతం పెరిగాయని స్పెయిన్ దేశపు సమానత్వ మంత్రిత్వ శాఖ నివేదించింది. సింగపూర్, సైప్రస్‌లలో హెల్ప్‌లైన్లకు మహిళా బాధితుల ఫోన్లు 30 శాతం పెరిగాయి. కోవిడ్-19 ప్రభావిత దేశాలైన బ్రిటన్, అమెరికా వంటి ఇతర దేశాల నుండి కూడా ఇటువంటి నివేదికలే వస్తున్నాయి. ఇటీవల భారత దేశంలో, జాతీయ మహిళా కమిషన్ సైతం గృహ హింసకు వ్యతిరేకంగా గణనీయమైన సంఖ్యలో ఫిర్యాదులను నమోదు చేసింది. కరోనా మహమ్మారి ప్రభావంతో...ఈ అంశం మీద కొంత కదలిక కనిపిస్తున్నప్పటికీ...చర్చలో ప్రధానంగా దృష్టి సారించవలసిన మూడు ఇతర అంశాలు ఉన్నాయి.

**మహిళలపై పని భారం, ఒత్తిడి**

మొదటి అంశం-కుటుంబంలో మహిళలపై పెరుగుతున్న పని భారం, ఒత్తిడి. 'ఇంటి నుంచే పని' చేయమంటూ ప్రభుత్వాలు ఇచ్చిన ఆదేశంతో మహిళలపై మునుపెన్నడూ లేనంత భారం పడింది. కోవిడ్-19 వ్యాప్తిని నిరోధించేందు కోసం 100కు పైగా దేశాలు పాఠశాలలను మూసివేయడంతో...సుమారు 85 కోట్ల మంది పిల్లలు ఇంటికే పరిమితం అయ్యారని ఒక మీడియా నివేదిక తెలుపుతోంది. దీంతో మహిళలపై పిల్లల సంరక్షణ బాధ్యతలు గణనీయంగా పెరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా చిన్నారులు, వృద్ధుల సంరక్షణ బాధ్యతలు మూడింట రెండు వంతుల మేరకు ఎటువంటి వేతనం లేకుండా మహిళలే చేస్తున్నారు. ఈ కారణంగా లాక్‌డౌన్‌లో మహిళలపై ఒత్తిడి ఇంకా తీవ్రమైంది. కుటుంబాల్లో నెలకొన్న సంక్షోభాన్ని పురుష భాగస్వాముల కంటే ఎక్కువగా మహిళలు భరించాల్సి వస్తోంది. ఆఫ్రికా, కరేబియన్ దేశాలలో ఎబోలా, జికా వైరస్ వ్యాప్తి పరిస్థితులపై అధ్యయనాన్ని పరిశీలిస్తే లైంగిక అసమానతలు ఇంకా పెరగడమే జరిగిందని తెలుస్తుంది. ఎందుకంటే ఆర్థిక ఇబ్బందుల భారం పురుషుల కంటే మహిళల పైనే ఎక్కువగా పడింది.

**మహమ్మారిపై పోరులో ముందు**

మరింత లోతుగా పరిశీలించాల్సిన రెండవ అంశం– కరోనా మహమ్మారిపై పోరాటానికి ఏర్పాటు చేసిన వ్యవస్థలో మహిళలే ముందు వరుసలో ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా, మహమ్మారిపై పోరు సల్పుతున్న ఆరోగ్య సంరక్షణ సిబ్బందిలో సుమారు 60 మంది శాతం మహిళలే. వీరిలో ఎక్కువ భాగం నర్సింగ్, కమ్యూనిటీ హెల్త్ సర్వీసులలో ఉన్నారు. ఉదాహరణకు, కోవిడ్ మహమ్మారి కేంద్రాలుగా ఉన్న అమెరికా, స్పెయిన్, చైనా వంటి అనేక దేశాలలో నర్సింగ్, కమ్యూనిటీ ఆరోగ్య సిబ్బందిలో 85 శాతానికి పైగా మహిళలే. అందువల్ల ఈ క్లిష్ట సమయంలో నర్సుల పని పరిస్థితులపై ప్రజాస్వామిక మహిళా కార్మికవర్గ ఉద్యమాలు ప్రధానంగా దృష్టి సారించాల్సి వుంటుంది. నర్సుల ట్రేడ్ యూనియన్ ఇటీవల వేసిన పిటిషన్ ప్రకారం, ఈ వృత్తిలో వున్నవారు వ్యాధికి గురయ్యే అవకాశాలు, అధిక పని గంటలు, మానసిక క్షోభ, అలసట, శారీరక–మానసిక హింస మొదలైన వాటిని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఢిల్లీ లోని కోవిడ్–19 ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది వెలువరించిన తాజా ప్రకటనను పరిశీలిస్తే వారిలో నెలకొన్న ఆందోళన, ఒత్తిడి అర్థమవుతుంది. "మేం మా కుటుంబాలతో కలిసి జీవించడం లేదు. మేమంతా ఐసొలేషన్ గదులలో, హాస్పిటల్ హాస్టళ్లలో వుంటున్నాం. మాకు బయటకు వెళ్లడానికి అనుమతి లేదు. పని వున్నప్పుడు మాత్రమే బయటకు వెళ్తాం. లేదంటే, రోజంతా మా గదుల లోనే వుంటాం. నీళ్లు, ఆహారం ఈ గదులకే వస్తోంది. సాధారణంగా మాకు షిఫ్టుకు ఆరు గంటలు మాత్రమే పని చేయాలి. కానీ కోవిడ్–19 పాజిటివ్ కేసులను, కోవిడ్ అనుమానాస్పద రోగులను చూసే సిబ్బందికి మాత్రం రోజంతా నాలుగు షిఫ్టులు ఉన్నాయి. మేం మా డ్యూటీ టైమ్‌లో ఏదీ తినలేము, తాగలేము. వాష్‌రూమ్‌కు వెళ్ళలేము. ఒకవేళ వెళ్లాలంటే, మేం వేసుకున్న పిపిఇ లు(వ్యక్తిగత రక్షణ పరికరాలు) మొత్తం తొలగించాల్సి వుంటుంది. అది చాలా ఖర్చుతో కూడుకున్న విషయం కూడా".

బలమైన ఆరోగ్య వ్యవస్థలున్న దేశాలలో సైతం ఇటువంటి అనుభవాలు ఉన్నాయి. ఉదాహరణకు, ఇటాలియన్ నర్సు ఒకరు ఇలా చెప్తోంది. "నేను ఒక నర్సుని. మహమ్మారి విస్తరిస్తున్న ఈ పరిస్థితిలో, నేను ఆరోగ్య ఎమర్జెన్సీని ఎదుర్కొంటున్నాను. బయటకు వెళ్లేందుకు నేను కూడా భయపడుతున్నాను. కాకపోతే కిరాణా సరుకులు కొనడానికి వెళ్లేందుకు కాదు. పనికి వెళ్లేందుకు భయపడుతున్నాను. మాస్క్ సరిగ్గా కట్టుకున్నానో లేదోనని భయపడుతున్నాను. చేతులకు తొడుక్కున్న మురికి గ్లోవ్స్‌తో పొరపాటున మాస్క్‌ను తాకానేమో? లెన్సులు నా కళ్ళను పూర్తిగా కప్పి ఉంచాయో లేదో? వాటి గుండా ఏదైనా క్రిమి వెళ్తుందేమో అని భయంగా వుంటుంది. నేను వేసుకునే తెల్లటి కోటుకి చెమట అంటుకుంటుంది. డ్యూటీ యూనిఫామ్ వేసుకున్నాక నేను బాత్‌రూమ్‌కు వెళ్ళలేను. 6 గంటల పాటు ఏమీ తాగలేను. నేను మానసికంగా అలసిపోయాను. ఈ పరిస్థితిలోనే...నా సహోద్యోగులందరూ గత కొద్ది వారాలుగా పని చేస్తున్నారు. కానీ ఎప్పటిలాగే నిరాటంకంగా మా విధులు నిర్వర్తించకుండా ఇవేవీ మమ్మల్ని నిరోధించలేవు" అని. తమ కుటుంబాలను విడిచిపెట్టి ఒంటరిగా జీవించాల్సి వచ్చిన నర్సులు అనుభవించిన మానసిక ఒత్తిడికి, పొందిన అలసటకు సాక్ష్యమిది. అభివృద్ధి చెందిన అనేక దేశాలు కూడా ఇటువంటి అత్యవసర పరిస్థితులకు సంసిద్ధంగా లేవని...ప్రజారోగ్యానికి చేసే ఖర్చులలో పెడుతున్న కోతలే దీనికి కారణమని స్పష్టంగా తెలుస్తోంది. అయితే ఇందుకోసం బాగానే ఖర్చు చేస్తున్న చోట కూడా...ఒక మహిళా కార్మికురాలి అవసరాలను దృష్టిలో పెట్టుకోవడం–అది కూడా ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో వారికి సరిపడేలా చూడాలన్న దృష్టి లేకపోవడం లోపంగా వుంది. ఈ తక్షణ సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉంది. దాంతోపాటుగా మహిళా నర్సుల హక్కులు, వారి అవసరాలకు అనుగుణమైన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రజారోగ్య వ్యవస్థలో కొంత ప్రత్యేక దృష్టి అవసరం.

కోవిడ్–19 ప్రభావం 'అసంఘటిత' రంగానికి చెందిన 'ఆశా' వర్కర్ల వంటివారి పైన కూడా వుంది. కనీసమైన కార్మిక హక్కులు కూడా లేకుండా వీరు తమ సేవలు అందిస్తున్నారు. సరైన పారితోషికం, శిక్షణ లేకుండా పని చేస్తున్న 'ఆశా' కార్మికులకు సంబంధించిన నివేదికలెన్నో వెలువడ్డాయి. స్కీమ్ వర్కర్ల దీర్ఘకాలిక డిమాండ్లను నెరవేర్చవలసిన అవసరాన్ని అవి బహిర్గతం చేశాయి. గ్రామస్తులు ఈ శ్రామిక మహిళలను అనుమానిస్తూ వేధింపులకు గురిచేసిన ఘటనల కథనాలు కర్ణాటక వంటి రాష్ట్రాలలో అనేకం వచ్చాయి. కేరళ లోని 'ఆశా' వర్కర్ల అనుభవానికి ఇది పూర్తి భిన్నంగా వుంది. కోవిడ్

కవిత

# ఎవరిదీ చూపు

- విజయ్ కోగంటి
8801823244

కరోనా కవిత

తృటిలో కత్తి వేటుకు తప్పించుకుని
పారిపోతున్న వాడిదో
అందని వాడిని చూసి నిట్టూర్చిన కత్తిదో

ఉవ్వెత్తున లేచి ఎగసి విరిగిపడుతున్న కెరటం కింద
నిస్సహాయంగా మునుగుతూ చూసిన వాడిదో
ముంచెత్తుతూ క్రూరంగా నవ్విన పడగవిప్పిన అలదో

విరిగిన బతుకు బండిని మోస్తూ
ఇంటి వైపు తిరిగిన పాదాల కూలిన కలలదో
వలస వలలను అల్లిన కనపడని చేతులదో

జీవితపు సాహససంద్రాన్ని దాటి
యాత్ర చివరన ఇంటి ముందే కుప్పకూలిన పసికళ్ళదో
ఆ పాదాలను పొదువుకోలేకపోయిన వారి గుండెలదో

తగలబడుతున్న నగరం ముందు కూచుని
వాయిద్య వినోదాన మునిగిన నియంతలదో
చూసి ఏమనలేక ఆక్రోశిస్తున్న దీనులదో

ఎవరిదీ చూపు?

◆

నేపథ్యంలో అక్కడ 'ఆశా'లు అత్యద్భుతమైన సేవలు అందించగలిగారు. అయితే, కేరళ ఉదాహరణ మొత్తం దేశంలో చాలా అరుదైనది. రాష్ట్రం లోని ఈ ఆరోగ్య కార్యకర్తలను సమగ్ర శిక్షణా విధానం ద్వారా ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థతో సమ్మిళితం చేయగలిగారు. నిఫా, కోవిడ్-19 మహమ్మారులను ఎదుర్కొనడంలో వారు కీలకమైన పాత్ర పోషించారు. దీర్ఘకాలిక ప్రాతిపదికన 'ఆశా'లకు కల్పించాల్సిన సామాజిక భద్రత, అందించాల్సిన రక్షణ పరికరాలు, శిక్షణకు సంబంధించి ఈ అనుభవం అనేక పాఠాలను అందిస్తుంది.

### పని-ఆదాయం మాయం

మూడవ అంశం-ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో మహిళలపై కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభ ప్రభావం గురించి చర్చించాలి. ఎటువంటి ముందస్తు ప్రణాళిక లేకుండా, ఏమాత్రం సంసిద్ధత లేకుండా విధించిన లాక్‌డౌన్ ఫలితంగా ఏర్పడిన మానవ సంక్షోభం...మహిళల పైన, వలస మహిళా కార్మికుల పైన దీర్ఘకాలిక ప్రభావానికి దారితీస్తుంది. ముఖ్యంగా వీరు పని, ఆదాయాలు కోల్పోతారు. ప్రజాస్వామిక ఉద్యమం నిరంతరం డిమాండ్లను లేవనెత్తుతూ, ఈ కార్మికులకు ఉపశమనం కల్పిస్తోంది. ఈ మహిళలకు సురక్షితమైన ప్రదేశాలలో మంచి జీవన సౌకర్యాలు, ప్రాథమిక అవసరాలను అందించే ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేయడం అత్యంత అవసరం.

మహమ్మారులు వ్యాపించిన వేళల్లో కూడా లింగ వివక్ష కొనసాగుతుంటుందని ఇతర అంశాలతో పాటు, పైన చర్చించుకున్న అంశాల వల్ల తెలుస్తోంది. వీటితో పాటు దృష్టి సారించాల్సిన మరో ఐదు అంశాలు వున్నాయి.

1) ప్రస్తుతమున్న అత్యవసర పరిస్థితులలో, అలాగే భవిష్యత్‌లో మహిళా వైద్యులు, నర్సులు, కమ్యూనిటీ వర్కర్ల అవసరాలను తీర్చగలిగే పథకాలను రూపొందించాలి. 2) పెరుగుతున్న గృహహింసను ఎదుర్కోవటానికి హెల్ప్‌లైన్లు, సురక్షితమైన గౌరవప్రదమైన ప్రత్యామ్నాయ వసతి, భద్రత భరోసాను కల్పించాలి. 3) అన్ని బెయిలవుట్ ప్యాకేజీలలో వేతన పరిహారం, ఉద్దీపనను అందించడం ద్వారా ఉద్యోగ, ఆదాయ భద్రత ఇవ్వాలి 4) అసంఘటిత, వలస మహిళా కార్మికులందరికీ పిల్లల సంరక్షణ, ప్రసూతి భత్యాలతో సహా సార్వత్రిక ఆహార సదుపాయం, సామాజిక భద్రత కల్పించాలి. 5) మహిళలపై ఎలాంటి జీతభత్యాలు లేని పని భారం పెరుగుదల నుంచి ఆదుకోవడానికి అత్యవసర వ్యవస్థ ఏర్పాటు చేయాలి. అంగన్‌వాడీ కార్మికులను క్రమబద్ధీకరించాలి. ఈ డిమాండ్ల కోసం పోరాటాలను తీవ్రతరం చేయడానికి ఈ పరీక్షా సమయాలు భూమిక అవుతాయి.

*(ప్రజాశక్తి దినపత్రిక ఏప్రిల్ 24)*

◆

## ఎంతెంత దూరం?

- యు. సోమకుమారి
9290463352

కరోనా కవిత

కాలాలు మారినా పాలకులు మారినా
మారనిదీ కూలీ బ్రతుకు
ఉన్న ఊళ్ళో ఉనికి లేక
పనికి పై ఊరు పయనిస్తే
'వలస కూలీ'లన్న బిరుదు ఇచ్చి
భరోసా లేని జీవితాన్నిచ్చారు
కరిగిన కొవ్వొత్తి తరహాలో
లోకానికి వెలుగునిచ్చి
తాము మాత్రం చీకటిలో మగ్గారు
ఈ శ్రామికవర్గం లేనినాడు
వజ్రాలున్నా వ్యర్థమేనని
ఎప్పుడర్థమౌతుందీ లోకానికి!
అన్ని రంగాలకూ అందమైన 'రంగవల్లు'లద్ది
తాము మాత్రం
కారు 'నలుపు'లో నిద్రించే వేళ
కరోనా కొరడా ఝుళిపించి
జీవితాలను ఛిద్రం చేస్తుంటే
తనవారి చివరి చూపైనా దక్కుతుందనే
దృఢ నిశ్చయంతో
ఎంతెంత దూరం? కాస్తంత దూరమంటూ
నడిచి నడిచి నడిరోడ్డే నట్టిల్లయి
ఫుట్‌పాత్‌లే పట్టుపరుపులుగా పడుతూ లేస్తూ
గుక్కెడు నీళ్ళ కోసం గుటకలు వేస్తూ
పయనిస్తున్న శ్రామికులను
గుర్తించలేని గుడ్డిదయిందా ఈ ప్రభుత్వం
రైతుకూలీ రౌద్రుడైతే రూకలున్నా నూకలుండవనే
నిజాన్ని గ్రహించి గౌరవించి గుడికట్టక్కర లేదు
దారి చూపించి జీవితాన్ని నిలబెట్టగలిగిన నాడు
మానవత్వం మొలకెత్తి మహావృక్షమై పరిమళిస్తుంది ◆

## తలుపు కొట్టిన చప్పుడు

- మయూఖ్ ఆదిత్య
9703670073

ఎవరూ అని పిలిస్తే బదులు రాలేదు
నిజానికి ఎవ్వరైనా కొట్టారా, లేక భ్రమేనా?
ఎడతెగని ఆలోచనలతో అలసిపోయిన
అస్తిత్వం
భ్రమించడం సహజమేమో!
మళ్ళీ వినిపిస్తే? ఈసారి తెరిచి చూడాలి
తీయకపోతే పోయేదేంటో తెలీదు గానీ,
తలుపు తెరిచాక
ఎవరూ లేకపోతే?
అమ్మో... నిజాలు ప్రమాదకరం!
అసలా తలుపెందుకు మూసాడని?
అయినా తెరిచినా
వచ్చేవారెవరూ
లేనపుడు, మూసేస్తే తప్పేముంది?
నిజం మాట్లాడుకోవాలంటే, వెళ్ళాలి
అనుకున్నవాళ్ళని ఏ తలుపూ ఆపలేదు
వెళ్ళి తీరతారు
ఏ అపరాత్రో, అర్థాంతరంగా!
ఆమె లాగా, ఆ అల్లరి లాగా
ఆ నవ్వు లాగా!
ఏదో ఒకటి వదిలే పోతారు,




ఒంటరితనాన్నో, దేన్నో, నన్నో!


తలుపు తెరిచినా బయటకి పోనంత
శూన్యం నిండాక,
తెరిచి మాత్రం ఏం చేస్తాం?
అందుకేనేమో ఆ తలుపు మూసి ఉంచాడు
కానీ ఏమూలో
తను తిరిగొస్తే?
వచ్చినా ఉండిపోతుందా??
అదైతే మేలేగానీ
ఆ మిగిల్చిన అనుభవ అవశేషాలేవో లాక్కెళ్ళిపోతే?
వద్దులే తియ్యద్దు...
కానీ మళ్ళీ అలికిడైతే?
అవ్వదులే, ఈ రాత్రి గడిచిపోతుంది? ఇన్నాళ్ళలానే!
అదుగో మళ్ళీ ఎవరో తలుపు కొడుతున్న చప్పుడు?
తలుపులు
మూసినంత తేలికగా
తలపులెందుకు
మూయలేమో? ◆

విశ్లేషణ

# స్ఫూర్తినిచ్చే కవితా స్రవంతి




స్ఫూర్తి




- కెంగార మోహన్
9000730403


జనం నాల్కల మీద పదికాలాలు పాడుకునేలా పాటకు జీవంపోసిన పాటగాడు.. కవితకు కూడా ఆయువు ఊది బతికిస్తున్నాడు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ప్రజాసమస్యలపై పోరాడే ఉద్యమకళాకారుడిగా పరిచితం. బాగా రాయాలి ప్రజల హృదయాల్లోకి వెళ్ళాలని చెప్పిన మాటలు నాకింకా గుర్తు. ప్రజా పోరాటాలెక్కడ జరిగినా అక్కడ వాలిపోయి తన పాటతోనో కవితతోనో అలరించే సాహితీ సంపన్నుడు..ఆ కవే స్ఫూర్తి..అతనంటే సాహితీలోకంలో తెలియని వారుండరు..ముఖ్యంగా సాహిత్య సాంస్కృతికోద్యమ కార్యకర్తలకు బాగా తెలిసిన వాడు. ఆయన కవిత్వం ఇటీవల చదివి నాలుగుమాటలు రాయాలనిపించింది..ఆ కవిత్వమే 'పాదముద్రలు'. విప్లవ సాహిత్యోద్యమం తెలంగాణా ప్రజా సాయుధ పోరాటంలోంచి వచ్చిందన్నది తెలిసిందే. అలా అలల్లా ఎగసిపడి, కవిత్వ ప్రవాహమై ఇలాంటి ఎంతో మంది కవుల్ని తెలుగు సాహిత్యానికి అందించింది. ఈ కవి సామాజిక సమస్యల్ని, రుగ్మతల్ని, ప్రజాపోరాటాల్ని పాటలుగా రాసి తనే ట్యూన్‌చేసి పాడే రచయిత. ఈ పాదముద్రల్లో కార్యకర్తలకు కర్తవ్యాన్ని నిర్ధేశించి స్ఫూర్తిని రగిల్చి కదనరంగంలోకి కార్యోన్ముఖుల్ని చేస్తాడు. అరుణారుణపతాకం గుండెను చీల్చుకుని ఎగరేస్తాడు.. ఈ కవిత్వం నిండా ఉన్న అక్షరాలన్నీ మనల్ని చిటికెన వేలు పట్టుకుని ఉద్యమం వైపు నడిపిస్తాయి.

*ఎవరు వాళ్ళు*
*ఇల్లు పిల్లలను వదిలేసి*
*అణగారిన జనం కోసం*
*ఆశల స్వప్నాలను మోసుకెలుతున్నవారు* అని

అంటూనే...కవిత చివరికొచ్చేసరికి

*వాళ్ళు....*
*నీటిమీద రాతలు రాస్తున్నవారు కాదు*
*రక్తాక్షరాలతో*
*నడిచిన దారులెంట*
*ప్రశ్నల పొద్దయి పొడుస్తున్నవారు*
*వారే...*
*మార్క్సిస్టు యోధులు!*
*పాదయాత్ర ధీరులు!!*
*ముందు యుగం దూతలు!!!* ఇంతటి సైద్ధాంతిక నిబద్ధత కలిగి రాయడం మార్క్సిజాన్ని గుండెల్లో పెట్టుకుని బతుకుతున్న వాళ్ళకే సాధ్యం..ఉద్యమం కోసం పోరాడేవారికి ఆకలి దప్పులు తెలీవు. పేదల కన్నీళ్ళు తుడిచేందుకు ఎన్ని పస్తులైనా ఉంటారు. బడుగుజనులకు అండగా నిలిచేందుకు ఎన్ని బాధలైనా ఆనందంగా భరిస్తారు. అన్నింటినీ త్యాగం చేసి ఉద్యమమే ఊపిరిగా బతుకుతారు. అందుకేనా వాళ్ళని ముందుయుగం దూతలన్నది. అలా చెప్పడం కవి దార్శనికతకు నిదర్శనం. ప్రశ్నలపొద్దై పొడవడం గొప్ప కవితాత్మక ఎత్తుగడగా తోస్తుంది. ఈ కవి సామాజిక అంతరాలు చెదిరిపోవాలంటాడు.

*ఇన్నేళ్ళు*
*కులాన్ని ముఖానికి తగిలించి*

*అణచివేతను ఆభరణాలుగా చేసి*
*మానసిక బానిసత్వానికి మనుషులనే*
*మరబొమ్మలుగా మల్చిన తీరును*
*పూలే పహారా కాస్తుంటే*
*అంబేద్కర్ చూపుడు వేలు సాక్షిగా*

***కమ్యూనిజం కంటి వెలుగులో***.. అంటాడు. అసమానతలు, కులం ఈ దేశం నుండి బహిష్కరింపబడితే తప్ప మనుషుల్ని మనుషులుగా చూడరనే బలమైన కాంక్షను రగిలిస్తాడు. అందుకే లాల్‌నీల్ జెండాలు ఏకం కావాలని అంటాడు. అందుకే ***ఎవరు వాళ్ళు/సామాజిక న్యాయమ్ముకై/ లాల్ నీల్ జెండాలను/ ఆకాశం నిండా ఎగరేసినవారు***..అని కవిత్వమై ఐక్యతా ఉద్యమాన్ని రగిలిస్తాడు. స్ఫూర్తి పాదముద్రలు చదువుతుంటే అప్పుడెప్పుడో చదివిన కె.శివారెడ్డి కవిత ***" మృగాన్ని వధించాలి/ అందుకే ఆయుధం తెచ్చుకో/ ఆయుధం లేకుండా యుద్ధానికి మాత్రం రాకు"*** అన్న మాటలే గుర్తుకు వస్తాయి. అలాంటి ఉద్యమ స్ఫూర్తిని చైతన్యాన్ని నరనరాల్లో నింపే ప్రయత్నం ఈ కవి ఈ కవిత్వంలో చేశాడు. ఈ పాదముద్రలు ముందుకు..మున్ముందుకు ఎర్రెర్రని కాంతిలో నడిచి నడిపిస్తూ మరోప్రపంచం కోసం పరితపిస్తూ సాగిస్తున్న పయనం. ఈ కవి సామాజిక న్యాయం కోసం అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాలని ఈ కవిత్వంలో బలంగా కాంక్షిస్తాడు. అందుకేనేమో..

*మట్టిమనషుల గాథలను*
*గానం చేస్తున్నవారు*
*కష్టజీవుల కన్నీళ్ళకు*
*జవాబుగా జెండాలెత్తిన వారు*
*మనువాదాన్ని మట్టుబెట్ట*
*మార్క్స్ పూలే అంబేద్కర్*
*అడుగులేస్తున్నవారు*

***నన్ను పట్టుకొని మాట్లాడుతున్నారు***..మట్టిమనుషులపై మమకారం, బడుగుజీవుల కన్నీళ్ళపై సానుభూతి, అణగారిన ప్రజలపై అవిభాజ్యమైన ప్రేమ ఈ కవిని సామాజిక న్యాయాన్ని కాంక్షించేలా సాధించేందుకు పోరాడేలా చేసిందనిపిస్తుంది. నడుస్తున్న దారిలో ముళ్ళున్నా..ముళ్ళలాంటి బంధాలు, బంధనాలు, సంకెళ్ళున్నా..ఎన్నో అవాంతరాలు అడ్డగించి నడకని ఆపాలని చూసినా ఈ పాదయాత్ర ఆగదు..ఆగని యాత్ర..అలసిపోని యాత్ర..అహర్నిశలు అలుపులేక సాగుతున్న యాత్ర.. ఈ యాత్ర ఎవరికోసం..? ఎందుకోసమని ప్రశ్నించుకుంటే మనకు లభించే జవాబు మాత్రం ఎగసిపడే కన్నీటి ధారల్ని ఆపేందుకన్నది స్పష్టంగా ఈ కవిత్వం చదివితే తెలుస్తుంది.

*పాదయాత్ర అంటే*
*ఊరికే నడవడం కాదు కదా!*
*ప్రజలతో సంభాషించడం*
*వారి సమస్యలతో కరచాలనం చేయడం*
*కారే కన్నీటికి కారణాలు చెపుతూ*

***మరో ప్రపంచానికి మార్గాలేయడం***.. ఇది తను కోరుకున్న పాదయాత్ర..అతనే కాదు ఉద్యమకారులందరూ కోరుకునే పాదయాత్రలివే..మార్క్సిస్ట్ కార్యకర్తలు పంచప్రాణాలు బిగపట్టి ఉక్కు సంకల్పంతో చేసే పాదయాత్రకు పంచభూతాలు సైతం మద్దత్తిచ్చి ఎర్రజెండా అందుకుంటాయి. ఈ కవి తన కవిత్వం ద్వారా నవనవాజం నిర్మించాలనుకుంటాడు. నవీన సమాజ నిర్మాణానికి కవిత్వాన్నే ఇటుకలుగా పేరుస్తున్నాడు. కవి పడే యాతన.. తపన..సామాజిక మార్పుకోసం తను చేస్తున్న పోరుకు ఈ కవిత్వం అద్దం పడుతుంది. అందుకేనా ఈ కవి..

*నీలాకాశంలో ఎగురుతున్న ఎర్రజెండా*
*చెదిరిపోయిన నక్షత్రాలను*
*గోరుకొయ్యలుగా కలిపి*

***పోరుబాట పట్టించింది***..కవి స్ఫూర్తి ఈ పాదముద్రలు కవిత్వాన్ని బడుగుజీవులకు అండగా నిలిచే ఎర్రజెండా బాట పట్టించాడు. ఈ కవిత్వం చదువుతున్నంత సేపూ ఆకాశమంతా ఎర్రజెండా ఎగరేసిన అనుభూతి కలుగుతుంది. ఈ కవిత్వం అభివ్యక్తి ప్రధానంగా సాగినట్టనిపించినా..సాదారణ..సరళమైన వాక్యాలుగా కవిత్వం కొనసాగుతున్నట్టు అనిపించినా మస్తిష్కక్షేత్రంలో శరవేగంగా కవిత్వమై మొలకెత్తుతాయి. ఈ కవిత్వం విప్లవబాట పట్టిస్తున్నట్టనిపించినా..ఈ కవిత్వం ఉద్యమపంథాలో నడిపిస్తున్నట్టనిపించినా ఈరాజ్యాన్ని పాలిస్తున్న మనువాదులను దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేస్తుంది.

***నరకబడ్డ శంభూకుడి తలసాక్షిగా/ మనువాదం ఊరేగుతూనే ఉంది/ అరికాళ్ళ నుండి శూద్రులు/ పుట్టారని అన్నప్పుడే***

***నరకాల్సింది కాళ్ళను, / పుట్టించిన మొండెం/ ఎలా***

# తల్లివేరు తలపులో

- దామరకుంట శంకరయ్య
9440876788

కరోనా కవిత

*అక్కడి పలకరింపులో జీవం*
*అక్కడి కలివిడి తనంలో లౌకికతత్వం*
*అక్కడి మనుషుల్లో మానవతా పరిమళం.*
*దేశాలెన్ని చుట్టినా!*
*పైచదువులు ఎంతదూరం నడిపించినా*
*పైరగాలికి తలలూపే పంటచేలు*
*లేత కొబ్బరి నీళ్ళవంటి తీయని వాగులు*
*అందమైన సూర్యోదయం*
*గోధూళి*
*మనసులో చెదరని చిత్రాలుగా.*

*బడి సోపతి గాల్లు*
*గుడి భజనలు*
*చెరువులో చేపపిల్లలా ఈత*
*అడవి పండ్ల యాది*
*పిల్లలకు పిట్ట కథలుగా*
*అమ్మ చీరసింగులు పట్టి నడిచిన ఇల్లు*
*నాన్న అడుగుల్ని అనుసరించి నేర్చిన ప్రకృతి పాఠం*
*ఉన్నతికి మూలమైన మూలం*
*కంటిమీద కునుకును*
*అప్పుడప్పుడు మాయం చేస్తుంది.*
*పుట్టిపెరిగినం కదా!*
*స్మరణకు రాకుండ ఉండలేం!!*
*ఎంతిష్టమో*
*బాల్యపు మడుగులో మునకేసి*
*తనివితీర తామర్లను తడమడమంటే.*
*ప్రపంచీకరణ మాయంచేసిన*
*ప్రతి దృశ్యం తైలవర్ణ చిత్రం.*
*మార్పు అనివార్యమైన సందర్భం*
*ఇంకా ఏమేం చూస్తామో!*

*నా ప్రయాణం నాకోసం మొదలై*
*మా కోసంగా మారింది.*
*వలస పోయిన కోయిల*
*వసంతంలో తిరిగొచ్చినట్టు.*
*ఉనికిని ఉగాది తోరణంలా*
*ఊరి గుమ్మానికి కట్టాలి.*
*వెళ్ళిరావాలి*
*గిట్టని ఆ నేలపైకి*
*పుట్టిన ఆ స్వర్గసీమకు* ◆

***బతికేదో తెల్సేది/ ఈనాటిదా ఈ అణచివేత/ ధర్మసూత్రాల ఏలుబడిలో/ మత సైనికుల పహారాలో/ ధర్మం పేరుతో అధర్మం రాజ్యం చేస్తుంటే / ఐదువేళ్ళని పోల్చి/ మనుషులంతా సమానం కాదని/ తప్పుడు నీతిని/ తలనిండా ఎక్కించిన కుట్ర మీది..*** నిజమే కదా ఈ రాజ్యం ఇప్పుడు మనువాదుల చేతుల్లో ఉంది. అందుకేనా ఈ కవి ప్రశ్న పదునెక్కాలంటాడు. ప్రజలకవసరమైనవేవి ఇవ్వకుండా..ఓట్లేసే యంత్రాలుగా ప్రజల్ని చూస్తున్న కపట రాజకీయపార్టీల వల్ల ఈ దేశానికి ముప్పుందనే సందేశం ఈ కవిత్వమిస్తుంది. ప్రజా పోరాటాలు బలమవ్వాల్సిందే అదే సందర్భంలో లాల్‌నీల్ ఏకమవ్వాలన్న సరికొత్త సైద్ధాంతికపోరాటానికి ఈ కవిత్వం ద్వారా తెరతీశాడు. సామాజిక నినాదాలే మీ విధి విధానాలన్నప్పుడే మాకు తెలుసు అణగారిన బతుకులన్ని ఆయుధాలవుతాయని లాల్‌నీల్ జెండాలే సమరానికి సారథులన్నప్పుడే మాకు తెలుసు ఆశయాల దారుల్లో కొత్తకాగడాలై వెలుగుతాయని..ఇది కవి కోరుకున్న రాజ్యం..ఈ రాజ్యం రావాలంటే ఖచ్చితంగా మన జెండా అజెండా..మనయాత్ర..మన పాదయాత్ర..మన అడుగులు మన పాదముద్రలు వెలుతురు దారుల్లో నడవాలి. మనం కోరుకున్న ఆ జెండాలపోరాటాలే అసమానతల్ని అంతం చేసేది.. ఆ పతాకాల ఉద్యమాలే అంతరాలను చెరిపేసి..అన్నార్థులకు అండగా నిలిచేది..అందుకే ఈ కవిత్వం ఉద్యమబాట పట్టిస్తుంది. కదనరంగంలో పోరాడేలా కార్యోన్ముఖుల్ని చేస్తుంది. ◆

# కవిత

## కొత్తపాఠం

ఈతకోట సుబ్బారావు
9440529785

కరోనా కవిత

పాదుల నిండా శ్వాసల ఛాయలు
పొదలమాటున నిశ్వాస జాడలు
నేలతల్లి ఆగ్రహం
ప్రకృతి కరాళ నృత్యం
వెరసి చిన్నా భిన్నమై
చెల్లాచెదురైన గులాబీ తోట
భారత్ గుండెనిండా
ఎన్ని ముళ్ళ గులాబీలు.

♦

భూమాతా!
ఈ జన్మకేమి కావాలి
బుక్కెడు బువ్వ
జానెడు జాగా
రెల్లు గడ్డి గుడిసె
భారత్ బంతి తోట
బీటలు బారింది.

♦

కాందిశీకుల మయ్యాము
పరదేశస్తుల్లా
బిక్కుబిక్కు మంటున్నాం
ఇక కూలడానికి
రాలడానికి
జీవించటానికి
ఇక్కడ బతుకులు మిగలడం లేదు
ఈ శిధిలాలు
ఈ కళేబరాలు
ప్రపంచ పంజరం
గాయాల పాలైంది.

♦

సూక్ష్మజీవి ఆశీస్సులతో
ఊరి బయట క్షేమంగా ఉన్నాము
ప్రకృతికి చేసిన పాపంతో
పొలిమేరల్లో పహారా కాస్తున్నాం
స్మశానం నిశ్శబ్దానికి .
శిధిల వర్గానికి
ప్రతీకలుగా నిలుచున్నాం
నాలుగు గోడల నడికప్పున
శానిటైజర్ పట్టుకొని
యుద్ధం చేస్తున్నాము.

♦

చేతులు శుభ్రపరచుకోవడానికి
మిగిల్చిన ఈ ఈ రెండు చేతులే
కరోనా చిలకకు ప్రాణ గండం.

♦

దేశవిదేశాల్లో
మునక లేసినందుకు
పాపాల మచ్చల్లా మిగిలి ఉన్నాయి.
ఈ ప్రభుత్వ దవాఖానాలు మాత్రం
పవిత్రంగా అక్కున చేర్చుకుంటున్నాయి.

♦

ఈ మృతుల సంఖ్య
లక్ష రెండు లక్షలా
కాకి లెక్కలు అధికారులు నొక్కులు
పోటాపోటీగా
ప్రపంచ వాకిట ముందు
నిలువెత్తు చిలక ప్రశ్న .

♦

దేశం నిండా
ఉచిత జనాభా ఏమయిందో
రైళ్లు బస్సులు సినిమాలు
పబ్బులు క్లబ్బులు బోసిపోయాయి
బాధితు లెవరో
బాధాతప్త హృదయాలెవరో!
మర్మమైన మనుషులు
మలినమంటిస్తున్న వైరసులు.
సూక్ష్మ జీవాల కింద
ఇంకా నలుగుతున్న
బ్రతికున్న శవాలు
ప్రవేటు వైద్యుల కాసుల
ఖజానాలు
పక్కున నవ్వు కుంటున్నాయి
ఈ మానవుల ప్రకృతి
వైపరీత్యానికి
పోటీకి దోపిడీ కు
మృగాల్లాంటి గబ్బిలాళ్ల
ఆలోచనలకు
దేశ మాత కంఠానా
చెదిరిన కరోనా దుఃఖహారం.
రండి.. భారతీయులారా
రండి మానవతావాదులరా
రెండు చేతులకు పని పెడదాం
నాలుగు గోడల మధ్య నిశ్శబ్ద
యుద్ధం చేద్దాం
రండి ఓపిక ఓర్పులను చేపడతాం
తలా కొంత భారం పంచుకుందాం
కరోనాను కొనగోటితో తరిమేద్దాం
పాఠాలుగా వారసులకు చెబుదాం ♦

కథ



# సంకల్పం

- వల్లూరు శివప్రసాద్
92915 30714

ఆ ప్రాంతమంతా ఆకాశంలో కారుమేఘాలు కమ్ముకొంటున్నాయి. గాఢాంధకారం అలముకొంటున్నది. ఒక పెద్ద అఘాతం. దానికేసి వరుసలుగా ట్రక్కులు భారంగా కదులుతున్నాయి. జనం ఆ ట్రక్కుల వెంటపడి పరుగులు తీస్తూ గుండెలు అవిసేలా రోదిస్తున్నారు.

అగాధం అంచున నిలువెల్లా తెల్లని మాస్కులు ధరించిన సైనికులు నిలబడి ట్రక్కుల్ని వెనుకకు తిప్పించి, డోర్స్ అన్‌లాక్ చేసి, లోపల వున్న మూటల్ని కిందకు జారవిడుస్తున్నారు. ఆ మూటల్లో వున్నది నిర్జీవమైన మనుషుల శరీరాలు. అన్‌లోడ్ చేసిన ట్రక్కులు వెనుదిరిగి వెళ్ళిపోతుంటే ఆ స్థానంలో మరో ట్రక్కు వచ్చి చేరుతున్నది.

జనం హాహాకారాలతో, రోదనలతో ఆ కొండలు ప్రతిధ్వనిస్తున్నాయి. మతిస్థిమితం తప్పిన కొందరు ప్రాణాలతో అగాధంలోకి దూకేస్తున్నారు. వాళ్ళను నిలువరించటానికి సైనికులు వ్యర్థ ప్రయత్నాలు చేస్తున్నారు. జనం అగాధం వైపు రాకుండా కట్టడి చేయడానికి టియర్‌గ్యాస్ వదులుతున్నారు.

ఆ బీభత్స భయానక దృశ్యాల్ని చూస్తూ ప్రాణాలను అరచేత్తో పట్టుకొని భయం భయంగా నడుస్తున్నది డాక్టర్ రేణుక. మానవ మేధ వైఫల్యానికి, పరాజయానికి ఋజువుగా అగాధంలోకి గుట్టలు గుట్టలుగా పడిపోతున్న శవాలను చూస్తుంటే రేణుక హృదయం ద్రవించిపోతోంది. శాస్త్రీయంగా, వైజ్ఞానికంగా, సాంకేతికంగా పురోగమిస్తూ ప్రకృతిపై ఆధిపత్యాన్ని సాధించానని ఇంతకాలం విర్రవీగుతున్న మనిషికి తానెంత అల్పుడనన్న దానికి దృష్టాంతం ఇంతకన్నా ఏముంటుంది?

అగాధం అంచున నిలచి శిలలా స్తంభించిపోయిన తనను ఒక్కసారిగా వెనకనుంచి ఎవరో తోసేశారు. 'కెవ్వున' ప్రాణభయంతో అరుస్తూ అంతులేని అగాధంలోకి జారిపోసాగింది.

'నో... నో' అంటూ బిగ్గరగా అరుస్తూ బెడ్‌మీదనుంచి తుళ్ళిపడి లేచిన డాక్టర్ రేణుక దగ్గరకు ఒక నర్స్ పరుగెత్తుకొచ్చింది.

"మేడమ్! మేడమ్! వాట్ హేపెండ్!" అంటూ పట్టుకొని ఆశ్చర్యంగా, భయంగా అడుగుతున్న సిస్టర్ మాటలకు ఈ లోకంలోకి వచ్చింది రేణుక.

పెద్ద హాలు. వెలుగుతున్న లైటు. రెండు వరుసలుగా బెడ్స్, వాటిమీద పడుకుని వున్న మనుషులు, డ్యూటీ నర్సులు చూస్తూనే తనెక్కడున్నానో గ్రహించింది రేణుక.

ఒక నిమిషానికి తేరుకుంది. భయంతో చెమటలు పట్టాయి. తీవ్రంగా కొట్టుకుంటున్న గుండె అదుపులోకి వస్తున్నది. తను కన్న పీడకల నుంచి వాస్తవంలోకి రావడానికి మరికొంత సమయం పట్టింది.

"మేడమ్ మంచినీళ్ళు" సిస్టర్ అందించిన మంచినీళ్ళు

గటగటా తాగేసి, ఖాళీ గ్లాసు తిరిగిచ్చేసింది.

"ఛీ... ఛీ... ఏదో పీడకల" సణుగుతుంటే సిస్టర్ ముసిముసిగా నవ్వుతోంది.

గోడ గడియారం తెల్లవారురఝాము నాలుగున్నర అయినట్లుగా చూపుతోంది. హమ్మయ్య పదిరోజులు గడిచాయి. ఇంకా నాలుగే రోజులు అనుకొన్నది రిలాక్స్‌డ్‌గా!

ఊపిరి సలపని పనులతో, గంటలు, రోజులు చకచకా గడిచిపోతుంటే కాలం గిర్రున తిరిగిపోతుందే అన్న స్థితి నుండి ఇప్పుడొక విపత్కర పరిస్థితి. కాలం ఏమాత్రం గడవటం లేదన్నట్లు నిమిష నిమిషాన్ని లెక్కించుకొంటూ భారంగా రోజులు నెట్టుకొస్తున్న దుస్థితి.

నెలక్రితం నాటి పరిస్థితుల్ని బేరీజు వేసుకొంటుంటే ఆశ్చర్యం! అపనమ్మకం! ఆందోళన! అశాంతి! బంధిఖానాను తలపింపచేస్తున్న భయానక వాతావరణం!

ఎవరూ ఊహించనిది! ఎవరూ కోరుకోనిది! ప్రపంచం విలవిల్లాడుతోంది. జనజీవనం అస్తవ్యస్థమైంది. ఆరోగ్య, ఆర్థిక వ్యవస్థలన్నీ తలక్రిందులై పోయాయి. సామాన్యులు, అసామాన్యులు, యువరాణులు, దేశాధినేతలు సైతం ప్రాణభయంతో గజగజ వణికిపోతున్న దారుణం. మిన్ను విరిగి మీదపడుతున్నట్లు పరిస్థితులు చకచకా మారిపోయాయి.

2020 మార్చి 1నాటికి ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు లక్షన్నర పైబడ్డాయి. ఆరువేల మంది మరణించారు. ఇటలీ, స్పెయిన్‌లలో కరోనా విజృంభించింది.

11 మార్చిన కరోనా వైరస్‌ను ప్రపంచ మహమ్మారిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.

ప్రపంచం ఒక్కసారిగా ఉలికిపాటుకు గురైంది. కరోనా కేసులు ప్రపంచవ్యాప్తంగా రెండు లక్షలకు చేరువైనాయి. భారత్‌కు వచ్చే విమానాలు రద్దు.

భారత ప్రధాని మార్చి 22న జనతా కర్ఫ్యూ ప్రకటించారు. ఇళ్ళలోంచి ఎవరూ బయటకు రావద్దని విజ్ఞప్తి. దాంతో సాధారణ పౌరులకు కరోనా గురించిన తీవ్రతను తెలియజేసినట్లయింది.

చైనాతో పాటు అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇటలీ, ఇరాన్ దేశాల ప్రజల ఆరోగ్య పరిస్థితులు దారుణంగా దెబ్బతిన్నాయి.

మార్చి 24 నాటికి ప్రపంచంలో కరోనా కేసులు నాలుగు లక్షలకు చేరువయ్యాయి. పదిహేడువేల మరణాలు సంభవించాయి. మనదేశంలో కరోనా కేసులు ఐదువందలు దాటాయి. వ్యాధిపట్ల ఉపేక్షతాభావం పనికిరాదని దేశం గుర్తించింది.

మార్చి 24 అర్ధరాత్రి నుంచి ఇరవై ఒక్క రోజులు దేశంలో లాక్‌డౌన్ ప్రకటించింది. ప్రజలు సామాజిక దూరం పాటించాలని, ఇల్లు దాటి వీధుల్లోకి రాకూడదని ప్రభుత్వం ఆంక్షలు విధించింది. పోలీసు యంత్రాంగం ప్రజల ఆరోగ్య సంరక్షణకు నడుం బిగించింది.

'మిమ్మల్ని, మీ కుటుంబ సభ్యుల్ని, స్నేహితుల్ని, దేశం మొత్తాన్ని కష్టాల్లోకి నెట్టేసే ప్రమాదం. నిబంధనల్ని అతిక్రమిస్తే యావద్దేశం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. సామాజిక దూరం తప్పక పాటించాలి' ప్రధానమంత్రి చేతులు జోడించి సందేశమిచ్చారు.

రాష్ట్రంలోనూ కేసులు బయటపడటంతో రాష్ట్రప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టింది. రాష్ట్ర సరిహద్దుల్ని మూసివేసింది. వైద్యరంగాన్ని అప్రమత్తం చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, నర్సులు అంకితభావంతో విధి నిర్వహణ చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులు తమవంతు సహకారమందిస్తున్నారు.

జిల్లాకేంద్రంలోని ఒక ప్రభుత్వ హాస్పిటల్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ రేణుక దేశవిదేశాల్లో జరుగుతున్న ఈ పరిణామాలన్నింటిని అవగాహన చేసుకొన్నది. మార్చి రెండవ వారంలో తండ్రి హఠాన్మరణం చెందటంతో వారం రోజులు సెలవు పెట్టింది.

జనతా కర్ఫ్యూ నాటికి పెట్టిన శెలవు పూర్తయింది.

"రేణూ! కొంతకాలం సెలవు పొడిగిస్తే మంచిదేమో! ఎందుకొచ్చిన తలనొప్పి, సిచ్యుయేషన్ బ్యాడ్‌గా వున్నట్టుంది" సుదర్శన్ సలహా ఇచ్చాడు.

"ఇలాంటి పరిస్థితుల్లోనే ప్రజలకు డాక్టర్ల అవసరం ఎంతైనా వుంటుంది"

"కావచ్చు! కానీ కరోనా ఒక అంటువ్యాధి అంటున్నారు... తెలిసీ రిస్క్ ఎందుకు పేస్ చెయ్యడం?"

"రిస్క్ అనేది ఏ రూపంలోనైనా వుండొచ్చు, డిసీజ్ రూపంలోనే రావాలనెక్కడుంది?"

సుదర్శన్ హైకోర్ట్ లాయర్. వాదనలో ఎదుటి పక్షాన్ని కట్టడి చేయటంలో తగిన నైపుణ్యాన్ని ప్రదర్శించగలడు.

"ఫేట్‌ని నమ్ముతానంటావు?"

"నో, ఫైటింగ్ యగ్నెస్ట్ సిచ్యుయేషన్. ఒక పేషంట్ ప్రాణాలు పోతాయని తెలిసినా, ఆఖరి క్షణం వరకు పోరాటం చెయ్యటం మా విద్యుక్త ధర్మం"

"ప్రాక్టికల్‌గా ఆలోచించమంటున్నాను, పోరాటానికి తగిన ఆయుధాలు ఇవ్వకుండానే విజయాలు సాధించాలని ఆదేశాలిచ్చే మహామహులకు మన దేశంలో కొరత లేదు" సుదర్శన్ మాటల్లో నిరసన ధ్వనించింది.

"అది సామాజికవేత్తలు ఆలోచించాల్సిన విషయాలు. వైద్యశాస్త్రంలో నూతన ఆవిష్కరణల కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన మహానుభావులెందరో వున్నారండీ!"

"మనం సామాన్యులం రేణుకా!"

"కావచ్చు. అంత గొప్ప త్యాగాలు చేసే శక్తి సామర్థ్యాలు నాబోటివాళ్ళకు లేకపోవచ్చు. ఈ వృత్తిలో వాళ్లను స్ఫూర్తిగా తీసుకొని పనిచెయ్యటం విధిగా భావిస్తాను."

"నా బాధను నువ్వు అర్థం చేసుకోవటం లేదు. నా భార్యగా, సింధు తల్లిగా నీ ఆరోగ్యం మాకు ముఖ్యం"

"మనందరి ఆరోగ్యాలు సామాజిక ఆరోగ్యంతో ముడిపడే వున్నాయి. దాన్ని కాపాడటంలో నాలాంటి డాక్టర్ల అవసరం ఎంతో వుంది. మనకు మనం ముఖ్యం అనుకోవటం సంకుచితం కాదా?"

కొద్దిసేపు సుదర్శన్ ఏమీ మాట్లాడలేకపోయాడు.

"ఓ.కె. నీతో ఏకీభవించకుండా వుండలేను. ఈ పోరాటం అందరూ కలిసి చేయాల్సిందే. గెలుపు సాధించాల్సిందే" డాక్టర్ రేణుకను ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు.

మర్నాడే డాక్టర్ రేణుక డ్యూటీలో జాయినయింది.

"వెల్‌డన్! లీవులో వున్న స్టాఫ్‌నంతా డ్యూటీలో జాయినవ్వాలని నోటీసులు పంపుతున్నాం. ఆ అవసరం లేకుండానే డ్యూటీలో జాయినయ్యారు" చిరునవ్వు నవ్వాడు హాస్పిటల్ చీఫ్.

"ఇప్పటికే లేట్ అయ్యానేమో సర్!" నవ్వింది డాక్టర్ రేణుక.

"నో.... నో... ఏ పరిస్థితుల్లో మీరు లీవ్‌లో వెళ్ళింది నాకు తెలుసు. మీ బాధ్యతను మీరు సక్రమంగానే గుర్తించారు" ప్రశంసిస్తూ జాయినింగ్ రిపోర్ట్ మీద సంతకం పెట్టాడు చీఫ్.

"డాక్టర్ కోవిడ్-19 వైరస్ గురించి, దాని విజృంభణ గురించిన సమాచారం మీరు గమనిస్తూనే వున్నారనుకుంటాను. రోజురోజుకీ విపత్కర పరిస్థితుల్ని మనం పేస్ చేయాల్సి రావచ్చు. ప్రజల్ని చైతన్యపర్చటం, కరోనా వ్యాప్తిని నిరోధించటం ప్రధానం. అందుకు ఇతర ప్రభుత్వ యంత్రాంగం కూడా మనకు సహకరిస్తున్నది. తక్కువ మరణాలతో ఈ మహమ్మారిని తరిమికొట్టడం మనకో పెద్ద సవాలు. అంతదాకా మనకు విశ్రాంతి లేదనుకోవాలి" దృఢంగా చెప్పాడు హాస్పిటల్ చీఫ్.

"ఇట్సాల్ రైట్ సర్! ఈ క్షణం నుంచే ఆ టార్గెట్ దిశగా పని మొదలెడ్తాను" చీఫ్ దగ్గర శెలవు తీసుకొని రేణుక వార్డులోనికి నడిచింది.

◆◆◆

ఒక్కసారి లాక్‌డౌన్ ప్రకటనతో దేశంలో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది.

రహదారుల దిగ్బంధనతో ఇతర రాష్ట్రాల్లో, జిల్లాల్లో నిలిచిపోయిన చిరుద్యోగులు, విద్యార్థులు, వలస కార్మికులు స్వస్థలాలకు చేరుకునే దారిలేక కష్టాల పాలయ్యారు. నిరసనలు, వేడుకోలులు వెల్లువెత్తాయి. ఎక్కడివారక్కడే వుండమంటూ నిర్బంధాలు విధించారు.

షాపులు, సినిమాహాళ్ళు, ప్రయాణాలు, విందులు, వినోదాలు, మాల్స్ అన్నీ బంధయ్యాయి. కూరగాయలు, పాలు, పండ్లు లాంటి నిత్యావసర వస్తువుల లభ్యతకు కొంత వెసులుబాటు వచ్చింది. ప్రజలు గుమిగూడకుండా భౌతికదూరం పాటించాలంది. ప్రజల కదలికలను పోలీసుల సాయంతో కట్టడి చేయసాగింది.

ప్రైవేటు హాస్పిటల్స్‌లో వైద్యం చేయటానికి వైద్యులు సైతం భయాందోళనలకు లోనవుతున్నారు. కరోనా అనుమానిత కేసుల్ని ట్రీట్ చేసే ఉపకరణాలు తమవద్ద లేవంటూ చికిత్స చేయటానికి ముందుకు రావడం లేదు.

కరోనా కేసుల చికిత్స, అనుమానితుల పరీక్షలు, సంరక్షణ బాధ్యతలన్నీ ప్రభుత్వమే స్వీకరించాల్సి వచ్చింది. ప్రభుత్వ హాస్పిటల్స్ రకరకాల రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ నిద్రాహారాలు లేకుండా డ్యూటీలు చెయ్యాల్సి వస్తోంది. స్వీయరక్షణ చేసుకుంటూ చికిత్స చేయడం కత్తిమీద సాములా తయారైంది.

డ్యూటీలకు ఒకవేళంటూ పాటించే పరిస్థితి లేదు.

డాక్టర్ రేణుక ఇంటికన్నా హాస్పిటల్‌లోనే ఎక్కువ వుండాల్సి వస్తున్నది. ఇంటికి వస్తూనే ధరించిన బట్టలన్నీ తీసేసి, వాష్ చేసుకొని స్నానం చేసి, బట్టలు మార్చుకొని గాని కుటుంబసభ్యులతో కూర్చోలేకపోతుంది.

కుటుంబ సభ్యుల్ని తాకాలంటే భయం. వారితో మాట్లాడాలంటే భయం. వారితో కలిసి తినాలంటే భయం. ఇంట్లో వుంటే సింధుకి స్నానం చేయించటం, ఆడించటం, అన్నం తినిపించటం అన్నీ తానే చేసేది. సింధుని ప్రేమగా, దగ్గరగా తీసుకోవాలన్నా, మురిపాలకు, ముద్దుముచ్చట్లకు ఏమైనా తినిపించాలన్నా సాహసించలేకపోతున్నది. దూరం దూరంగానే కూతుర్ని వుంచుతున్నది. పరిస్థితుల్ని అర్థం చేసుకోలేని ఐదేళ్ళ వయసు సింధుది.

రాత్రుళ్ళు కథలు చెప్పించుకుంటూ, ముద్దు ముద్దుగా ఎన్నెన్నో కబుర్లు చెప్పించుకుంటూ, కౌగిలిలో ఇముడ్చుకుని నిద్రపుచ్చే తల్లి ఒంటరిగా హాల్లో దివాన్‌కాట్‌మీద నిద్రపోవటం సింధుకి నచ్చటంలేదు.

ఉదయం లేచేసరికి తల్లి కనబడటం లేదు. తండ్రే సింధుకి స్నానం చేయించటం, బట్టలు మార్చటం, ఆడించటం, అన్నం తినిపించడం జరుగుతోంది.

"నాన్నా! అమ్మ ఎందుకలా వుంటుంది? రోజూ తనే స్నానం చేయించేది, అన్నం పెట్టేది, రాత్రి కథలు చెప్పేది, నిద్ర పుచ్చేది..." సింధు గొంతులో దుఃఖం.

"అమ్మ డాక్టర్ కదా! కొన్నాళ్ళు బాగా బిజీగా వుంటుంది. చాలామందికి ఒంట్లో బాగాలేదంట. వాళ్ళందరికీ ట్రీట్‌మెంట్ చెయ్యాలిగా!" అంటూ బుజ్జగించి చెప్తున్నాడు సుదర్శన్.

"ఎన్నాళ్ళిలా రేణూ!" అడిగాడొక రోజు.

"ఏమో! వారాలు... నెలలు కూడా కావచ్చు. రోజురోజుకీ కేసులు పెరుగుతున్నాయి" రేణుక సమాధానం.

"మనకు మనమే అంటరానివాళ్ళమై బ్రతకాల్సి వస్తోంది" నవ్వలేక నవ్వాడు సుదర్శన్.

"నౌ వి హ్యూమన్ బీయింగ్స్ ఆర్ డిసీజ్ కేరియర్స్, లైక్ సో యానిమల్స్, ఒకరికొకరు దూరం పాటించడమే సేఫ్టీ" నవ్వింది డాక్టర్ రేణుక.

రోజురోజుకు జిల్లాలో కేసుల సంఖ్య బయటపడసాగింది. దేశవిదేశాలనుండి వచ్చినవారి ద్వారా వైరస్ సోకుతుందని ప్రభుత్వం గుర్తించింది. అనుమానితుల్ని క్వారంటైన్ సెంటర్లలో వుంచి పరీక్షించటం మొదలైంది. పరీక్షల ద్వారా పెరుగుతున్న కేసుల సంఖ్య ఆందోళన కలిగించసాగింది.

ప్రభుత్వం ప్రజల కదలికలను కఠినంగా నియంత్రిస్తూ నివారణ చర్యల్ని ముమ్మరం చేసింది. వ్యాధి గురించిన సరైన అవగాహన లేకుండా, బాధ్యత లేకుండా, నిబంధనల్ని ఖాతరు చేయకుండా నిర్లక్ష్యంగా తిరుగుతున్న ఆకతాయిలకు పోలీసు లాఠీ దెబ్బలు తప్పడం లేదు.

వలస కార్మికులు గూటికి, కూటికి వాసిపోతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాయకష్టం చేసుకుని బ్రతికే కూలీలకు అరకొరగా సహాయక చర్యలు చేపట్టాయి. కార్మికులు దిక్కుమొక్కూ లేని పరిస్థితుల్లో వేలాది కిలోమీటర్లు ప్రయాణానికి సిద్ధపడి, స్వగ్రామాలకు చేరుకోవాలని రోడ్లబాట పట్టారు.

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా కూరగాయల ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి లబ్ది పొందజూస్తున్న చిన్న పెద్ద వ్యాపారులను కేసులు పెట్టి శిక్షిస్తామని అధికారులు హెచ్చరించాల్సి వచ్చింది.

ఏప్రిల్ 14 దగ్గర పడుతుంది. ప్రపంచ దేశాల్లో కరోనా మరణ మృదంగం మోగిస్తోంది. అమెరికా, ఇటలీ, బ్రిటన్ దేశాలు వ్యాధి నియంత్రణకు నానా తంటాలు పడుతున్నాయి.

అమెరికాలో వేలాది మరణాలు నమోదవుతున్నాయి. శవాల ఖననం పెద్ద సమస్యగా తయారైంది. కన్నీటితో అంతిమ వీడ్కోలు పలికే బంధుమిత్రులు కానరావడం లేదు. చావు భయంతో వణికిపోతున్నారంతా.

అలాంటి విపత్కర పరిస్థితి మన దేశానికి రాకూడదన్న కృతనిశ్చయంతో కేంద్రప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దేశంలో దారుణ మరణాలు సంభవించకున్నా కేసులు పెరుగుతూ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

రాష్ట్రంలోను కేసులు క్రమంగా వెలుగులోకి వస్తున్నాయి. కరోనా బాధితుల సంఖ్య పెరుగుతూ మరణాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. కరోనా సహాయక చర్యల నిమిత్తం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ రంగాల ప్రముఖులు, వ్యాపార సంస్థలు విరాళాలు అందజేస్తున్నాయి. పేద కుటుంబాలను ఆదుకొంటూ స్వచ్ఛంద సేవాసంస్థలు మానవత్వాన్ని చాటు కొంటున్నాయి

వైద్య సేవల నిమిత్తం హాస్పిటల్‌కు వస్తున్నవారిలో ఎవరు పాజిటివో, ఎవరు నెగెటివో తెలియని విషయం. ప్రభుత్వం అనుమానితులను తీసుకువచ్చి పరీక్షలు చేస్తుండటంతో ఒక్కో కేసు బయట పడుతున్నది. పాజిటివ్ వచ్చినవారి కుటుంబీకుల్ని, సన్నిహితుల్ని క్వారంటైన్‌కు తరలిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో డాక్టర్ రేణుక ఇంటికి వెళ్ళడానికే సంశయిస్తున్నది. కుటుంబీకులతో సన్నిహితంగా మెలగటం శ్రేయస్కరం కాదనిపించింది. లాక్‌డౌన్ ముగిసేదాకా హాస్పిటల్‌లోనే వుండటానికి నిర్ణయించుకొన్నది.

"సింధు గోల పెట్టేస్తుందేమో రేణుకా?" సుదర్శన్ సందేహం వెలిబుచ్చాడు.

"తప్పదు, ఏదైనా అనర్థం జరిగితే నావరకే పరిమితం కావాలి" చెప్పింది రేణుక.

ఏం మాట్లాడలేకపోయాడు సుదర్శన్.

రేణుక ఇంటికి రావడం మానేసిన మరుసటిరోజు నుంచే సింధు గొడవ మొదలెట్టింది.

"అమ్మెందుకు ఇంటికి రాదు? ఎక్కడికెళ్ళింది? ఎప్పుడొస్తుంది?" ఇలా రకరకాల ప్రశ్నలతో వేధించడం మొదలెట్టింది.

సుదర్శన్ ఎన్ని విధాలు చెప్పినా సింధు గ్రహించలేకపోతున్నది. రకరకాల అనుమానాలు, సందేహాలు వ్యక్తం చేస్తున్నది. ఇరవై నాలుగ్గంటలూ ఇంటిపట్టునే వుంటున్న సుదర్శన్ మాత్రం ఎన్నిసార్లు చెప్పిందే చెప్పి సముదాయించగలడు?

"రేణుకా! ఇదిగో నీ కూతురికి నువ్వే సమాధానం చెప్పు, నావల్ల కావటం లేదు" ఫోన్ చేతికిచ్చాడు.

"అమ్మా! తల్లీ! నేనెక్కడికీ వెళ్ళలేదమ్మా! ఇక్కడే... ఈ వూళ్ళోనే వున్నాను. నాన్నను విసిగించకు. నాన్నా, నువ్వూ ఆడుకోండి, కార్టూన్ ఫిల్మ్స్ చూడండి" రకరకాలుగా బుజ్జగించ ప్రయత్నించింది.

ఆ ప్రభావంతో కొద్దిసేపు తల్లిగురించిన దిగులు మర్చిపోగలుగుతుంది సింధు. ఉదయానికి మళ్ళీ మొదలు. వేళకు తినటం, పడుకోవటం లేదు. తనలో తాను కుమిలిపోతున్నది. కళ్లు కన్నీటి కాల్వల్లా ప్రవహిస్తున్నాయి.

ఒంటరితనం, కూతురలా వుండటం సుదర్శన్‌కి కష్టంగా వుంది. దూరంగా పల్లెల్లో ఎక్కడో వుంటున్న తల్లిదండ్రుల్నో, అత్తమామల్నో రప్పించాలన్నా లాక్‌డౌన్ కారణంగా సాధ్యం కాదు.

హాస్పిటల్లో అనుమానితుడిగా వుంచి, వైద్యం చేస్తూ పరీక్షలు చేసిన ఒక వ్యక్తికి కరోనా పాజిటివ్‌గా బయటపడింది. ఆ పేషెంట్‌కి చికిత్స చేసిన రేణుక, ఇతర స్టాఫ్ నర్సులూ క్వారంటైన్ సెంటర్‌కి తరలించబడ్డారు. అందరికీ కరోనా టెస్ట్ చేశారు. అదృష్టవశాత్తూ అందరికీ నెగెటివ్ వచ్చింది. అయినా రెండు వారాలు అక్కడ వుండాల్సిందే.

సెల్‌ఫోన్ రింగయింది. ఉలికిపాటుగా రేణుక ఫోన్ చేతిలోకి తీసుకుంది. సుదర్శన్ గొంతు 'హలో' అంటూ పలకరించింది.

"ఆఁ! చెప్పండి! సింధు ఎలా వుంది?"

"నేనూ, సింధు బయట నిలబడున్నాం."

డాక్టర్ రేణుక గుండె దడదడ కొట్టుకుంది.

"వాట్! ఇక్కడికొచ్చారా? ఈ పరిస్థితుల్లో..." ఆశ్చర్యంగా అడిగింది.

"అయినా తప్పలేదు, సింధు డిప్రెషన్‌కి లోనవుతోంది. ఒక్కసారి నిన్ను చూపించి తీసుకెళ్దామని వచ్చాను" డల్‌గా ధ్వనించింది సుదర్శన్ స్వరం.

"ఓ.కె. ఇట్సాల్ రైట్!" డాక్టర్ రేణుక గొంతు జీరబోయింది.

ఫోన్ కట్ చేసి, బెడ్‌మీద పడేసి, రూంలోంచి బయటకు నడిచి గేటుముందుకొచ్చి నిలబడింది. రోడ్డు కవతల నిలబడున్న టూవీలర్ మీద కూర్చుని వున్న సింధు తల్లిని చూస్తూనే, "అమ్మా! అమ్మా!" అంటూ రమ్మని చేతులూపుతోంది.

డాక్టర్ రేణుకకు దుఃఖం ముంచుకొచ్చింది.

ఒక్కసారి రోడ్డుకడ్డం పడి పరిగెత్తుకెళ్ళి కూతుర్ని కౌగిలించుకోవాలన్న ఆరాటంతో రెండడుగులు వేసింది.

ఒక్కసారిగా ఎవరో సంకెళ్లు వేసి వెనక్కు లాగినట్లుగా అదాటుగా నిలబడిపోయింది.

"అమ్మా రా అమ్మా! రా! రా!" అంటూ ఏడుస్తూ చేతులూపుతున్న కూతుర్ని చూస్తూ, నిస్సహాయంగా నిలబడిపోయింది. పొంగుకొస్తున్న దుఃఖాన్ని పెద్దరికం అణచిపెడ్తోంది. చెమ్మగిల్లుతున్న కండ్లనుండి జలజలా రాలుతోన్న కన్నీరు మూతికి బిగించుకొన్న మాస్క్‌ను తడిపి ముద్ద చేస్తున్నాయి.

మనిషికి మనిషికి మధ్య హద్దుగా పాటించాల్సిన భౌతికదూరం. కదలికలకు పరిమితులు. నోటి మాటకు ఆంక్షలు. శరీర స్పర్శకు ఆంక్షలు.

గ్లోబల్ విలేజ్ నేడు భయంభయంగా దూరదూరాలకు జరుగుతున్న దుస్థితి. దేశదేశాల మధ్య అనుమానాలు. అపనమ్మకాలు. ఆరోపణలు. అభాండాలు.

"అమ్మా! ఇంటికి వెళ్ళమ్మా!" అంటూ గొంతు పెగల్చుకుని చేతులూపుతోంది రేణుక.

"రామ్మా! ప్లీజమ్మా! అన్నం పెట్టమ్మా! కథలు చెప్పమ్మా! నిద్ర పుచ్చమ్మా! రామ్మా!" రమ్మని చేతులూపుతూ ఏడుస్తూనే వుంది సింధు.

''ఏడవకు తల్లీ! అమ్మ తొందరగానే ఇంటికి వచ్చేస్తానంటుంది" సముదాయించే ప్రయత్నం చేస్తున్నాడు సుదర్శన్. "కాదు. ఇప్పుడే రావాలి. అమ్మను తీసికెళ్ళిపోదాం, రమ్మను." గోల పెడుతున్నది.

భోరున ఏడుస్తున్న సింధుకు అర్థమయ్యేలా ఎలా చెప్పాలో తోచడం లేదు సుదర్శన్‌కు.

రోడ్డుకటు తల్లి – ఇటు కూతురు – మధ్యలో సుదర్శన్. కళ్ళల్లో నీరు సుడులు తిరుగుతోంది.

డాక్టర్ రేణుక దుఃఖం దిగమింగుతూ బైబై చెపుతూ గేటు లోపలకు వెళ్ళిపోయింది.

ఏడుస్తోన్న సింధును అలానే ముందు కూచోబెట్టుకుని బైక్ స్టార్ట్ చేసుకొని ఇంటివైపు దారి తీశాడు.

రేణుక రూంలోకి వచ్చి నిభాయించుకోవడానికి చాలాసేపు పట్టింది. నిలకడలేని మనసులో రకరకాల ఆలోచనలు. కొంతకాలం వరకు ప్రపంచంలోని దేశదేశాల ప్రజల సమస్యలు, ఆలోచనలు రకరకాలు. నేడు ప్రపంచమంతా ఒక్కటే సమస్య. ఒకే ఒక ఉమ్మడి శత్రువు. కోవిడ్–19.

ఒక మహమ్మారి బారినుండి రక్షించుకోవడానికి మానవాళి చేస్తున్న మహాపోరాటం.

స్వీయరక్షణకు ప్రాణహాని కలిగించే క్రిముల విషయంలో అత్యంత జాగ్రత్తలు పాటిస్తున్న ప్రజలు, మానవ అభ్యున్నతికి ఆటంకం కలిగిస్తున్న అవినీతి, కులమతభేదాలు, మూఢనమ్మకాల లాంటి సామాజిక రుగ్మతలనూ దూరం పెట్టలేకపోతున్నారు? పర్యావరణ విధ్వంసానికి పాలబడుతున్నారు? మానవాళి మనుగడకే ముప్పు తెచ్చి పెడుతున్నారు.

ఇప్పటికైనా ఈ మనుషులకు కనువిప్పు కలుగుతుందా? వర్గ దోపిడీలకు, ఆర్థిక అసమానతలకు, ఆధిపత్య పోరాటాలకు స్వస్తి పలుకుతారా? ఏమో! ఏమో! డాక్టర్ రేణుకకు నాలుగు రోజుల తర్వాత తిరిగి కరోనా నిర్ధారణ పరీక్ష చేశారు. నెగెటివ్ రావటంతో స్టాఫంతా పెద్ద రిలీఫ్‌గా ఫీలయ్యారు. క్వారంటైన్ సెంటర్ నుంచి డిశ్చార్జి చేశారు.

ఇంట్లోకి అడుగుపెడుతున్న తల్లిని చూసన్తానే, వడలిపోయిన పువ్వులా వున్న సింధు ముఖం వేయి రేకులతో వికసించింది.

సింధు, "అమ్మొచ్చింది! అమ్మొచ్చింది!" అంటూ పరుగున తల్లిమీదకు దూకి వాటేసుకొంది. కన్నీళ్ళతో ఆర్తిగా కూతుర్ని కౌగిలిలో పొదువుకొంది డాక్టర్ రేణుక. తల్లీకూతుళ్ళిద్దరూ ఎంతోకాలం తర్వాత కలుసుకున్నట్లుగా ఆనందసాగరంలో తేలియాడసాగారు.

రెండ్రోజులు ఇంటిల్లిపాదీ ఒకరినొకరు విడిచిపెట్టకుండా, కబుర్లూ, కథలు, ముచ్చట్లతో గడిపేశారు. మూడు వారాలుగా సుదర్శన్ పడుతున్న మానసిక వ్యథకు రెండ్రోజులు గొప్ప ఊరట లభించినట్లయింది. రోజురోజుకూ దేశంలో, రాష్ట్రంలో పెరుగుతున్న కరోనా కేసులు, మరణాలు, పరిస్థితులు సాధారణ స్థితికి ఇంకా చేరుకోలేదన్న సత్యాన్ని వెల్లడిస్తున్నాయి.

ఈ విరామం, విశ్రాంతి తాత్కాలికమేననీ, ఒక డాక్టర్‌గా కరోనాపై పోరాటానికి రేపో మాపో విధుల్లో చేరాల్సిన బాధ్యతను గుర్తు చేసుకొంటూ మానసిక స్థైర్యాన్ని కూడగట్టుకుంటుంది. కోవిడ్–19 నిర్మూలన సమూలంగా సాధించే లక్ష్యంలో తనూ మరికొంతకాలం నిమగ్నం కావాల్సిందే! ♦

# ఆలో లక్షణా అన్న శోకాలు ...

- సి.హెచ్.వి. లక్ష్మి
9493435649

కరోనా కవిత


*ఎండలు ఎప్పటిలానే మండు తున్నాయి
కరువు కాటకాలు కరోనాతో జత కట్టి
కల్లు తాగి తైతక్క లాడుతున్నాయి
చుక్క నీటి కోసం సీమ
మబ్బుల వైపే చూస్తూ కూచుంది
ఉత్తరాంధ్ర ఉక్కతో ఉక్కిరి బిక్కిరవుతూ
కరోనా విరుగుడు కషాయలకోసం లైన్ కట్టి
గిన్నీసు బుక్‌లో చేరి రికార్డ్ సృష్టించింది
గొంతు తడుపుకుందికి నీటి చుక్క లేక
పోయినా పర్లేదు, కరోనా కౌగిలించుకున్న
అస్సలు పర్లేదు ఒట్టి మందు సుక్క వుంటే సాలనే
అమాయక కథల వెనుక దాగిన
ఆకలి కేకలగూర్చి ఆలోచించే బుర్రలేవి
స్మార్ట్ సిటీలలో రిలీజ్ అయిన వలస సిత్రాలు
నడి రోడ్లపై, రైలు పట్టాలపై, అడవులలో
బాక్స్ ఆఫీస్ బద్దలుకొట్టి నిల్ కలెక్షన్‌లతో
ప్రపంచాన్ని హేళన చేస్తూ
వంద రోజుల అంకె వైపు
శరవేగంగా పరిగెడుతున్నాయి ....*

*చుట్టూ నీరే తాగటానికి చుక్కలేని
నిస్సిగ్గు నిజాలు ఎవరికి ఎరుక
ఆంధ్రుల అందాల విశాఖ చెప్పే కన్నీటి కథల
వెనుక వున్న వేదన చూడలేక
సమాజం సిగ్గుతో తలవంచక తప్పదు
జనాభా ఆకాశాన అడుగుకోసం
శరవేగంతో దూసుకుపోతున్న వేళ
కరోన భూచికి జడిసి భూగోళం
ఎక్కడ దక్కేవాలో తెలియక
బావురుమని బాధాకరంగా ఏడుస్తోంది
బొరియల్లోని ఎలుకల్లా
భూగర్భ జలాలు కాలుష్యం కోరలలో దాగి
ప్రాణాలను తోడేస్తున్నాయి
మేధావుల మాటలు పెడచెవిన పెట్టి
తృణమో ఫణమో పుచ్చుకొని
బద్మాష్ కంపెనీలకు అనుమతి యిచ్చిన
ఘన చరిత మనకే సొంతం*

*శీతల పానీయాల కంపెనీలు
భూగర్భ జలాలను రంజుగా ఆర్పేస్తుంటే
అస్సలు పట్టించుకోని మహానుభావులం*

*నీటి నిల్వలు విషగాలులను వెదచల్లుతుంటే
ఊర్లు ఊర్లు ఆలో లక్షణా అని సోకిస్తున్నాయి
పడిన చిట్టి చినుకులతో కళకళ లాడే
మంచి నీటి చెరువులు కబ్జా దారుల కౌగిట్లో
కమ్మగా కరిగి కలసి పోయాయి
నేల నెర్రలుబారి తిక్కవేషాలు వేస్తూ తొక్క తీస్తోంది
గుక్క నీటి కోసం పడరాని యిక్కట్లు
కాంక్రీట్ జంగల్ లోని జీవులు
దాహంతో తల్లడిల్లుతున్నాయి
ఎటు చూసినా అవే కన్నీళ్ళు అవే కష్టములు
గంగమ్మ తల్లికి మరోసారి బ్రతిమాలి తెచ్చే
భగీరథుని కోసం మరో వంద ఏళ్ళు
వెతుకులాట మరీ వెటకారంగా వుంది
జారే ప్రతి చినుకును ఒడిసి పట్టి భద్రపర్చే దిశగా
ప్రణాళికలు వెంటనే సిద్ధం చేసే వేళయిది ....* ♦

# అనంత మాండలిక పదాల అధ్యయనం




రాయపాటి శివయ్య



- పిళ్లా విజయ్
9490122229

ప్రపంచంలోని ఏ జాతికైనా ఒక భాష యాస ఉంటుంది. అది ఆ జాతి సంస్కృతి సంప్రదాయాలను నాగరికతను ప్రతిబింబిస్తుంది. ప్రతి జాతి తన జాతి అస్తిత్వాన్ని, ముద్రను చెప్పుకోవాలన్న తపన ఉంటుంది. కానీ ప్రపంచీకరణ లో చాలా భాషలు అంతరించి పోతున్నాయి. ఈ నేపథ్యంలో లో ప్రతి జాతికి దాన్ని కాపాడుకోవాలన్న తపన ఉంటుంది. అందులో భాగంగా తెలుగు భాష మాండలిక పదాలను కొత్త తరానికి పరిచయం చేయడానికి ఎంతో శ్రమకోర్చి పరిశోధన చేసి అనేక పదాలను ఏర్చికూర్చి అనంత యాస పుస్తకాన్ని రాయపాటి శివయ్య 2018లో వెలువరించారు. ఇది చాలామంది భాషాభిమానుల మన్ననలు పొందింది.

తెలుగు భాషకు ఇప్పటి రూపం రావడానికి ముందు ఎన్నో పదాలు ప్రజల నోళ్ళలో నాని అవి అందరికీ ఆమోద యోగ్యమైన తర్వాత ఒక ప్రామాణిక రూపంలోకి వచ్చాయి. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని తెలుగు భాషను ఇటలీ శాస్త్రవేత్త నికోలా డి కోంటె అన్నాడు. ఆయన రాయలసీమలో ముఖ్యంగా అనంతపురం, కడప జిల్లాలో క్రీస్తుశకం 1420-28లో పర్యటించాడు. తెలుగు అజంత భాష. ప్రతి తెలుగు పదం అచ్చులతో అంతం కావడాన్ని గమనించాడు. ఇటలీ భాష కూడా అజంత భాష. అందువల్ల తెలుగును తూర్పుదేశపు ఇటలీ భాషగా వర్ణించాడు. ఇలాంటి తెలుగు భాషకు సొగసుతనమంతా జానపదులు మాట్లాడే యాసలో ఉంది. యాసతో పలికే భాష సామెతల్లో నిలిచి ఉంటుంది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో వాడే పదాలలో, పనిముట్లలో, సంప్రదాయాల్లో ఉంటుంది. ఆయా సందర్భాలను గుర్తించి ఆ పదాల వాడకం వెనుక ఉన్న ఆచారవ్యవహారాలను కనుక్కొని తెలియజేస్తే పాఠకుడికి ఆ పదం విశిష్టత అర్థమవుతుంది. రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో ఒక వస్తువుకు సంప్రదాయాన్ని అనుసరించి రకరకాల పేర్లు జిల్లాలను బట్టి వేరు వేరుగా ఉంటాయి. వీటినే ప్రాంతీయ మాండలికం అంటారు. ఈ మాండలికాల పై పక్క రాష్ట్రాల ప్రభావం కూడా ఉంటుంది. ఈ మాండలికమే సీమ అస్తిత్వాన్ని నిలుపుతోంది.

రాయలసీమ అస్తిత్వం భాషతోనే కాక సంస్కృతితో అనుసంధానమై ఉంది. సీమలో సంస్కృతి జాతరలు నిర్వహించడం. ముఖ్యంగా గంగమ్మ జాతర. ఈ గంగమ్మ జాతర సీమలోని నాలుగు జిల్లాల్లో జరుగుతూ ఉంటుంది. తెలంగాణలో జరిగే బతుకమ్మ పండగ లాంటిది ఈ జాతర. ఆహార ఆచార వ్యవహారాల్లో ప్రజల నోళ్ళలో వాడే పదాలు మాండలికాలయ్యాయి.

ప్రజల్లో ఉన్న వాడుకని బట్టి యాస కలిగిన పదాలను 27 రకాలుగా రాయపాటి విభజించాడు. వాటి నానార్థాలు, పర్యాయపదాలు దాని వెనుక ఉన్న వ్యవహారాలు కూడా సేకరించి రాశాడు. ఒక పదాన్ని విరివిగా వాడుతున్నారు అంటే అదే ఆ ప్రాంత యాసగా గుర్తించవచ్చు. గోదావరి జిల్లాల్లో ఆయ్ అనే పదం అందరూ వాడుతుంటారు. ప్రతి పదానికి

దీర్ఘం కూడా తీస్తారు. ఇది ఆ ప్రాంత వ్యవహారిక మాండలిక భాషగా దాన్ని మనం గమనించవచ్చు.

మాండలికంలో ఎంత బాగా మాట్లాడినా అందరికీ అర్థం కాదు. ఎందుకంటే కాలగమనంలో భాష, యాస మారిపోతూఉంటుంది. ముఖ్యంగా ఆంగ్ల భాష ప్రభావం వల్ల తెలుగు భాషలో పలు మార్పులు వచ్చాయి. పాళీ భాషలో తెలుగు పదాలు ఎక్కువగా ఉండేవంటారు. మెల్లగా పాళీ భాష అంతరించిపోయినా తెలుగు భాష మాత్రం నిలబడింది. ద్రవిడ భాషా కుటుంబం నుంచి విడివడి నిలదొక్కుకుంది. రాయలసీమలోని కడప జిల్లాలో కమలాపురం మండలంలో లభించిన కలమళ్ళ శాసనం ( క్రీ.శ.575), ఎర్రగుడి పాడు శాసనం(క్రీ.శ.600) మొదలైన శాసనాల ద్వారా తెలుగు భాషకు రెండు వేల ఏళ్ల చరిత్ర ఉందని ప్రపంచానికి తెలిసింది. రాయలసీమే తెలుగు భాషకు ఆయువు పట్టుగా నిలిచింది.

భాష నిరంతర మార్పులకు గురవుతూ వచ్చింది. నన్నయ కాలంలో సంస్కృత పదాలకు చివర దు,ము,వు,లు చేర్చి తెలుగు పదాలుగా మార్చారు. అందువల్ల తెలుగు ఒక రకంగా సంస్కృతీకరింపబడింది. చాలా కాలం తెలుగు భాష ఇలాగే కొనసాగింది. అయితే గురజాడ, గిడుగు భాషోద్యమం ఫలితంగా తెలుగు భాష నేటి వాడుక భాష రూపంలోకి వచ్చింది. అయినప్పటికీ నేటికీ సీమవాసులు తమ రచనలను ప్రామాణిక భాషలోనే రాస్తున్నారు. పులికంటి, సడ్లపల్లి, నామిని లాంటివారు మాండలికంలో రచనలు చేయడం వల్ల కూడా మాండలిక రచనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి.

వాటి కర్థాలు కావాలంటే ఒక నిఘంటువు కావాలి. అలాంటి నిఘంటువే రాయపాటి శివ రాసిన 'అనంత యాస'.

స్త్రీలు బహిష్టు కావడాన్ని బయట చేరడం, ముట్టు లాంటి పదాలు నేడు పల్లెల్లో ఇప్పటికీ వాడుతున్నారు. ఈ పదాలు మెల్లగా డేట్ రావడంగా మారిపోతున్నాయి. ఈ పదాల అర్థాలు, మూఢ విశ్వాసాల గురించి రచయిత వివరణ బాగుంది. దీనికి సంబంధించి అనేక మూఢ విశ్వాసాలు నేటికీ ఉన్నాయి. ఇటీవల గుజరాత్లో వంటశాలలోకి బహిష్టు అయిన అమ్మాయిలు ప్రవేశించారని వంట అపవిత్రమైందని వారందరినీ నగ్నంగా నిలబెట్టి ఎవరు బహిష్టయ్యారో పరిశీలించారని పత్రికల్లో వచ్చింది. ఇంకా ఇలాంటి మూఢ విశ్వాసాలు అనంతపురం జిల్లాలోని మడకశిర ప్రాంతంలో ఉన్నాయి. దీనిని ప్రముఖ రచయిత శాంతినారాయణ 'ముట్టుగుడిసెలు' కథలో కూడా ప్రస్తావించారు. ఇంకా కొన్ని ఛాందస వర్గాల ఇళ్ళలో అమ్మాయిలను బహిష్టు సమయంలో అంటు పేరుతో విడిగా ఉంచడం చాలా శోచనీయం.

'పొద్దున్నే లేచి నాదు ఖాదరయ్యా, సద్ది మొగం కడిగి నాడు ఖాదరయ్యా' అనే ప్రసిద్ధ జానపద పాట ఒకటుంది. ముందురోజు అన్నాన్ని నీళ్ళలోనో, మజ్జిగలోనో నానబెట్టి మరుసటి రోజు పొద్దున్నే తింటారు. రాయలసీమలో దీన్ని సద్ది అంటారు. వేసవి కాలంలో ఇది సల్ల(చలువ) చేస్తుందని భావిస్తారు. పెద్దల మాట సద్ది మూట అని ఒకసామెత కూడా ఉంది.

ఈ గ్రంథంలో అనంతపురంలోని కదిరి ప్రాంతంలో వాడే చాలా పదాలను కదిరిలో, హిందూపురంలో ఎలా వాడతారో వివరించారు. ఆనకాగు, గోరుబిళ్ళ, ఉక్కిరి (తీయని ముద్ద), దొగ్గడ (రేగు పండ్ల పచ్చడి), తొణక్కట్టి, మక్కిరి (వెదురు అల్లిక ) ఇలా చాలా పదాలు వ్యవసాయ సంబంధిత పదాలు కదిరి ప్రాంతంలో ఎలా వాడుకలో ఉన్నాయో వివరించారు రాయపాటి.

అచ్చ తెలుగు పదాలు ప్రజా వ్యవహారంలో ఉండేవి. అవి కాస్త ఇంగ్లీషు భాషా ప్రయోగంలో వాటి వాడకం పూర్తిగా కనుమరుగైంది. కమానును ఇప్పుడు ఆర్చ్ అంటున్నారు. చౌరస్తాను సర్కిల్ అంటున్నారు. లోటాను ఇప్పుడు గ్లాసు అంటున్నారు. ఉద్దరగా వస్తుంటే అనే మాటను అన్నీ ఫ్రీగా వస్తుంటే అని చెప్తున్నారు. పాలి మాలికి అనేదాని బదులు రెస్ట్ లేక అని అంటున్నారు. బిరీన, బిరిక్కిన బదులు అంతా స్పీడు అనంటున్నారు.


ప్రపంచీకరణ ప్రారంభమయ్యాక కంప్యూటర్లు నిత్యజీవితంలో చొచ్చుకొని వచ్చాక అనేక వృత్తులు ధ్వంసమయ్యాయి. వృత్తులతో పాటు వాటి సంబంధ పనిముట్లు, పనులు వాటి పదాలు మెల్లగా వాడుకలోంచి పోయాయి. దాంతో ఆయా మాండలికాలు నేడు చాలా మందికి అర్థంకానివిగా మారిపోయాయి. అయితే వాటి అర్థాన్ని తెలుసుకోవాలంటే తప్పకుండా ఇలాంటి మాండలిక నిఘంటువులు అవసరం. కర్నూలు కడప చిత్తూరు మాండలికాల నిఘంటువులు కూడా తయారుచేసి వాటన్నిటినీ కలిపి సీమ మాండలికాలు గా ఒక గ్రంథాన్ని వెలువరిస్తే అది భాషావేత్తలకు, సాహిత్యాభిలాష గలవారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ దిశగా రాయపాటి శివయ్య కృషి చేస్తారని ఆశిద్దాం ◆

## కవిత

# మర్రి మనిషి

డా. ఉదారి నారాయణ
9441413666

ఒక మహానేత
నిష్క్రమించిన నిశ్శబ్దం
ప్రజల మనిషి కాలంచేసిన విషాదం
పశువులు, పక్షులు, పిల్లలు పెద్దలు
కలిమి లేములను కుప్పబోసుకునే
సామూహిక సాంత్వన స్థలం.
ఏ గింజ అశోకుని మునివేళ్ళనుంచి
జారి
మట్టిని చేరిందో
మూడు తరాలను తీరందాకామోసి
కొనవూపిరితో కాపాడిన చెట్టుతల్లి
ఎవరు వచ్చి నడుము వాల్చినా
కొంగు పరిచి ఆకుల విసనకర్రలతో
సేద దీర్చే పినతల్లి మా ఊరి మర్రి
చెట్టు.
మర్రి నీడలో గతాన్ని నెమరేస్తున్న
ఎండుటాకులకు
నిండైన మనసు రంజన్
ఈ ఆకుల ఇల్లు.
వేల పీడీల జీవన తాత్వికత ఈ
మర్రిచెట్టు.
ఈ చెట్టును చూస్తుంటే
నాటి తాతలతో
ముచ్చటించినట్లుంటది.
వాళ్ళ అనుభవాలను
ఏరుకుంటున్నట్లుంటది.



జీవిత సత్యాలను కుప్పబోసే
వేదాంత వాటిక
ఈ జీవాశ్రమం.
ఎండాకాలం
మండే సూర్యుడు సైతం
ఈ మర్రి నీడకు రావడానికి
ఉబలాట పడతాడు.
వానాకాలం పిట్ట గూళ్ళతో  పక్షి జాతరవుతుంది.
తల్లులచ్చేదాకా పిల్లలకు
ఆకుల పంకాలూపే  అమ్మమ్మ
ఈ పచ్చ గాలి చెట్టు.
గాలి వానలు ఉరుములు మెరుపులకు
భీతిల్లే పక్షులకు చెక్కుచెదరని పెద్దదిక్కు
ఈ మనిషి చెట్టు.
మంచు  కాలంలో
పచ్చ చద్దర్లను కప్పే వెచ్చని గుండె గల నానమ్మ.
ముసాఫర్లకు సంచారులకు
ఊడల రక్షణశాల ఈ ఆకుల టెంటు.
ఇప్పటికీ అక్కడికెళ్తే
నా బాల్యపు చిన్నెలు పిలుస్తున్నట్టే అనిపిస్తుంది.
ఎక్కడికెళ్తాం
స్వార్థపు రంపపు కోతలకు
ముక్కలు ముక్కలై
అరకంటి ఆయుష్షుతో పొగలు కక్కుతూ దుఃఖిస్తున్నది. ◆

# కాటేసిన విష వాయువు

కొలిపాక శ్రీనివాస్
9866514972

జనమంతా మెళుకువ రాని
గాఢనిద్రలో..
ఉలిక్కిపడింది విశాఖ
నిర్లక్ష్యపు ఆటలో
మూకుమ్మడిగా
ఒక నిశ్శబ్దపు ఉపద్రవం
విష వాయువై కాటేసింది.
అమ్మ ఒడిలో ఆడుకునే బాల్యం
రెక్కలు తెగిన పక్షిలా
తారు రోడ్డు పై మృత్యు
శకలాలు గా మారిరీ.
విషవాయువు విసిరిన
వలలో చిక్కి..
ఒడ్డున పడిన చేపపిల్లలా...
విలవిలలాడుతున్న ప్రాణాల్ని
విషాన్ని చిమ్మిన వాయువు
ఊపిరిని బిగబట్టి
కాలగర్భంలో కప్పేసింది.



విగతజీవుల రోదన
గుండెల్ని బాధిస్తుంది.
విషవాయువు సుడిలో
తెగిన గాలిపటం లా
ప్రాణం పోసే చేతుల కోసం
చెమ్మగిల్లిన కళ్ళు ఆశగా...
నింగి కేసి చూస్తున్నవి. ◆

# ఆరుద్ర


31.08.1925 – 04.06.1998



SAHITYA PRASTHANAM ■ SAMPUTI - 1 ■ SANCHIKA - 9 ■ KRISHNA ■ JUNE 2020
RNI N0.APTEL/ 2004/18396 ■ Postal Regd. No.VJ/187/2020-22 PAGES: 68
Date of Posting : 1st & 2nd of Every Month ■ Date of Publication: 01.06.2020




# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు



పండుగలు - ప్రాశస్త్యం పేజీలు 48 రూ. 40/-

మనం నిత్యం జరుపుకునే పండుగలు, ఉత్సవాలు, జాతరలు, కొలుపులు మొదలైనవన్నీ మన సంస్కృతిలో భాగం. ఇవన్నీ మతపరమైనవి కావు. కొన్ని పండుగలు పూర్తిగా మానవుని ఉత్పత్తికి సంబంధించి– అంటే వ్యవసాయం, పశుపోషణ వంటి వాటికి సంబంధించి ఉంటాయి. కొన్ని ప్రకృతిపై మానవుడు విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని జరుగుతుంటాయి. కొన్ని పండుగలు పూర్తిగా మతనమ్మకాలు, కథలపై ఆధారపడి ఉంటాయి. అయితే వీటన్నిటినీ ఇలా పూర్తిగా విడదీసి చూడ్డం కూడా కష్టం. వాటిని ఏవిధంగా చూడాలి అన్న ప్రశ్నకు సమాధానం ఈ చిన్న పుస్తకం.

## ప్రతిభామూర్తులు పసిడి పలుకులు



పేజీలు 80
రూ.65/-

వివిధ రంగాల్లో నిష్ణాతులైన కొందరి ప్రతిభా మూర్తుల ఇంటర్వ్యూల సమాహారం ఈ 'ప్రతిభా మూర్తులు – పసిడిపలుకులు' పుస్తకం.. నాట్యం, సినిమా, ఫొటోగ్రఫీ, శిల్పకళ, సాహిత్యం, మిమిక్రీ తదితర రంగాలలో వెలుగొందిన, వెలుగొందుతున్న వారి జీవిత అనుభవాల సారమంతా ఈ చిన్ని పుస్తకంలో లభ్యమవుతుంది.

## వేద సాహిత్యం
### ఒక చారిత్రక పరిశీలన



పేజీలు 32
రూ.25/-

15 వేల ఏళ్ల సుదీర్ఘ కాల వ్యవధిలో రూపొందిన వేద వాఙ్మయపు అభివృద్ధి గతిని గురించి తెలుసుకోవాలంటే ప్రాచీన భారతీయ చరిత్రలోని తొలి ఘట్టాల వరకు వెళ్ళాలి. వీటన్నింటికి సంబంధించిన సమగ్ర సమాచారం ఈ పుస్తకంలో లభిస్తుంది.

## గౌతమ బుద్ధుడు - బౌద్ధతత్వం




పేజీలు 32
రూ.25/-

బుద్ధుడి మూల బోధనలు, సిద్ధాంతాల నుంచి తరువాత కాలంలోని బౌద్ధధర్మం ఎంత దూరంగా మళ్ళిందో నిర్ధా రించడానికి ఈ పుస్తకంలో అనేక ఉదాహరణలు పేర్కొనబడ్డాయి.

బౌద్ధతత్వంలోని ప్రయోజనకరమైన అంశాలను అధ్యయనం చేయడం, అదేవిధంగా బౌద్ధధర్మం చరిత్రకు సంబంధించిన మరుగునపడ్డ అసలు వాస్తవాలను వెలికితీసి గౌతమ బుద్ధుని మూల సిద్ధాంతాల సారాంశం వివరించడమే ఈ పుస్తకం ఉద్దేశం.

## భారతీయ భౌతికవాదం
## లోకాయత



పేజీలు 32
రూ.25/-

భారతీయ భౌతికవాదం మొదటినుంచి ఆధునికయుగం వరకు ప్రపంచంలో అన్నిచోట్లలాగే భారతదేశంలోనూ భౌతికవాద భావస్రవంతి కొనసాగుతూనే వచ్చిందని బలమైన ఆధారాలతో ఋజువు అయ్యింది. అటువంటి భౌతికవాద భావస్రవంతిలో ఒకటైన లోకాయత గురించి వివరించేదే ఈ పుస్తకం.

## ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ – 2, ఫోన్ : 0866 – 2577533
**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059**